

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 135

శనివారం 5-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



The Perfect Life,
Styled for You!


2, 3 & 4 BHK Flats

@ Centrally located in Narsingi,
Near Financial District

Starting at ₹1.80 Cr.*







2 Clubhouses - 50+ World Class Amenities

Children's Play Area | Fitness Centres | Sports Arenas
Yoga & Meditation Deck | Supermarket | Swimming Pool
Pharmacy | Spa & Salon | Party Lawn & Halls

*T&C Apply

Unflinching Commitment to Customers
Delight earns us Recognition & Laurels



INDIAN ACHIEVERS AWARDS 2023

SRI YERRAM VIJAY KUMAR
CHAIRMAN & MD, VASAVI GROUP
RECEIVING THE AWARD FROM
HON'BLE MINISTER FOR ROAD TRANSPORT & HIGHWAYS IN THE GOVERNMENT OF INDIA
SRI NITIN GADKARI

- Trusted Developer of The Year 2022
- Best Ultra Luxury Apartment Ongoing Vasavi Skyla 2022
- Exemplary Contribution to Real Estate Hyderabad 2021
- Premium Affordable Project of the Year 2021
- Trusted Developer of the Year 2019

A Legacy of 3 Decades of Trust and Quality

- **50** Million sft. to be built in the next 5 years
- **17** Commercial Projects
- **310** Acres of Villa plots sold
- **8** Million sft. built
- **4510** Apartments built till date
- **30** Residential Projects

Vasavi Atlantis, Narsingi,
Near Financial District, Hyderabad.
www.vasaviatlantis.com

TS RERA: P02400003398

95335 14444

Disclaimer: This Advertisement does not constitute an offer and / or acceptance / or contract / or agreement and / or transaction and / or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. The pictorial / other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock / standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. **All norms, requirements pertaining to the environment, Fire Services, HMDA Rules and Regulations have been adhered to while designing the property.**

సత్యమేవ జయతే


సాక్షి


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 135


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేడు రాజ్‌భవన్ ముట్టడి

'ఆర్టీసీ కార్మికుల విలీన బిల్లు'ను పరిశీలన కోసం గవర్నర్ ఆపడాన్ని నిరసిస్తూ రాజ్‌భవన్ ముట్టడికి కార్మిక సంఘాలు నిర్ణయించాయి.

- వివరాలు 2లో



ఆ బిల్లులు మళ్లీ పాస్

గవర్నర్ గతంలో తిరస్కరించిన నాలుగు బిల్లులను రాష్ట్ర శాసనసభ రెండో రోజు సమావేశాల్లో తిరిగి అమోదించింది.

- వివరాలు 2లో


పార్టీ కేంద్ర కార్యాలయంలో ఖర్గే, రాహుల్

మళ్లీ ఎంపీగా రాహుల్ గాంధీ!

రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు

- పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేతకు భారీ ఊరట
- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- ఇక సభ్యత్వం పునరుద్ధరణ!
- వచ్చే ఎన్నికల్లో పోటీకి లైన్‌క్లియర్

6లో

సత్యమే జయిస్తుంది

- సుప్రీం తీర్పుపై రాహుల్
- విపక్ష కూటమిలో హర్షాతిరేకాలు

6లో

ఎలక్షన్.. యాక్షన్!



అసెంబ్లీ ఎన్నికల మోడ్‌లోకి ముఖ్యమంత్రి కేసీఆర్

అక్టోబర్‌లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో హ్యాట్రిక్ విజయం కోసం వ్యూహాలు

- వరుసగా కీలక ప్రకటనలు చేస్తున్న సీఎం
- రుణమాఫీ, ఆర్టీసీ విలీనం, పింఛను పెంపు ఈ కోవలోనివే.. పథకాల అమలులో వేగం పెంపు
- ఇంకా అమలు కాని పథకాల తక్షణ పూర్తికి చర్యలు
- రైతులు, ఉద్యోగులు సహా ప్రతి వర్గానికీ లబ్ధి
- విపక్షాలకు అస్త్రాలు లేకుండా చేయడమే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎన్నికల కార్యాచరణపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్ర శాసనసభకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అక్టోబర్‌లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచుతున్నారు. కరోనా, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇప్పటివరకు అమలు చేయని పలు పథకాలను యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ స్థితిగతులపై నిశిత పరిశీలనతో ఖరారు చేసుకున్న వ్యూహాలను ఒకటొకటిగా అమలు చేస్తున్నారు. తద్వారా ప్రధాన విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలకు చెక్ పెట్టాలని, రాబోయే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో లబ్ధి పొందాలనే ఆలోచనలో

మిగతా 3వ పేజీలో ▶

టీడీపీ రాక్షస క్రీడ

రక్తపాతం లక్ష్యంగా చంద్రబాబు స్కెచ్..

- ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో భారీ కుట్ర
- రూట్ మ్యాప్ మార్చి పుంగనూరులోకి వచ్చేందుకు యత్నం
- టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టిన టీడీపీ అధినేత
- బీరు సీసాలు, కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడి.. రెండు పోలీసు వాహనాలకు నిప్పు పెట్టిన టీడీపీ మూకలు
- అంగళ్ల వద్ద దాడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తీవ్ర గాయాలు

11లో

క్లుప్తంగా...

త్వరలో 'కేసీఆర్ విద్యా కానుక': గంగుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు తలెత్తుకొని తిరిగేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శాసనమండలిలో శుక్రవారం 'రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు'అనే అంశంపై లఘు చర్చ జరిగింది. సంక్షేమంపై పలువురు సభ్యులు అడిగిన పలు ప్రశ్నలపై మంత్రులు స్పందించారు. బీసీ సంక్షేమంపై మంత్రి గంగుల మాట్లాడుతూ కేసీఆర్ తీసుకున్న చర్యలతో బీసీల్లో ఆత్మగౌరవం ఎన్నోరెట్లు పెరిగిందన్నారు. త్వరలోనే కేసీఆర్ విద్యాకానుక పథకాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశంలోనే ఎవరూ చేయలేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గిరిజన వర్గాలను కేసీఆర్ జనజీవనంలో ఉన్నతస్థానంలో నిలిపారన్నారు.

వైద్యుల కర్మాగారంగా తెలంగాణ: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: వైద్యుల కర్మాగారంగా తెలంగాణ మారిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిచ్చారు. 'తెలంగాణ వైట్ కోట్ రివల్యూషన్ సాధించింది. ఆ మేరకు మెడికల్ కాలేజీలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది దేశంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన సీట్లలో 43% తెలంగాణ నుంచే ఉన్నాయి. త్వరలోనే మండలస్థాయిలో త్వరలోనే 40 ప్రాథమిక ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది వరంగల్ హెల్త్ సిటీని ప్రారంభిస్తాం' అని మంత్రి హరీశ్‌రావు వివరించారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే ఫ్లైఓవర్లు జాప్యం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ''హైదరాబాద్‌లో వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ) కింద పూర్తి చేసిన 35 ప్రాజెక్టులు సీఎం కేసీఆర్ సమర్థతకు నిదర్శనం. అదే ఉప్పల్, అంబర్‌పేట ఫ్లైఓవర్లు పూర్తికాకపోవడం కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అసమర్థతకు, చేతగానితనానికి ప్రతీక..''అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. రాష్ట్రం ఆధ్వర్యంలో ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మిస్తామంటే కేంద్రం అంగీకరించలేదని, జాతీయ రహదారి పేరిట తామే నిర్మిస్తామందని కేటీఆర్ చెప్పారు. దానికోసం రూ.190 కోట్లతో 253 ఆస్తులను సేకరించి రెండేళ్ల కిందే అప్పగించామని.. అయినా కేంద్రం ఉప్పల్ ఫ్లైఓవర్‌ను పూర్తి చేయలేదన్నారు.

అంతా బాగుంటే.. అక్షరాస్యతలో అడుగునెందుకున్నాం: ఈటల



సాక్షి, హైదరాబాద్: రెసిడెన్షియల్ పాఠశాలలు గొప్పగా ఉన్నాయని ఓవైపు చెప్పుకొంటున్నప్పటికీ, 28 లక్షల మంది ఉండే ప్రభుత్వ బడుల విద్యార్థుల సంఖ్య 22 లక్షలకు పడిపోయిందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తిస్తున్నట్టు లేదని బీజేపీ సభ్యుడు ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ అక్షరాస్యత జాబితాలో మన రాష్ట్రం కింది నుంచి నాలుగో స్థానంలో ఉందని గుర్తించాలన్నారు. శుక్రవారం శాసనసభలో విద్య–వైద్యంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. 2218 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బాసర ఐఐఐటీలో పూర్తిస్థాయి నియామకాలు లేక పరిస్థితి దిగజారుతోందన్నారు. ఈటల ప్రసంగానికి మంత్రి హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'రెండేళ్ల క్రితం ఈటల రాజేందర్.. తాను చదువుకున్నప్పుడు పురుగుల అన్నం తిన్నానని, కేసీఆర్ వల్ల ఇప్పుడు హాస్టల్ విద్యార్థులు నాణ్యమైన సన్న బియ్యం బువ్వ తింటున్నారని అన్నారు. ఇటు నుంచి అటు ఆయన మారగానే ఇక్కడ పరిస్థితులు దిగజారిపోయాయా?'అంటూ ప్రశ్నించారు.



గవర్నర్ తిరస్కరించిన బిల్లులు మళ్లీ పాస్

నాలుగు బిల్లులను తిరిగి ఆమోదించిన శాసనసభ

- ఈసారి గవర్నర్ ఆమోదించడం తప్పనిసరి!
- శుక్రవారం రాత్రి వరకు జరిగిన అసెంబ్లీ రెండోరోజు సమావేశాలు
- పలు అంశాలపై ప్రశ్నోత్తరాలు, లఘు చర్చలు కొనసాగింపు
- కాంగ్రెస్, బీజేపీ వాయిదా తీర్మానాలను తిరస్కరించిన స్పీకర్
- రాత్రి 10 గంటల సమయంలో బిల్లులు పాస్
- నేటికి సమావేశాలు వాయిదా.. మరో మూడు బిల్లులను ప్రవేశపెట్టనున్న మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ రెండో రోజు సమావేశాల్లో కీలకమైన 4 బిల్లులకు తిరిగి ఆమోదం లభించింది. అసెంబ్లీ గతంలోనే పురపాలక శాసనాల చట్టం (సవరణ) బిల్లు, ప్రభుత్వ ఉద్యోగ (పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ)బిల్లు, రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల (స్థాపన, క్రమబద్ధీకరణ) సవరణ బిల్లు, పంచాయతీరాజ్ చట్ట (సవరణ) బిల్లులను పాస్ చేసింది. ప్రభుత్వం వాటిని గవర్నర్ తమిళిసైకి పంపించినా ఆమోదముద్ర వేయలేదు. ఆయా బిల్లుల్లోని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తిప్పిపంపేశారు. ఈ క్రమంలో ఆ నాలుగు బిల్లులను పునః పరిశీలించాలంటూ సంబంధిత మంత్రులు శుక్రవారం రాత్రి శాసనసభలో ప్రతిపాదించగా ఆమోదం లభించింది. శాసనసభ రెండోసారి పాస్ చేసి పంపుతున్న నేపథ్యంలో ఈ బిల్లులను గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఉదయం నుంచి ప్రశ్నోత్తరాలు, లఘు చర్చలతో

శుక్రవారం ఉదయం 10 గంటలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శాసనసభ రెండో రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంకేతిక సేవల సంస్థ, ఉద్యాన అభివృద్ధి సంస్థ, విద్యుత్ సరఫరా సంస్థ, ఉపాధ్యాయుల బదిలీల నియమావళి, చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ, అటవీ అభివృద్ధి సంస్థల నివేదికలను సంబంధిత మంత్రులు సభకు సమర్పించారు. తర్వాత ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ఎజెండాలో పది ప్రశ్నలు ఉన్నప్పటికీ సమయాభావం కారణంగా.. ఐటీ ఎగుమతులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలు, చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు, ఆరోగ్య లక్ష్మి పథకం తదితర అంశాలపైనే మంత్రులు సమాధానాలిచ్చారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యేలు కె.విజయరామారావు (ఖైరతాబాద్), కొమిరెడ్డి రాములు (మెట్‌పల్లి), కొత్తకోట దయాకర్‌రెడ్డి (మక్తల్), సోలిపేట రామచంద్రారెడ్డి, (దొమ్మాట), చిల్కూరి రామచంద్రారెడ్డి (ఆదిలాబాద్) మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. ఇటీవల సంభవించిన వరదలపై కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, బీజేపీ సభ్యుడు రఘునందన్‌రావు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. జీరో అవర్ తర్వాత మధ్యాహ్నం 12.05కి స్పీకర్ టీబ్రేక్ విరామం ఇవ్వగా.. సభ తిరిగి 12.50కి సమావేశమైంది.



వరదలు, విద్య, వైద్యారోగ్యంపై లఘు చర్చ

రెండో రోజు సమావేశం ఎజెండాలో భాగంగా రెండు అంశాలపై లఘు చర్చ జరిగింది. భారీ వర్షాలు, వరదల నష్టం, ప్రభుత్వం తీసుకున్న చర్యలపై జరిగిన చర్చకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. అయితే తాము లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందించలేదంటూ కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. తర్వాత రాష్ట్రంలో విద్య, వైద్యారోగ్య రంగాలపై చర్చను ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ ప్రారంభించారు. దీనిపై రాత్రి 8 వరకు సభ్యుల ప్రసంగాలు కొనసాగాయి. తర్వాత మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, హరీశ్‌రావు ఆయా అంశాలపై సమాధానాలిచ్చారు. రాత్రి 10.20 వరకు సమావేశం కొనసాగగా.. కీలక బిల్లులను ఆమోదించాక శనివారం ఉదయం 10 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

గవర్నర్ తిరస్కరించడంతో..

అసెంబ్లీ సమావేశాల్లో ఎనిమిది బిల్లులను ప్రవేశపెడతామని బీఏసీ సమావేశంలో ప్రభుత్వం తెలిపింది. అందులో గవర్నర్ తిప్పిపంపిన నాలుగు బిల్లులను శుక్రవారం సభలో ప్రవేశపెట్టారు. పురపాలక బిల్లును మంత్రి కేటీఆర్, ప్రభుత్వ ఉద్యోగ (పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ) బిల్లును మంత్రి హరీశ్‌రావు, ప్రైవేటు వర్సిటీల బిల్లును మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీరాజ్ బిల్లును ఎర్రబెల్లి దయాకర్‌రావు సభకు సమర్పించారు. వాటిని పునః పరిశీలించి ఆమోదించాలని కోరారు. ఈ బిల్లులను తిరస్కరిస్తూ గతంలో గవర్నర్ కార్యాలయం నుంచి మూడు సందేశాలు అందాయని ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. వీటిపై సభ్యుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాక.. బిల్లులను సభ ఆమోదించినట్టు ప్రకటించారు. ఇక శనివారం సభలో 'తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ బిల్లు, ఫ్యాక్టరీల చట్టం సవరణ బిల్లు, రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ (సవరణ) బిల్లులను ప్రవేశపెట్టనున్నారు.

సభ్యులు సభలో ఉండాలి: కేటీఆర్

శాసనసభ సమావేశాలను 30 రోజులు జరపాలని బీజేపీ, 20 రోజులు జరపాలని కాంగ్రెస్ కోరాయని.. కానీ చర్చల సమయంలో ఆ పార్టీల సభ్యులు సభలో ఉండటం లేదని మంత్రి కేటీఆర్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభలోకి రాగా.. ''శ్రీధర్ బాబుగారికి వెల్కమ్. శాసన సభ్యులు కచ్చితంగా సభలో ఉండేలా చూడాలి. సభలో ఉండి సమాధానాలు వినాలి. బయటికి వెళ్లి అటూ ఇటూ తిరగడం, మీడియాతో మాట్లాడడం సరికాదు''అని కేటీఆర్ పేర్కొన్నారు. దీనిపై రాజాసింగ్ స్పందిస్తూ.. తనతోపాటు రఘునందన్‌రావు బీజేపీ తరఫున ఉన్నారని పేర్కొన్నారు. దీంతో బీజేపీ నుంచి సస్పెండైన మీరు ఆ పార్టీ ఎమ్మెల్యే కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇక జీరో అవర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేవనెత్తిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. ''మీరు సంగారెడ్డి వరకు మెట్రో కోరితే.. మేం ఇస్నాపూర్ వరకు మంజూరు చేసినా అభినందించడం లేదు. సంగారెడ్డి, ములుగు, పెద్దపల్లిలకు మెడికల్ కాలేజీలు మంజూరు చేసినా.. ప్రభుత్వాన్ని అభినందించేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీతక్క, జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబులకు మనసు రావడం లేదు..''అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

విద్యారంగంపై ఇంత నిర్లక్ష్యమా?

- శాసనసభలో ప్రభుత్వంపై భట్టి ధ్వజం
- భట్టి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి దారుణంగా ఉందని, క్రమంగా అది తీసికట్టుగా మారుతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. విద్య–వైద్యంపై శుక్రవారం శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో పాల్గొంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యారంగానికి సంబంధించి ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. వాస్తవంగా పరిస్థితులు బాగా లేవని, తెలంగాణ వచ్చాక విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయని అంకెలతో సహా వివరించారు. అయితే, భట్టి విక్రమార్క సభను, తద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే అంకెలు చెబుతున్నారని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం విద్యాశాఖ బడ్జెట్‌ను మాత్రమే భట్టి పేర్కొంటున్నారని, ఇతర శాఖల ద్వారా కూడా విద్యారంగానికి జరుగుతున్న కేటాయింపులను ఆయన ప్రస్తావించలేదని అన్నారు. దీనికి భట్టి జవాబు ఇస్తూ, ప్రతి సంవత్సరం బడ్జెట్ పద్దు పెరుగుతున్నప్పుడు, ఆ దామాషా ప్రకారం విద్యా రంగానికి కేటాయింపులు లేక పోవటం అంటే బడ్జెట్ తక్కువ ఇచ్చినట్టేనంటూ మళ్లీ సభ ముందు లెక్కలు ఉంచారు.

ఇదేనా మీ స్ఫూర్తి: స్పీకర్‌పై భట్టి అసహనం..

తాను మాట్లాడుతుండగా మంత్రులు పదేపదే అడ్డు తగులుతుండటం, ప్రసంగాన్ని ముగించాలని స్పీకర్ బెల్ కొడుతుండటంతో ఓ దశలో భట్టి అసహనం వ్యక్తం చేశారు. 'నేను ఐదు నిమిషాలు మాట్లాడితే, మంత్రులు పది నిమిషాలు అడ్డుతగులుతున్నారు. వారు లేచినప్పుడల్లా మీరు వారికి మైక్ ఇస్తున్నారు. ఇదేనా మీ ప్రజాస్వామ్య స్ఫూర్తి?' అని ప్రశ్నించారు. కాగా, వచ్చే అసెంబ్లీకి బీఆర్‌ఎస్ నుంచి 15 మంది ఎమ్మెల్యేలు కూడా వస్తారో రారో తెలియదని, అంతకు మించి అయితే రారని భట్టి వ్యాఖ్యానించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సభ జరుగుతున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యపై కేంద్రం వివక్ష!

మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: విద్య విషయంలో రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపిస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. జాతీయ సంస్థల కేటాయింపులో ప్రతిసారీ రాష్ట్రానికి మొండిచేయి చూపుతోందన్నారు. 'విద్య, వైద్య రంగాల బలోపేతం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు, పురోగతి'పై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చకు ఆమె బదులిచ్చారు. 'రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి 2020 వరకూ విద్యపై రూ.96 వేల కోట్లు ఖర్చు చేసిందని కాగ్ వెల్లడించింది. ఈ ఏడాది రూ.29 వేల కోట్లు ఖర్చు చేశాం. తెలంగాణ వచ్చాక 1,342 గురుకులాలు ఏర్పాటు చేశాం. ఉన్నత విద్యకు రూ.17 వేల కోట్లు ఖర్చు చేశాం. ఫలితంగా రాష్ట్రంలో విద్యార్థుల ప్రవేశాల రేటు 36.2 శాతం ఉంది. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ..'అని సబిత తెలిపారు.

వరద సాయమేదీ?.. ✗ మీకు మాట్లాడే హక్కు లేదు!

శాసనసభలో శ్రీధర్‌బాబు వర్సెస్ మంత్రి కేటీఆర్

- భారీ వర్షాలు, వరదలతో 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్న శ్రీధర్‌బాబు
- రైతులకు రూ.1,500 కోట్లు నష్ట పరిహారంగా ఇవ్వాలని డిమాండ్
- ఉచిత విద్యుత్ వద్దన్న వారికి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదన్న కేటీఆర్
- 'మూడు గంటల విద్యుత్ అంశం'పై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల నష్టం, బాధితులకు ఆర్థిక సాయం అంశాలపై అసెంబ్లీలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చ అధికార, విపక్షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధానికి దారితీసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ విమర్శలు చేస్తుండగా.. పలువురు మంత్రులు అడ్డుకున్నారు. దీంతో సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క అధికార పార్టీపై విరుచుకుపడ్డారు. ఇదే సమయంలో మంత్రి కేటీఆర్ వర్సెస్ శ్రీధర్‌బాబు అన్నట్టుగా వాదోపవాదాలు జరిగాయి.

రైతులందరికీ పరిహారం ఇవ్వాలి..

బీఆర్‌ఎస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి ఈ చర్చను ప్రారంభించారు. రైతులకు జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని కోరారు. తర్వాత శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ''వరదలతో జనజీవనం అతలాకుతలమైంది. 50 మంది మరణించారు. 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం కేటాయించిన రూ.500 కోట్లు ఏ మాత్రం సరిపోవు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.1,500 కోట్లు రైతులకు చెల్లించాలి..''అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుంటూ..''శ్రీధర్‌బాబు వరద నష్టంపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారు. అవి తప్పుడు లెక్కలు. ఈసారి ఆలస్యంగానైనా వర్షాలు కురిసినందుకు ఆనందించాలి. రెండు రోజులు నీళ్లున్నా వరికి నష్టం జరగదు. సోయా, పత్తి పంటలకు మాత్రమే నీళ్లుంటే నష్టం జరుగుతుంది. శ్రీధర్‌బాబు ఇదేదీ ఆలోచించకుండా మాట్లాడుతున్నారు. కేసీఆర్ రుణమాఫీ ప్రకటన చేయగానే కాంగ్రెస్ వాళ్ల ఫ్యూజులు ఎగిరిపోయాయి. అందుకే అనవసర ఆరోపణలు చేస్తున్నారు. శాస్త్రీయంగా ఆధారాలుంటేనే మాట్లాడాలి. దుష్ప్రచారం చేయడం సరికాదు''అని పేర్కొన్నారు. అంతేగాకుండా.. రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బాహాటంగా వ్యాఖ్యానించారని.. అలాంటి వారు తమకు నీతులు చెప్పడం ఏమిటని వ్యాఖ్యానించారు. గతంలో 6 గంటల కరెంట్ ఇచ్చి రైతులను చావగొట్టారని.. ఇప్పుడు ధరణి రద్దు చేస్తామని, దళారీ ప్రభుత్వం తెస్తామని అంటున్నారని విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మాటలపై శ్రీధర్‌బాబు రైతాంగానికి క్షమాపణ చెప్తారా? అని నిలదీశారు.''ఒకప్పుడు ఒకాయన (చంద్రబాబు) వ్యవసాయం దండుగ అన్నారు.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు ఉచిత విద్యుత్ వద్దంటున్నారు..''అని కేటీఆర్ మండిపడ్డారు.

పరస్పరం మాటల తూటాలతో..

కేటీఆర్ మాట్లాడిన తర్వాత అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం మరింత ముదిరింది. వరదలపై సమాధానం చెప్పలేక కేటీఆర్ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని.. విద్యుత్‌పై ప్రత్యేక చర్చ పెడితే అందుకు తాము సిద్ధమని శ్రీధర్‌బాబు సవాల్ చేశారు. మధ్యలో భట్టి విక్రమార్క జోక్యం చేసుకుంటూ.. రైతులకు 3 గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి అనలేదని స్పష్టం చేశారు. దీనిపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ.. రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియో చూపిస్తామన్నారు. సభలో ఉన్న బీఆర్‌ఎస్ సభ్యులు కూడా వీడియో చూపించాలన్నారు. వాదోపవాదాలు సాగుతుండగానే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ''వరదలతో వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. మేటల తొలగింపు కోసం ఎకరాకు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. వరదలకు ప్రకృతి వైపరీత్యంతోపాటు మానవ తప్పిదం కూడా కనిపిస్తోంది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం శాస్త్రీయంగా లేదు. దీనిపై హౌస్ కమిటీ వేయండి. బాధితులకు రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలి. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి' అని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ సర్కారుకు ఇంకా మూడు నాలుగు నెలల సమయమే ఉందని, తర్వాత వచ్చేది తామేనని వ్యాఖ్యానించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ.. 'వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. పగటి కలలు కనొద్దు'అని పేర్కొన్నారు. మధ్యలో మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ.. ''రేవంత్‌రెడ్డి 24 గంటల కరెంట్ వద్దు అంటున్నారు. చెక్‌డ్యామ్‌లు వద్దని శ్రీధర్‌బాబు అంటున్నారు. మరో కాంగ్రెస్ నేత ధరణి వద్దు అంటున్నారు. ఇదేనా కాంగ్రెస్ విధానం?''అని విమర్శించారు. భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. తాము చెక్‌డ్యామ్‌లు వద్దనలేదని, శాస్త్రీయంగా నిర్మించలేదన్న విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొన్నారు. దీంతో.. ''ఇరిగేషన్ అధికారులు డిజైన్ చేసి అన్నిరకాలుగా అధ్యయనం చేశాకే చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తారు. అలాంటివి అశాస్త్రీయమని ఎలా అంటారు?''అని ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు.

బిల్లులు వెనక్కి పంపుతారా?

- అలా చేయడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే..
- గవర్నర్ తీరుపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తిప్పి పంపిన బిల్లులను పునఃపరిశీలన కోసం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రాత్రి సభలో అనుమతించారు. ఈ సందర్భంగా గవర్నర్ తిప్పి పంపిన బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ బిల్లులు ఆపడంలో రాజకీయ కోణం దాగి ఉందని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ అనుమానం వ్యక్తం చేయగా.. గవర్నర్ బిల్లులు పెండింగ్‌లో పెట్టడం, తిప్పి పంపడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే ముఖ్యం: హరీశ్‌రావు

ప్రభుత్వ ఉద్యోగ (పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ)బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత రాకుండా, ప్రభుత్వం మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల వయోపరిమితి 65 ఏళ్లకు పెంచుతూ గతంలోనే చట్టాన్ని తెచ్చాం. ఇందులో టెక్నికల్ అంశాలను పరిగణనలోకి తీసుకుని సవరణ తెస్తూ బిల్లు తెచ్చాం. అయితే, రిటైర్ అయిన వాళ్లను తీసుకోవడంతో ప్రభుత్వంపై ఆర్థికంగా భారం పడుతున్నట్టుగా గవర్నర్ భావించినట్టు తెలిసింది. వాస్తవానికి అలాంటి అంశాలకు తావులేదు.. అదనంగా ప్రభుత్వంపై భారం లేద'న్నారు.

రాజకీయ కోణం తప్ప అభ్యంతరాలకు తావులేదు..: మంత్రి కేటీఆర్

పురపాలక శాసనాల చట్టం (సవరణ) బిల్లును ప్రవేశపెడుతూ మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. 'వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యం పెంచేలా కో–ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంచాం. ఇందుకు గవర్నర్ అభ్యంతరాలను ప్రస్తావించారు. కో–ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంచినప్పుడు దామాషా ప్రకారం మైనార్టీల సంఖ్య పెరుగుతుంది. ఇందులో మైనార్టీల కోసం ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదు. కేవలం అవి అపోహలే. రాజకీయ కోణం తప్ప గవర్నర్ లేవనెత్తిన అంశాల్లో ఏమీ అభ్యంతరాలు లేనందున తిరిగి బిల్లును పాస్ చేయాలని కోరుతున్నాను'అని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి బ్రేక్!

- అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడానికి గవర్నర్ అనుమతి కోసం పంపిన ప్రభుత్వం
- దీనిపై న్యాయ సలహాకు కొంత సమయం కావాలన్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు బ్రేక్ పడింది. వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించేందుకు టీఎస్‌ఆర్టీసీ చట్ట సవరణ ముసాయిదా బిల్లు–2023ను రూపొందించిన ప్రభుత్వం.. దానిని శాసనసభలో ప్రవేశపెట్టడానికి గవర్నర్ తమిళిసై అనుమతి కోరుతూ రాజ్‌భవన్‌కు పంపింది. కానీ గవర్నర్ దీనికి అనుమతి ఇవ్వకపోవడంతో.. చట్ట రూపంలోకి రాని బిల్లుల జాబితాలో చేరిపోయింది.

రేపటితో అసెంబ్లీ ముగుస్తుండటంతో..

ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే ఆర్టీసీ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని ఇటీవలి కేబినెట్ భేటీలో సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆదివారంతో రాష్ట్ర శాసనసభ సమావేశాలు ముగుస్తున్నాయి. ఆలోగా బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ అనుమతి లభించడం అనుమానమేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులు నైరాశ్యంలో మునిగిపోయారు.

ఇదే తొలిసారి

ద్రవ్య వినిమయం (బడ్జెట్), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోని అంశాలకు సంబంధించిన బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఇక శాసనసభ పాస్ చేసిన ఏ బిల్లునైనా గవర్నర్ ఆమోదానికి రాజ్‌భవన్‌కు పంపాలి. ఆపై బిల్లులు చట్టరూపం దాల్చి అమల్లోకి వస్తాయి. ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసుకోనుండటంతో వారికి ప్రతినెలా జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆర్థికపరమైన వ్యవహారం కావడంతో ప్రభుత్వం ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందే గవర్నర్ అనుమతికి పంపాల్సి వచ్చింది. అయితే గతంలో కూడా.. ఇలాంటి బిల్లులను సభలో ప్రవేశపెట్టడానికి ముందు గవర్నర్ అనుమతిని వాయిదా వేసిన/నిరాకరించిన సందర్భాలు లేవని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ప్రభుత్వం వివరణ ఇస్తే నిర్ణయం!

ఆర్టీసీ బిల్లుకు సంబంధించి రాజ్‌భవన్ శుక్రవారం మధ్యాహ్నం, అర్ధరాత్రి రెండు ప్రకటనలు విడుదల చేసింది. తొలుత ''ఈ నెల 3న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా.. 2న మధ్యాహ్నం 3.30 గంటలకు ఆర్టీసీ చట్ట సవరణ బిల్లు–2023 ప్రతిపాదన రాజ్‌భవన్‌కు చేరింది. బిల్లు పరిశీలన, న్యాయ నిపుణుల సలహా తీసుకుని ప్రభుత్వ విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకోవడానికి మరో కొంత సమయం అవసరం'' అని పేర్కొంది. రాత్రి విడుదల చేసిన ప్రకటనలో.. ''ఆర్టీసీ బిల్లును గవర్నర్ పరిశీలించారు. సంస్థ, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని.. పలు అంశాలపై వివరణలు, స్పష్టతను కోరుతూ ప్రభుత్వానికి వర్తమానం పంపించారు. ప్రభుత్వం తక్షణమే వివరణలతో బదులిస్తే.. బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకుంటారు'' అని తెలిపింది. ఆర్టీసీ బిల్లుకు అనుమతి ఇవ్వకుంటే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల రాజ్‌భవన్ ముట్టడి



- 'ఉద్యోగుల విలీనం బిల్లు'పై గవర్నర్ తీరును నిరసిస్తూ ఆందోళన
- నేడు ఉదయం 6 నుంచి 8 వరకు ఆర్టీసీ బస్సుల బంద్

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం బిల్లు'ను గవర్నర్ తమిళిసై పరిశీలన కోసం ఆపడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేయాలని ఉద్యోగులు, కార్మికులకు పిలుపునిచ్చాయి. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని పీవీ మార్గ్ నుంచి భారీ ర్యాలీగా వెళ్లి రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని ప్రకటించాయి. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

మతం పేరుతో దిగజారుడు రాజకీయాలు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో మత ఘర్షణలు పెరిగిపోవడం దారుణమని, ఎన్నికల్లో గెలవడానికి మతం పేరుతో చిచ్చుపెట్టి ఆ మంటల్లో చలి కాచుకుంటున్నారని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. అలాంటి దౌర్భాగ్యపు రాజకీయాలను ముక్తకంఠంతో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గత నెల 31న జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో మరణించిన హైదరాబాద్ వాసి సైఫొద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తిపై కేటీఆర్ స్పందించారు. శాసనసభ జీరో అవర్‌లో దీనిపై ప్రకటన చేశారు. ''హైదరాబాద్ యువకుడు ఉపాధి కోసం రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్లి అక్కడ మత ఘర్షణల్లో మరణించడం బాధ కలిగించింది. హిందూ, ముస్లిం, సిక్కుల పేరుతో దిగజారుడు రాజకీయాలు మంచిదికాదు..''అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. వినతిపత్రం అందజేస్తే సైఫొద్దీన్ భార్యకు ఎక్కడైనా ఉపాధి కల్పిస్తామని, డబుల్‌బెడ్రూం ఇల్లు ఇస్తామని చెప్పారు. సైఫొద్దీన్ ముగ్గురు ఆడపిల్లలకు ఒక్కొక్కరి పేరిట రూ.2లక్షలను బీఆర్‌ఎస్ తరఫున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని.. సీఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

వరద మృతుని కుటుంబానికి రూ.4 లక్షలు

- ఇంకో రూ.లక్ష ఇచ్చేందుకు కృషి
- మృతుడు రైతు అయితే వెంటనే రైతు బీమా కూడా
- వరదలపై చర్చలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని, ఒక్కో మృతుని కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరో రూ.లక్ష అదనంగా ఇచ్చే ఆలోచన కూడా చేస్తున్నామని వెల్లడించింది. రాష్ట్రంలో సంభవించిన వరద నష్టాలపై శాసనసభలో గురువారం జరిగిన లఘు చర్చలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం తరఫున రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బదులిచ్చారు. మృతుల్లో రైతులు ఉంటే రూ.4 లక్షల పరిహారంతో పాటు, తక్షణమే రూ.5 లక్షల రైతు బీమా అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో 139 గ్రామాల్లో వర్షాల వల్ల నష్టం జరిగిందని మంత్రి వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 7,870 ఇళ్లకు చెందిన 27 వేల మందిని 157 పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు. 419 ఇళ్లు కూలిపోయాయని, 7,505 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. పూర్తిగా కూలిన ఇళ్లను గృహలక్ష్మి పథకంలో చేర్చి కట్టించాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్టు చెప్పారు. పంటల నష్టాలపై అంచనాలు వేస్తున్నామని, వివరాలు వచ్చాక ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి వేముల హామీనిచ్చారు. వరద సాయం చేయమని కోరితే కేంద్రం ప్రతిసారీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి దుయ్యబట్టారు.

కాంగ్రెస్ పార్టీ సభ్యుల వాకౌట్

వరదల నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని, నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో అలక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ శాసనసభలో తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. చర్చలో పాల్గొన్న ఆ పార్టీ శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తాము లేవనెత్తిన సందేహాలకు, ప్రజలను ఆదుకోమని చేసిన విజ్ఞప్తికి మంత్రి సరైన సమాధానం చెప్పలేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు.

కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తాం

- ప్రొఫెసర్ హరగోపాల్
- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద కార్మిక గర్జన మహాధర్నా



ర్యాలీలో కార్మిక సంఘాల నేతలు

ముషీరాబాద్ (హైదరాబాద్): కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడం సరి కాదని, కార్మికుల పక్షాన తామంతా ఉద్యమిస్తామని ప్రొఫెసర్ హరగోపాల్ హెచ్చరించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద కార్మిక గర్జన మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావుతో కలిసి ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. అధికారంలోకి రాక ముందు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్, తొమ్మిదేళ్లు గడుస్తున్నా స్పందించడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు వేతన సమస్యలపై నెల రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాధర్నాలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి ఎన్‌ఎస్‌యూఐ యత్నం


ఎన్‌ఎస్‌యూఐ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి: గ్రూప్–2 పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నేతృత్వంలో పలువురు విద్యార్థి నాయకులు శుక్రవారం అసెంబ్లీ గేటు వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని అడ్డుకున్న పోలీసులు వెంకట్‌తో సహా పలువురిని అరెస్టు చేశారు. ఈ సమయంలో అసెంబ్లీ పరిసరాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఇక, వరద బాధితులకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్‌చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అసెంబ్లీ గేటు వద్ద వీరిని కూడా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

రేపు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి

ఎంపీ బాపూరావు సస్పెన్షన్‌కు లంబాడా సంఘాల డిమాండ్

పంజగుట్ట: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలన్న బీజేపీ ఎంపీ సోయం బాపూరావును ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తెలంగాణ లంబాడా సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. 11 లంబాడా సంఘాలతో ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ముట్టడి పోస్టర్‌ను జేఏసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ధరావత్ గణేశ్ నాయక్, వెంకట్ నాయక్‌లు శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాపూరావు వ్యాఖ్యల వెనక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కూడా ఆయన వ్యాఖ్యలపై తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశ్ నాయక్, శివ నాయక్, దేవదాస్, భరత్ నాయక్, వినోద్, సరోజా బాయి, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డి బ్రోకర్.. జోకర్: కేఎల్‌ఆర్



మేడ్చల్: రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి బ్రోకర్, జోకర్ అని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్) తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి.. జోకర్ మల్లారెడ్డి అనే విషయం అందరికీ తెలుసని, ఆయన హుందాతనం మరిచి జోకర్‌లా మాట్లాడుతున్నారని, గతంలో కల్తీపాలు అమ్మిన ఆయన తాజాగా కల్తీమాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ప్రజలకు అందించిన సేవలను సీఎం కేసీఆర్ గుర్తించి తనను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి మేడ్చల్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారని, అయినా కాంగ్రెస్‌కు కట్టుబడి ఉండి ఎక్కడికీ పోలేదన్నారు. బీఆర్‌ఎస్ టికెట్‌ను తాను నిరాకరిస్తేనే అది మల్లారెడ్డికి దక్కిందని చెప్పారు. మేడ్చల్ కాంగ్రెస్ టికెట్‌గానీ, ఇతర నియోజకవర్గాల టికెట్‌గానీ అడగడంలేదని, పార్టీ కోసం ఎక్కడైనా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రి మల్లారెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ దక్కుతుందో, లేదోనని ఎద్దేవా చేశారు.

హలో కేటీఆర్‌గారూ.. ఈ ఫొటో గుర్తుందా?

ప్రభుత్వ భూముల అమ్మకంపై ట్విట్టర్ వేదికగా ప్రవీణ్‌కుమార్ విసుర్లు



ప్రవీణ్‌కుమార్ ట్వీట్ చేసిన కేటీఆర్ ఫొటో

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూముల అమ్మకంపై బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్‌పై సెటైర్లు వేశారు. 'ప్రభుత్వ భూముల వేలం పాటను ఆపివేయాలి. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మానుకోవాలి'అంటూ కేటీఆర్ ఓ ప్లకార్డు ప్రదర్శిస్తున్న పాత ఫొటోను జత చేస్తూ శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. 'తమరు ప్రతిపక్షంలో ఉంటే చెప్పేవి శ్రీరంగనీతులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నీతులు ఎక్కడో కొట్టుకొని పోయినయి! ఐనా చెప్పిందల్లా చేయడానికి మీరేమన్నా సన్నాసులా (నాన్నగారి మాటల్లోనే)!. మీరు మీ పత్రికల ద్వారా గతాన్ని తుడిచేయాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ చరిత్రను మరిచిపోయేంత సన్నాసులం మేం కాదు. 75 ఏళ్ల నుంచి 99 శాతం ఉన్న బహుజనులు 1శాతం ఉన్న ఆధిపత్య పాలకులకు ఓట్లేసి గెలిపిస్తే పేదల భూములను కాపాడలేదు సరికదా అమాంతంగా మింగేసింద్రు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల భూములకు రక్షణ కల్పిస్తాం'అని తన ట్వీట్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కాగా వందల కోట్లకు అసైన్డ్ భూములను కొంటున్న కేసీఆర్, కేటీఆర్ బినామీల నుంచి భూములను తిరిగి తీసుకుంటామని, వాటిని పేద రైతులకు పంచుతామని ట్విట్టర్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. నిన్న కోకాపేట, రేపు బుద్వేల్, ఎల్లుండి ఆర్‌ఆర్‌ఆర్ చివరికి మిగిలేది గోచి గుడ్డనే అని ఎద్దేవాచేశారు.

సర్కార్ దగ్గర పైసల్లేక భూముల అమ్మకం

- ముందే మద్యం షాపుల టెండర్లు నిర్వహించడమూ అందుకే..: బండి సంజయ్
- అలాంటి కేసీఆర్ హామీలు ఎలా నెరవేరుస్తారు?
- ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, రుణమాఫీ ఉత్త ఎన్నికల స్టంట్లు
- ఓటమి ఖాయమని తెలిసి ప్రజలను మోసగించే ప్రయత్నమని మండిపాటు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్
- అందరితో కలసి కష్టపడి పనిచేస్తానని వెల్లడి


ఎయిర్‌పోర్టులో బండి సంజయ్‌కు ఘనస్వాగతం పలుకుతున్న బీజేపీ కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర సర్కారు దగ్గర పైసల్లేక ఎన్నికల తాయిలాల కోసం భూములను అమ్ముతోందని.. మద్యం షాపుల టెండర్లను ముందుగా నిర్వహిస్తున్నదీ అందుకేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయమని సీఎం కేసీఆర్ గుర్తించారని.. అందుకే హామీల అమలు పేరిట ఎన్నికల స్టంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రాబోయేది రామరాజ్యం, మోదీ రాజ్యమేనని పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్.. సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తర్వాత విమానాశ్రయం నుంచి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో ఏనాడూ హామీలను పట్టించుకోని కేసీఆర్.. ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు.

అన్నీ ఎన్నికల స్టంట్లే..!

''ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, రుణమాఫీ, వీఆర్‌ఏలు, పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, పీఆర్సీ అంటూ బీఆర్‌ఎస్ సర్కారు, కేసీఆర్ చేస్తున్న ప్రకటనలన్నీ ఎన్నికల డ్రామాలే. సర్కార్ దగ్గర పైసల్లేక ఎన్నికల తాయిలాల కోసం భూములను అమ్ముతున్నారు. సర్కారు జీతాలు కూడా సరిగా ఇవ్వలేని పరిస్థితిలో ఉంది. పైసలే లేనప్పుడు హామీలను ఎక్కడి నుంచి నెరవేస్తారు'' అని బండి సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి మద్యం వ్యాపారం ఈజీ దందాగా మారిందని.. నవంబర్ దాకా గడువున్నా ముందే మద్యం టెండర్లు పిలిచి వేల కోట్లు దోచుకోవాలనుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అమ్మేస్తూ భావితరాలను మోసం చేస్తున్నారని.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామంటూ ఆ సంస్థ ఆస్తులను అమ్ముకోవడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

అంతా కలసి పనిచేస్తాం

తాము ఎన్నికల యుద్ధ రంగంలో ఉన్నామని, చావో రేవో తేల్చుకోవాల్సిన సమయమిదని బండి సంజయ్ పేర్కొన్నారు. ''బీజేపీలో గ్రూపులున్నాయి, పార్టీ గ్రాఫ్ తగ్గిందనేది దుష్ప్రచారమే. ప్రజల మనసుల్లో బీజేపీ పదిలంగా ఉంది. చిన్న చిన్న అభిప్రాయ భేదాలుంటే వాటిని భూతద్దంలో చూపడం మూర్ఖత్వం. పేదల పక్షాన మేం చేసిన పోరాటాలు జనం మదిలో నిలిచిపోయాయి. కార్యకర్తల త్యాగాలను వృథా పోనివ్వబోం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తాం..'' అని సంజయ్ చెప్పారు.

ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల స్వీకారం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన బండి సంజయ్.. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ తదితరులు సంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తనను నమ్మి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏల కోసం సూపర్ న్యూమరరీ పోస్టులు

14,954 పోస్టులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)ను ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసే ప్రక్రియలో మరో ముందడుగు పడింది. వీఆర్‌ఏలను పలు శాఖల్లో విలీనం చేసుకునేందుకు వీలుగా ఆయా శాఖల్లో సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించేందుకు ఆర్థిక శాఖ అంగీకారం తెలిపింది. ఈ మేరకు 14,954 సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో 2,451 జూనియర్ అసిస్టెంట్, మున్సిపల్ శాఖలో 1,266 వార్డు ఆఫీసర్లు (జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ), రెవెన్యూ శాఖలోనే 2,113 రికార్డు అసిస్టెంట్లు, 679 సబార్డినేట్/చైన్‌మెన్ పోస్టులు, సాగునీటి శాఖ పరిధిలో 5,073 లస్కర్లు, హెల్పర్ పోస్టులు, మిషన్ భగీరథలో 3,372 హెల్పర్ పోస్టులను కల్పించేందుకు అనుమతిస్తున్నట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా శాఖల వారీగా ఏ జిల్లాలో ఎన్ని పోస్టులు కల్పిస్తున్నారన్న దానిపై స్పష్టతనిస్తూ ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

ఎయిర్‌పోర్టుకు పరిమితంగానే రావాలి

ప్రయాణికుల స్వాగతం, వీడ్కోలుకు వచ్చేవారికి ఆర్‌జీఐఏ విజ్ఞప్తి

శంషాబాద్: ప్రయాణికుల స్వాగత, వీడ్కోలు జరిగే సమయాల్లో అత్యధిక మంది రావడంతో ఎయిర్‌పోర్టు పరిసరాల్లో పార్కింగ్, రద్దీ పెరిగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎయిర్‌పోర్టు వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఇటీవల విదేశాలకు వెళుతున్న విద్యార్థుల వెంట పరిమితికి మించి పెద్ద ఎత్తున స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యుల రాకతో ఎయిర్‌పోర్టు ప్రాంగణం కిక్కిరిసిపోతున్న సందర్భాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సుఖవంతమైన ప్రయాణం కోసం ప్రయాణికులు, వారి కుటుంబసభ్యులు సహకరించాలన్నారు.

ఎలక్షన్.. యాక్షన్!

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న అంశాలతో పాటు విపక్షాలు ఎన్నికల అస్త్రాలుగా ప్రయోగించేందుకు అవకాశమున్న సమస్యలపై వెంటనే స్పందిస్తూ కీలక ప్రకటనలు చేస్తున్నారు. వారిని పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టేందుకు అన్నివిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు ప్రకటించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మార్చి నుంచే ఎలక్షన్ మోడ్

కేసీఆర్ ఈ ఏడాది మార్చి నుంచే పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికల దిశగా సన్నద్ధం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావుతో పాటు ఇతర మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వంటి సుమారు డజను మంది కీలక నేతలకు ఐదారు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున సమన్వయ బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ, అనుసరించాల్సిన కార్యాచరణపై నిత్యం దిశా నిర్దేశం చేస్తున్నారు.

పెండింగ్ అంశాలపై స్పీడ్‌గా..

తాజాగా దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న అంశాలతో పాటు విపక్షాలు ఎన్నికల అస్త్రాలుగా ప్రయోగించేందుకు అవకాశమున్న సమస్యలపై సీఎం శరవేగంగా స్పందిస్తున్నారు. రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రైతు రుణమాఫీని మాస్టర్ స్ట్రోక్‌గా బీఆర్‌ఎస్ నేతలు అభివర్ణిస్తున్నారు. సీఎం నిర్ణయంతో విపక్షాలకు గొంతు లేకుండా పోయిందని వారంటున్నారు. ఇక వికలాంగుల పింఛను పెంపు, బీసీలు, మైనారిటీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం, గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్, నోటరీ భూముల రిజిస్ట్రేషన్, నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ వంటి మరి కొన్ని కీలక నిర్ణయాలు కూడా ఇటీవలి కాలంలోనే తీసుకున్నారు. వీఆర్‌ఏల సర్వీసు క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం వంటి నిర్ణయాలు సైతం తీసుకున్న కేసీఆర్.. త్వరలో ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతిపై సంచలన నిర్ణయం ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే సామాజిక పింఛన్ల పెంపు, హైదరాబాద్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపైనా స్పష్టత నివ్వడంపై కసరత్తు జరుగుతున్నట్టు సమాచారం. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో నిరుద్యోగ భృతి చెల్లింపు అంశం మినహా విపక్షాలకు ఏ ఒక్క ప్రచార అస్త్రం దొరక్కుండా చేయాలన్నదే కేసీఆర్ వ్యూహమని పార్టీ నాయకులు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రకటనలను ప్రభుత్వానికి, అధికార పార్టీకి అనువుగా మలుచుకునేందుకు క్షేత్రస్థాయిలో సంబురాలు నిర్వహించాలంటూ పార్టీ ఎమ్మెల్యేలు, కేడర్‌కు మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

నిధుల సమీకరణపైనా స్పెషల్ నజర్

రుణమాఫీ, రైతుబంధు చెల్లింపుల్లాంటివి సెప్టెంబర్ మూడో వారంలోగా పూర్తి చేసేందుకు వీలుగా నిధుల సమీకరణపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. రుణాలు, గ్రాంట్ల ద్వారా నిధులు వచ్చే అవకాశం లేకపోవడంతో అంతర్గత ఆదాయాన్ని నిర్దేశిత గడువులోగా రాబట్టాలని ఆర్థిక శాఖకు లక్ష్యం నిర్దేశించారు. నిధుల సేకరణ సమన్వయ బాధ్యతను ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్‌కు అప్పగించినట్లు తెలిసింది. ఇలా రెగ్యులర్‌గా వచ్చే ఆదాయంతో పాటు మూడు నెలల ముందుగానే మద్యం దుకాణాల వేలం, నోటరీ భూముల రిజిస్ట్రేషన్, హెచ్‌ఎండీఏ పరిధిలో భూముల వేలం వంటివి చేపట్టడం ద్వారా నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యారు. తద్వారా ఎన్నికల సమయంలో ప్రజల్లో వ్యతిరేకత, విపక్షాల విమర్శలు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

టికెట్లు, చేరికలపై కసరత్తు

సొంత సర్వేలు, ప్రభుత్వ నిఘా వర్గాల నివేదికల ఆధారంగా నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీల బలాలు, బలహీనతలపై కేసీఆర్ అంచనాకు వచ్చారు. సుమారు 15 శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించడం, గెలుపు గుర్రాల అన్వేషణ, ఇతర పార్టీల నుంచి కీలక నేతలను చేర్చుకోవడం వంటి అంశాలపై తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఇప్పటికే సుమారు 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరోక్షంగా అభ్యర్థులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసంతృప్త నేతలను ఖాళీగా ఉన్న పదవుల్లో సర్దుబాటు చేయడంపైనా కసరత్తు జరుగుతోంది. టికెట్ల రేసులో ఉన్న సుమారు అరడజను మంది ఎస్సీ సామాజికవర్గం నేతలతో త్వరలో ఎస్సీ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసే అవకాశమున్నట్టు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ నేతకు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి దాదాపు ఖాయమైందని అంటున్నారు.

కేసీఆర్ కుటుంబం 10వేల ఎకరాలు కబ్జా చేసింది

- రూ.లక్ష కోట్లు వెనుకేసుకున్న కేసీఆర్‌కు తెలంగాణపై మోజు తీరింది: రేవంత్


పెద్దపల్లి నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోపిడీ చేస్తోందని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 10 వేల ఎకరాలను కేసీఆర్ కుటుంబం కబ్జా చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు వెనుకేసుకున్న తర్వాత కేసీఆర్‌కు తెలంగాణపై మోజు తీరిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం రాత్రి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లుతో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు, సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చచ్చిపోయిందా? మున్సిపల్ మంత్రి వరదల్లో కొట్టుకుపోయారా? రాష్ట్రంలో మంత్రులు లేరా అని ప్రశ్నించారు. వరద సహాయక చర్యలపై శాసనసభలో కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ప్రశ్నిస్తుంటే మంత్రులు అడ్డుకుంటున్నారని చెప్పారు. వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుని ఉంటే సీతక్కలాంటి ఎమ్మెల్యేలు కన్నీరు పెట్టాల్సి వచ్చేది కాదని, వరదబాధిత ప్రాంతాల్లో తిరగాల్సిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రౌడీల్లా వీధుల్లో తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు తెలంగాణపై మోజు తీరినందునే వరద ప్రాంతాల్లో పర్యటించకుండా మహారాష్ట్రకు వెళ్లాడని, అక్కడ పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ తెలంగాణ రైతులపై లేదని విమర్శించారు.

కేసీఆర్ బ్రహ్మరాక్షసుడు

రానున్న ఎన్నికల్లో జరిగే ధర్మయుద్ధంలో కాంగ్రెస్ పార్టీదే విజయమని రేవంత్ వ్యాఖ్యానించారు. 'రాక్షసులందరినీ పుట్టించిన బ్రహ్మ రాక్షసుడు కేసీఆర్. ఆ బ్రహ్మరాక్షసుడికి మందు పెట్టి బొంద పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజల్లో ఉండి ప్రజలకోసం మేం కొట్లాడుతున్నాం. మీకోసం మేముంటాం. మాకోసం మీరు ఉండండి. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలి.' అని రేవంత్ పిలుపునిచ్చారు.

పక్కా వ్యూహంతో వెళ్తే గెలుపు ఖాయం

- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే
- ఖమ్మంలో రాహుల్ సభ రాజకీయం మార్చేసింది
- బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని ప్రచారం చేయండి
- గాంధీభవన్‌లో ప్రచార కమిటీ భేటీ


సుప్రీంకోర్టులో రాహుల్‌కు ఊరట లభించిన నేపథ్యంలో గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఠాక్రే తదితరులు

సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పక్కా ప్రచార వ్యూహంతో ముందుకెళితే కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అన్నారు. ఎన్నికల ప్రచార నిర్వహణలో, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపడంలో టీపీసీసీ ప్రచార కమిటీ చురుకుగా వ్యవహరించాలని సూచించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ తొలి సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ అజ్మతుల్లా హుస్సేనీలతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, మన్సూర్ అలీఖాన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మాదిరే ఇక్కడా..

ఠాక్రే మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రజల మధ్య యాత్ర చేసిన కర్ణాటకలో పార్టీ విజయం సాధించిందని, తెలంగాణలో కూడా ఘన విజయం సాధిస్తామని చెప్పారు. ఖమ్మంలో రాహుల్‌గాంధీ పాల్గొన్న బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాలను మార్చి వేసిందని అన్నారు. మధు యాష్కీ, పొంగులేటిల నేతృత్వంలో మంచి ప్రచార వ్యూహంతో ముందుకెళితే తప్పక విజయం సాధిస్తామని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు లోపాయికారీగా పనిచేస్తున్నాయన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమస్యలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో పోరాడాలని సూచించారు. రాహుల్‌గాంధీ చేసిన రైతు డిక్లరేషన్, ప్రియాంకాగాంధీ చేసిన యూత్ డిక్లరేషన్‌లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ విషయంలో పార్టీ అనుబంధ సంఘాలు గట్టిగా పనిచేయాలని కోరారు.

మాఫీ అయింది మిత్తి మాత్రమే: మధుయాష్కీ

రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీల తోడుదొంగల సినిమాను ప్రజల మధ్య బయటపెడతామని మధుయాష్కీ చెప్పారు. కేసీఆర్, మోదీలు తెరవెనుక ఏం చేశారో, తెర ముందు ఏం చేశారో వివరిస్తామన్నారు. రుణమాఫీని ఐదేళ్లుగా చేయకుండా ఇప్పుడు చేయడంతో ఐదేళ్ల మిత్తి మాత్రమే మాఫీ అయిందని, దీనిపై పోస్టుకార్డు ఉద్యమం చేస్తామని చెప్పారు. ఈ నెల 6న గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో నిర్వహించే సమావేశంలో ప్రచార వ్యూహాలపై మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

నిగ్రహం లేనివాడికి వివేకం ఉండదు.
యుక్తుడు కానివానికి ధ్యానం కుదరదు.
ధ్యానం లేనివాడికి శాంతి లేదు. శాంతి లేనివాడికి సుఖమెక్కడ?
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 5 ఆగస్టు 2023

ఈ చట్టంతో సాధించేదేమిటి?

ఎంతోకాలంగా అటు ఔషధ పరిశ్రమలవారూ, ఇటు ప్రజారోగ్యరంగ కార్యకర్తలూ ఎదురు చూస్తున్న జనవిశ్వాస్ బిల్లు గత నెల 27న లోక్‌సభలో, ఈ నెల 2న రాజ్యసభలో ఆమోదం పొందింది. మణిపూర్‌పై అట్టుడుకుతున్న కారణంగా పార్లమెంటులో తీవ్రగందరగోళం ఏర్పడిన నేపథ్యంలో ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో గట్టెక్కిన ముఖ్యమైన బిల్లుల్లో ఇది కూడా చేరిపోయింది. 19 మంత్రిత్వ శాఖలకు సంబంధించిన 42 చట్టాలకు ఈ బిల్లు సవరణలు ప్రతిపాదించింది. ఇప్పుడు అమల్లో ఉన్న 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని ఔషధ రంగ పరిశ్రమలు ఎప్పటినుంచో చెబుతున్నాయి. అయితే ఆ చట్టంలోని లొసుగుల వల్ల నాసిరకం ఔషధ తయారీదారులపై కఠిన చర్యలు సాధ్యం కావటం లేదన్నది ప్రజారోగ్యరంగ కార్యకర్తల విమర్శ. తాజా సవరణ బిల్లు దాన్ని మెరుగుపరచకపోగా మరింత నీరుగార్చిందని వారి వాదన. ఈ బిల్లు మొత్తం 180 స్వల్ప నేరాలకు జైలు శిక్ష బదులు జరిమానాతో సరిపెట్టింది. చిన్న చిన్న సమస్యలను సైతం భూతద్దంలో చూపి జైలుకు పంపుతున్న ధోరణి సరికాదనీ, ప్రతి చిన్న అంశంలోనూ అధికారులకు వివరణ ఇవ్వాల్సి రావటం, కేసుల్లో ఇరుక్కుంటే న్యాయస్థానాల చుట్టూ తిరగటం ఉత్పాదకతకు అవరోధమవుతున్నదనీ ఔషధరంగ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. వారి కోణంలో ఈ సవరణలు మంచివే కావొచ్చుగానీ, రోగుల కోణం నుంచి దీన్ని పరిశీలించారా అన్నది సందేహమే.

ఫార్మారంగంలో మన దేశం అంతర్జాతీయంగా ముందంజలో ఉంది. కానీ కొన్ని ఫార్మా సంస్థలు నాసిరకం మందులు ఎగుమతి చేసి దేశం పరువుప్రతిష్ఠలను దెబ్బతీస్తున్న ఉదంతాలు తక్కువేం కాదు. మన దేశంనుంచి ఎగుమతైన దగ్గుమందు సేవించి ఆఫ్రికా ఖండ దేశం గాంబియాలో నిరుడు 70 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఆమధ్య ఉజ్బెకిస్తాన్‌లో కూడా 19 మంది పిల్లలు చనిపోయారు. ఇక్కడి నుంచి అమెరికాకు ఎగుమతైన కంటికి సంబంధించిన మందు వికటించి నిరుడు మే నెల నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 55 మందికి సమస్యలు తలెత్తాయి. అందులో ఒకరు మరణించారు కూడా. పాత చట్టం కఠినంగా ఉన్నదని ఫార్మారంగం మొత్తుకుంటున్న కాలంలోనే ఇలాంటి ఉదంతాలు జరిగితే దాన్ని నీరుగార్చటం సమస్యను మరింత పెంచదా అన్న సందేహం ఎవరికైనా వస్తుంది. ఇప్పుడు అమల్లో ఉన్న చట్టం కల్తీ మందులు, నకిలీ మందులు, తప్పుదోవ పట్టించే పేర్లతో మందుల చలామణీ, నాణ్యతా ప్రమాణం కొరవడిన మందులు అని నాలుగు రకాలుగా వర్గీకరించింది. ఆ మందులు వాడినవారికి ఎదురయ్యే సమస్య తీవ్రతను బట్టి ఆ నేరాలకు శిక్షలున్నాయి. కల్తీ, నకిలీ మందులవల్ల రోగి మరణం సంభవించిన పక్షంలో అందుకు కారకులని గుర్తించినవారికి పదేళ్ల నుంచి యావజ్జీవ శిక్ష వరకూ ఉన్నాయి. తప్పుడు అభిప్రాయం కలిగించే బ్రాండ్‌లతో మందులు చలామణి చేస్తే రెండేళ్ల వరకూ శిక్ష ఉంది. ప్రామాణిక నాణ్యత లేని మందుల (ఎన్‌ఎస్‌క్యూ) తయారీకి రెండేళ్ల వరకూ శిక్ష, రూ. 20,000 వరకూ జరిమానా విధించవచ్చు. వీటన్నిటికీ తాజా బిల్లు అయిదు లక్షల వరకూ జరిమానాలతో సరిపెట్టింది. జైలు శిక్షలు తొలగించింది. ఇతర నేరాల మాటెలావున్నా ఎన్‌ఎస్‌క్యూ కేటగిరీ కిందకొచ్చే కేసులకు జైలు శిక్ష బెడద లేకుండా చేయటాన్నే ప్రధానంగా ప్రజారోగ్య రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆఖరి కేటగిరీ 27(డి) కిందే దేశంలో ఎక్కువ కేసులు నమోదవుతుంటాయి. ఔషధంలో వినియోగించిన పదార్థాలు అనుమతించిన మోతాదులో కాకుండా వేరేవిధంగా ఉంటే ఆ ఔషధం రోగికి నిరుపయోగమవుతుంది. కానీ కొన్నిసార్లు జబ్బు ముదిరి మరణానికి దారితీసే ప్రమాదం ఉంటుందన్నది నిపుణుల వాదన. అలాంటి కేటగిరీని సైతం చిన్న తప్పిదంగా పరిగణించి జరిమానాలతో సరిపెడితే ఔషధ నాణ్యత దెబ్బతినదా... ప్రజారోగ్యం ప్రమాదంలో పడదా అని వారు ప్రశ్నిస్తున్నారు. నిజానికి నిరుడు ఈ బిల్లు ముసాయిదాను ప్రకటించి అన్ని వర్గాల నుంచీ అభిప్రాయాలు కోరినప్పుడు ప్రజారోగ్య నిపుణులు ప్రధానంగా దీనిపైనే అభ్యంతరం తెలిపారు. అసలు ఫార్మా కంపెనీలు నిబంధన ప్రకారం రిజిస్టరయిన ఫార్మాసిస్టులను నియమించు కోవాల్సి వుండగా చాలా సంస్థలు దాన్ని ఉల్లంఘిస్తున్నాయి.

అకారణంగా వేధించటాన్ని ఎవరూ సమర్థించరు. కానీ రోగుల ప్రాణాలతో ఆడుకునే విధంగా, కేవలం లాభార్జనే ధ్యేయంగా ఉండే సంస్థల విషయంలో కఠినంగా ఉండొద్దా? అసలే తరచు బయటికొచ్చే ఉదంతాల వల్ల విదేశాల్లో మన ఫార్మా ఉత్పత్తులపై చిన్నచూపు పడుతోంది. మన చట్టాలు చాలా ఉదారంగా ఉండటంవల్లే, తగిన తనిఖీలు లేనందువల్లే ఇదంతా జరుగుతోందన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు తీసుకొచ్చిన బిల్లు ఆ అభిప్రాయాన్ని పోగొట్టే విధంగా లేకపోగా మరింత సరళంగా మార్చిందని ప్రజారోగ్య కార్యకర్తల ఆరోపణ. కేవలం కఠిన శిక్షలు, తనిఖీలు మాత్రమే సమస్యకు పరిష్కారం కాకపోవచ్చు. కానీ కల్తీ, నకిలీ మందుల కారణంగా రోగి ప్రాణం కోల్పోయినా, తీవ్రమైన వైకల్యం సంభవించినా ఆ రోగి కుటుంబానికి భారీయెత్తున పరిహారం చెల్లించే నిబంధన ఉంటే ఔషధ తయారీ సంస్థ దారికి రాదా? దీనికి బదులు రూ. 5 లక్షల జరిమానాతో సాధించేదేమిటి? ఈమాత్రం జరిమానా చెల్లించలేని స్థితిలో ఏ సంస్థయినా ఉంటుందా? పటిష్టమైన పర్యవేక్షణ, పారదర్శకత, నేరం చేస్తే కఠిన శిక్ష, భారీ పరిహారం చెల్లింపు తప్పదన్న భయం ఉంటేనే పరిస్థితి చక్కబడుతుంది. ఇవేమీ లేకుండా చట్టం తెచ్చి ప్రయోజన మేమిటి?

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.చవితి ప.3.13 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.10.42 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.7.44 నుండి 9.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.44 నుండి 7.26 వరకు, అమృతఘడియలు: తె.4.45 నుండి 6.14 వరకు (తెల్లవారితే ఆదివారం)

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఇంకా రహస్య యుద్ధమే విధానమా?

విశ్లేషణ



శాలినీ చావ్లా

ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే పాకిస్తాన్‌లో దాదాపు 270 ఉగ్రదాడులు జరిగాయి. పాకిస్తాన్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) భయంకరమైన దాడులను చేస్తోంది. తన ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికీ, రాజకీయ సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనడానికీ ఒకవైపు పాకిస్తాన్ పోరాడుతుండగా... మరొకవైపు దేశంలో భద్రతా పరిస్థితి దిగజారుతోంది. అయినా పాకిస్తాన్ తన విదేశాంగ విధాన సాధనంగా రహస్య యుద్ధానికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కానీ తన సొంత గడ్డపై తీవ్రవాదం నుండి నిరోధక శక్తిని కోరుకుంటోంది. ఉగ్రవాదం, టీటీపీ విస్తరణ ఆందోళనకరమైనవి. సమీప భవిష్యత్తులో పాకిస్తాన్‌కే కాకుండా ఇవి దక్షిణాసియాకు కూడా తీవ్రమైన భద్రతా సవాళ్లను విసరనున్నాయి.

పాకిస్తాన్ వాయవ్య ప్రాంతంలోని బజౌర్ జిల్లాలో జులై 30న జమీయత్ ఉలేమా–ఎ–ఇస్లాం ఫజల్ (జేయూఎల్–ఎఫ్) సమావేశంపై జరిగిన ఉగ్రదాడిలో 50 మందికి పైగా మరణించారు, దాదాపు 200 మంది గాయపడ్డారు. ఈ దాడికి తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ ఖురాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) ప్రకటించింది. గతంలో కూడా జేయూఎల్–ఎఫ్‌కు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ అనేక దాడులు చేసింది. ఈ దాడులకు ప్రధాన కారణాలలో ఒకటి, అఫ్గానిస్తాన్ తాలిబన్లతో జేయూఎల్–ఎఫ్‌కు ఉన్న అనుబంధం; మరొక కారణం, పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యానికి జేయూఎల్–ఎఫ్ ఇస్తున్న మద్దతును ఇస్లామిక్ స్టేట్ వ్యతిరేకించడం అని చెప్పాలి. బలూచిస్థాన్‌లోని ఝోబ్ ఆయుధాగారంపై ఇటీవల జరిగిన దాడిలో తొమ్మిది మంది పాకిస్తాన్ సైనికులు మృతి చెందారు. పాకిస్తాన్ ఉగ్రవాద ముఖచిత్రంలో తాజా ప్లేయర్ అయిన తెహ్రీక్– ఎ–జిహాద్ పాకిస్తాన్ (టీజేపీ) ఆ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. టీజేపీ, తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ)తో అనుబంధాన్ని కొనసాగిస్తోంది. టీటీపీ పాకిస్తాన్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని దాడులను కొనసాగిస్తున్న భయంకరమైన సంస్థ.

తన ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికీ, రాజకీయ సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనడానికీ ఒకవైపు పాకిస్తాన్ పోరాడుతుండగా... మరొకవైపు దేశంలో భద్రతా పరిస్థితి మరింత దిగజారుతోంది. గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత ఖైబర్ పఖ్తున్ ఖ్వా, బలూచిస్తాన్‌లలో టీటీపీ దాడులు పెరిగాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే పాకిస్తాన్‌లో దాదాపు 270 ఉగ్రదాడులు జరిగాయి.

తాలిబన్లతో చెడిన మైత్రి

అఫ్గానిస్తాన్‌తో పాకిస్తాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. 2021 ఆగస్టులో కాబూల్‌ను తాలిబన్ స్వాధీనం చేసుకున్న తర్వాత మాజీ పౌర, సైనిక నాయకత్వం వ్యూహాత్మక విజయంగా భావించిన దానికి ఇది విరుద్ధంగా నడుస్తోంది. అమెరికా నిష్క్రమణ తర్వాత పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ సంబంధాలలో రెండు సమస్యలు కీలకంగా ఉన్నాయి. మొదటిది, డ్యూరాండ్ రేఖను సరిహద్దుగా గుర్తించడానికి తాలిబన్లు విముఖత వ్యక్తం చేయడంతోపాటు, సరిహద్దుల్లో కంచె వేయడాన్ని వారు ప్రతిఘటించడం. రెండవది, మిలిటెంట్ గ్రూపునకు మద్దతునిచ్చే స్థావరాన్ని విడిచిపెట్టమని పాకిస్తాన్ సైన్యం పదే పదే సందేశం పంపినప్పటికీ, టీటీపీని తాలిబన్ ప్రోత్సహిస్తోంది. పైగా కాబూల్‌లో ప్రాతినిధ్య పాలన ఓడిపోయిన తర్వాత టీటీపీ గణనీయంగా బలపడింది. తాలిబన్ తో టీటీపీ బలమైన సైద్ధాంతిక (వ్యూహాత్మక) కూటమిని పంచుకున్నందున ఇది ఊహించదగినదే. టీటీపీ అనేది అఫ్గాన్ తాలిబన్లకు సైద్ధాంతిక విస్తరణ. పైగా ఉగ్రవాదంపై అమెరికా



సాగించిన యుద్ధ సమయంలో తాలిబన్లకు ఇది మద్దతునిచ్చింది. కాబట్టి తిరిగి సహాయం చేయడం కోసం టీటీపీకి తోడ్పాటును అందించాల్సిన బాధ్యత అఫ్గాన్ తాలిబన్లపై ఉంది. అయితే తాలిబన్లు తమ భూభాగంలో టీటీపీ ఉందనడాన్ని ఖండించారు. అంతేకాకుండా అఫ్గాన్ గడ్డపై దాడులను చేయరాదని పాకిస్తాన్‌ను హెచ్చరించారు కూడా.

అయినప్పటికీ, టీటీపీకి అఫ్గాన్ తాలిబన్లు మద్దతు ఇస్తున్నట్లు పాకిస్తాన్ సైన్యం గుర్తించింది. పైగా ఈ విషయంలో తదుపరి చర్యపై బలమైన ప్రకటనలను జారీ చేస్తోంది. ఝోబ్ దాడి తరువాత, 'అఫ్గానిస్తాన్‌లో టీటీపీకి అందుబాటులో ఉన్న సురక్షిత స్వర్గధామాలు, కార్యాచరణకు చెందిన స్వేచ్ఛపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు' పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇటువంటి దాడులు సహించలేనివనీ, పాకిస్తాన్ భద్రతా దళాలు వీటిపై సమర్థవంతంగా ప్రతిస్పందిస్తాయనీ ప్రకటించింది.

ఉగ్ర సంస్థలు ఏకమయ్యే ప్రమాదం

ఐఎస్ఐఎల్ (దాయెష్), అల్–ఖైదా, అనుబంధ గ్రూపులు, వ్యక్తులకు సంబంధించి... ఐక్యరాజ్య సమితి భద్రతామండలికి 'ది ఎనలిటికల్ సపోర్ట్ అండ్ శాంక్షన్స్ మానిటరింగ్ టీమ్' సమర్పించిన 32వ నివేదిక టీటీపీ ఒక ప్రాంతీయ ముప్పుగా మారవచ్చని పేర్కొంది. 'తాలిబన్ నియంత్రణలో దాడి ప్రయత్నాలను తప్పించుకుంటూ, అనేక రకాల విదేశీ సమూహాలు ఏకఛత్రంగా పనిచేస్తాయి లేదా ఐక్యమవుతాయి' అని ఈ నివేదిక తెలిపింది.

అయితే టీటీపీ గురించిన సైన్యం ప్రతిస్పందనపై పుష్కలమైన ఊహాగానాలు ఉన్నాయి. గత సంవత్సరం, పౌర, సైనిక ప్రభుత్వం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు జారీ చేసింది. ఈ సందర్భంలో మూడు ఎంపికలను విశ్లేషించవచ్చు:

ఒకటి: పాకిస్తాన్ ప్రభుత్వం టీటీపీని తిరిగి చర్చల బల్ల వద్దకు తీసుకువచ్చి కాల్పుల విరమణకు ప్రయత్నిస్తుంది. ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్న గత ప్రభుత్వం టీటీపీ గ్రూప్‌తో చర్చలు జరపడానికి ప్రయత్నించి 100 మందికి పైగా టీటీపీ ఖైదీలను విడుదల చేసింది. ఇది టీటీపీ గ్రూప్ బలాన్ని పెంచింది. ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాని డిమాండ్లపై రాజీ పడేందుకు టీటీపీ ఎలాంటి సంకేతాన్నీ చూపలేదు. తీవ్రవాద దాడుల పెరుగుదలకు ఇమ్రాన్ ఖాన్ పదే పదే బాధ్యత వహించారని చెప్పవచ్చు.

రెండు: అఫ్గాన్ తాలిబన్‌ను పాకిస్తాన్ విశ్వాసంలోకి తీసుకుంటుంది. తరువాత గ్రూపును నియంత్రించే బాధ్యత తీసుకుంటుంది. అయితే తాలిబన్, టీటీపీల మధ్య బలమైన సంబంధాలు, తాలిబన్ నుండి టీటీపీ ప్రేరణ పొందడం, పైగా వారిని రోల్ మోడల్‌గా చూడటం ఈ అవకాశ సాధ్యాసాధ్యాలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. అయితే, పాకిస్తాన్‌లోని అస్థిర పరిస్థితులను బట్టి, ఇది అక్కడి పాలనా వ్యవస్థకు సాధ్యమైన ఎంపికగానే కనిపిస్తోంది.

మూడు: టీటీపీని లక్ష్యంగా చేసుకుని ప్రతి–తిరుగుబాటు చేయడం. పాక్ మిలిటరీ ఇంతకుముందు 2014లో జర్బ్–ఎ–అజ్బ్, 2017లో రద్–ఉల్–ఫసాద్ వంటి ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించింది. ఇవి టీటీపీ సంఖ్యను, ఉగ్రవాద దాడులను నిర్వహించగల దాని సామర్థ్యాన్ని ప్రభావితం చేశాయి. అయినప్పటికీ ఈ గ్రూప్ తనను తాను నిలబెట్టుకుని తాలిబన్ మద్దతుతో వృద్ధి చెందింది. అయితే నాలుగు కారణాల వల్ల పాక్ సైనిక ప్రతిస్పందనకు అవరోధం ఏర్పడింది. గిరిజన ప్రాంతాల్లో గణనీయమైన స్థానభ్రంశాలు చోటు చేసుకోవడం; భయంకరమైన ఆర్థిక సంక్షోభం (దాంతో పాటు వరదల వల్ల కలిగిన దుఃస్థితి); ఏ సైనిక చర్య అయినా దేశంపై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతర చేయడం; అఫ్గాన్ తాలిబన్ల నుండి ఎదురు దెబ్బ తగిలే అవకాశాలు అపారంగా ఉండటం.

కుట్రలో భాగమా?

అయితే టీటీపీ గ్రూప్ కార్యకలాపాలను నియంత్రించకపోవడం పాక్ సైన్య ఉద్దేశపూర్వక కుట్ర చర్యలో భాగమనీ, ఉగ్రవాద వ్యతిరేక సహాయాన్ని అమెరికా నుంచి ఆకర్షించడానికే ఇలా చేస్తున్నారనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. ఏమైనా పాక్ సైన్యం తన ఎంపికలను అప్రమత్తంగా పరిశీలిస్తుండగా, పాకిస్తాన్ మాత్రం తన వ్యూహాత్మక ఎంపికల బురదలో చిక్కుకుందనేది వాస్తవం. పాకిస్తాన్ తన విదేశాంగ విధాన సాధనంగా రహస్య యుద్ధానికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కానీ తన సొంత గడ్డపై తీవ్రవాదం నుండి నిరోధక శక్తిని కోరుకుంటోంది. ఉగ్రవాదం, టీటీపీ విస్తరణ ఆందోళనకరమైనవి. సమీప భవిష్యత్తులో పాకిస్తాన్‌కే కాకుండా ఇవి దక్షిణాసియాకు కూడా తీవ్రమైన భద్రతా సవాళ్లను విసరనున్నాయి.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



కఠిన వాస్తవం



వందేళ్ల క్రితం పరిశ్రమల్లో మాత్రమే ఉపయోగించిన నూనెలను ఇప్పుడు వంటనూనెలుగా అమ్ముతున్నారు. అవి మిమ్మల్ని స్థూలకాయుల్ని చేస్తూ, మీ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి.
– బ్రాండన్ పెట్కే, వైద్యుడు

నమ్మకం పోయింది!



తమను వదిలి వెళ్లొద్దని సైన్యాన్ని బతిమాలుతున్నారు కుకి–జో మహిళలు (వీడియో షేర్ చేశారు). సైన్యానికి బదులుగా రాష్ట్ర బలగాలను వాడే ఆలోచన చేస్తున్నారు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్. కానీ కుకి–జో జనానికి రాష్ట్ర బలగాల మీద నమ్మకం లేదు. అంటే ముఖ్యమంత్రి మీద నమ్మకం లేదు. ఇంకా ఆయన ఎందుకు రాజీనామా చేయలేదు?
– తన్మోయ్, కాంగ్రెస్‌వాది

మేధావితనం



ఒక ఉదారవాది పరస్పర విరుద్ధంగా మాట్లాడితే అది 'సందర్భం' అవుతుంది. అదే ఒక రైట్ వింగర్ నిలకడతనాన్ని డిమాండ్ చేస్తే, అది పాత విషయాలను ఎత్తడం అవుతుంది. అందుకే వామపక్షీయులు ఎప్పుడూ నిలకడతనాన్ని డిమాండ్ చేయరు. వారి మనుగడే దానిమీద ఆధారపడి ఉంది.
– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యంగ్య వ్యాఖ్యాత

క్షమించుకోండి



జీవిత పాఠాలు: ఇతరులు మీకు చేసిన, చేసినట్టు ఊహించుకున్న వారి చర్యలను క్షమించేముందు... మీరు చేసిన, చేశాననుకుంటున్న చర్యలకు ముందు మిమ్మల్ని మీరు క్షమించుకోండి.
– శేఖర్ కపూర్, దర్శకుడు

ఆధిపత్యమే లక్ష్యం



భావజాలం పేరుమీద జరుగుతున్న హింస భారతదేశాన్ని వెనక్కి చీకటి యుగాలకు నెడుతోంది. మతం పేరుతో హింస, లింగం పేరుతో హింస, కులం పేరుతో హింస, భాష పేరుతో హింస, ప్రాంతం పేరుతో హింస... ఈ మొత్తం హింస కూడా రాజకీయ, సామాజిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసమే.
– టోనీ జోసెఫ్, జర్నలిస్ట్

ఎవరు కారకులు?



ఇండియాలోని మత హింసకు చాలామంది బీజేపీని నిందించడాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, స్వీడన్, ఇంకా ఇతర చోట్లలో జరుగుతున్న హింసకు కారణాలేమిటని అదే జనాలను అడగాలనుకుంటున్నాను. ఆ దేశాల్లో కూడా బీజేపీ ప్రభుత్వమే ఉందా?
– మీరా చోప్రా, నటి

ఇంత పేదరికమా?



నేను మొరాకోలోని ఫెజ్ నగరంలో ఉన్నాను. 'పాత నగరపు' బజారు, ఇబ్న్ రుష్ద్ (12వ శతాబ్దపు తత్వవేత్త), ఇబ్న్ ఖల్దూన్(14వ శతాబ్దపు సామాజిక శాస్త్రవేత్త) చదివిన మదరసాలు దర్శించాను. నా జీవితంలో ఇంత పేదజనాలను ఎక్కడా చూడలేదు. గంటల తరబడి ఎంత నడిచినా కనబడేది పేదరికమే. ఇప్పుడు ఫెజ్‌లో ఇబ్న్ రుష్ద్ ఉండివుంటే ఏం ఆలోచించే వారు?
– అహ్మెత్ టి. కురు, సోషియాలజీ ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

పొంచి ఉన్న ఆర్థిక సంక్షోభం

విశ్లేషణ



డి. పాపారావు

గత కొద్ది నెలలుగా అటు అమెరికాలోనూ ఇటు అనేక అభివృద్ధి చెందుతోన్న దేశాలలోనూ షేర్ మార్కెట్లు భారీగా పుంజుకుంటున్నట్టుగా కనపడుతోంది. ఈ అంశాన్నీ దానితో పాటుగా నేడు అమెరికాలో నిరుద్యోగం అతి తక్కువ స్థాయిలో ఉండడం, ద్రవ్యోల్బణం కూడా కిందికి దిగి రావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాలో ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశాలు లేవని అనేక మంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. వీరితో పాటుగా అమెరికా ఫెడరల్ బ్యాంక్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ కూడా తాము ఇక ఎంతమాత్రమూ ఆర్థిక మాంద్యాన్ని ఊహించను కూడా ఊహించడం లేదని సెలవిచ్చారు. అలాగే 'సిలికాన్ వ్యాలీ బ్యాంక్' పతనంతో తలెత్తిన ఫైనాన్స్ రంగంలోని తుపాను కూడా సమసి పోయినట్టేనంటూ ఆయన చెబుతున్నారు.

అయితే ఇదంతా వాస్తవమేనా? అటు నిజ ఆర్థిక వ్యవస్థలోనీ, ఇటు ఫైనాన్స్ ఆర్థిక వ్యవస్థలోనీ ఇతరేతర పరిస్థితులూ లేదా గణాంకాలూ అన్నీ ఏం చెబుతున్నాయి? నిజానికి, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ సంక్షోభ సమయంలో అమెరికా ప్రభుత్వం డిపాజిట్‌దారులకు, వారి వారి డిపాజిట్ల మొత్తాన్ని కూడా వారికి చెల్లించే విధంగా చట్టంలో మార్పులు చేయడం వల్లనే నాడు ఆ ఫైనాన్స్ తుపాను మొత్తంగా బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలే దిశగా పోలేదు.

కాగా, ప్రస్తుతం 5.25 – 5.50 శాతంగా ఉన్నటువంటి అమెరికా ఫెడరల్ బ్యాంక్ వడ్డీ రేటు గనక ఒకేసారిగా 6 శాతానికి పెరిగితే అది తిరిగి ఫైనాన్స్ సంక్షోభానికి దారితీసే అవకాశం ఉందనీ, అయితే వడ్డీ రేటు పెంపుదలను కేవలం పావు (0.25) శాతానికి పరిమితం చేస్తే అటువంటి సంక్షోభం తలెత్తక పోవచ్చునేది జెరోమ్ పావెల్ అభిప్రాయంగా ఉంది. కాగా, గతంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతున్నప్పుడు... అది కేవలం తాత్కాలికమైనదనీ, మెల్లగా సర్దుకుంటుంది అనే పొరపాటు అంచనాలను కూడా ఫెడరల్ బ్యాంక్ వేసింది. 2022 ఆరంభం నుంచీ అనేక దఫాలు వడ్డీరేట్లను పెంచినా... ఇప్పటికీ అమెరికాలో ద్రవ్యోల్బణం నిర్దేశించుకున్న దానికన్నా 1 శాతం మేర ఎక్కువగానే ఉంది. ఇప్పటికే ప్రస్తుత వడ్డీ రేట్ల స్థాయిలో రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రుణాలు మొండి బకాయిలుగా మారిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఆస్తుల విలువలు పతనం అవుతున్నాయి.

దిగజారుతోన్న కష్టమర్లు లేదా వినియోగదారుల పరిస్థితిని గమనిస్తోన్న అమెరికా బ్యాంకులు ఇప్పటికే తామిచ్చిన రుణాలను నష్టానికి కూడా సిద్ధపడి వాటిని వసూలు చేసుకోగల ఇతరేతర సంస్థలకు అమ్మేసుకుంటున్నాయి. అంతేకాదు ఇంకా కిస్తీలు (ఇన్‌స్టాల్‌మెంట్‌లు) వసూలవుతున్నా ఆ రుణాలనూ అమ్మే సుకుంటున్నాయి. అంటే, ఈ బ్యాంకుల అంచనాలో అటువంటి రుణాలు ముందు ముందు మొండి బకాయిలు కావడం తథ్యమన్న మాట.

ఇక నేడు మొండి బకాయిలుగా మారే అవకాశం ఉన్న మరొక తరహా రుణాలు – ఎడ్యుకేషన్ లోన్స్. వాస్తవానికి నేటి అమెరికాలోని పూర్తిస్థాయి ఉద్యోగితలో తమ చదువుల కోసం రుణాలు తీసుకున్న విద్యార్థులకు, ఈ ఎడ్యుకేషన్ రుణాలను చెల్లించడం పెద్ద సమస్యగా ఉండరాదు. కానీ, మరి ఇవ్వాళ ఈ రుణాలు చెల్లించడం ఎందుచేత విద్యార్థులకు కష్టం అవుతోంది? 'టైమ్స్' పత్రికలో వచ్చిన ఒక కథనం ప్రకారంగా – 2008 సంక్షోభ కాలంలో పోయినవి మధ్య స్థాయి ఉద్యోగాలు కాగా 'సంక్షోభ అనంతర' కాలంలో తిరిగి వచ్చినవి కేవలం పార్ట్‌టైమ్, చిన్న స్థాయి, తక్కువ వేతనాల ఉద్యోగాలే. ఈ కారణం చేతనే ఇప్పుడు అత్యధిక యువజనులు తమ కొద్దిపాటి వేతనాలతో తాము తీసుకున్న స్టూడెంట్ రుణాలను తీర్చలేక పోతున్నారు.

టెక్నాలజీ రంగ కంపెనీలలో ఉద్యోగాల కోతలు



ఈ పెరుగుదల తాత్కాలికమే!

మొదలుకుని అమెరికాకు భారీగా సరుకులు, సేవలను ఎగుమతి చేసే దేశాలైన – చైనా, భారతదేశం తాలూకు ఎగుమతులు నేడు భారీగా పడిపోతుండడం వంటివన్నీ నేడు ముంచుకొస్తోన్న సంక్షోభానికి తార్కాణాలే. దీనితో పాటుగా ప్రస్తుతం అమెరికాలో ట్రక్ రవాణా కంపెనీల నుంచి – డీజిల్ ఇంజన్ల కోసం ఆర్డర్లు 40 శాతం మేరకు పడిపోవడాన్ని కూడా మనం గమనించవచ్చు. అంటే, అమెరికా సరుకు ఉత్పత్తి రంగంలో మందగమనం ఇప్పటికే మొదలయ్యిందన్నమాట!

అలాగే ప్రస్తుతం పెరుగుతోన్న షేర్ మార్కెట్ సూచీల అంశంలో కూడా గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవచ్చు. 2001వ సంవత్సరంలో అమెరికా హైటెక్ షేర్ మార్కెట్ పతనం మనందరికీ తెలిసిందే. ఈ పతనం ముందర 1995 నుంచి 2000 సంవత్సరం వరకు అమెరికా నాస్‌డాక్స్ షేర్ సూచీ సుమారు 800 శాతం మేరకు పెరిగింది. కాగా, 2001 పతనం అనంతరం 2002 నాటికల్లా ఈ సూచీ దారుణంగా పతనమై, దాని విలువను 790 శాతం మేర కోల్పోయింది. కాబట్టి ప్రస్తుత షేర్ మార్కెట్ సూచీల పెరుగుదల మాంద్యం రాదనడానికి ఏమాత్రం భరోసా కాదు.

నేడు అమెరికాలో నిరుద్యోగం రికార్డ్ స్థాయిలో తక్కువగానే ఉంది. అయితే ఉద్యోగుల పని గంటలు కొద్దిమేరకు తగ్గిపోయి ఉన్నాయి. నోమురా సెక్యూరిటీస్ సంస్థకు చెందిన సీనియర్ ఎకనామిస్ట్ ఒకరి ప్రకారంగా 'గతంలో, ఈ విధంగానే తగ్గిన పనిగంటలు ఆ తరువాతి కాలంలో ఉప్పెనలా రానున్న ఉపాధి కోతలకూ నమ్మకమైన ముందస్తు సూచిక'గా ఉన్నాయి. ఇక దీనంతటితో పాటుగా కృత్రిమ మేధ రూపంలో నేడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానం ధనిక దేశాలలో పావు భాగం పైగా ఉద్యోగాలను తొలగించి వేయగలదని గణాంకాలు చెబుతున్నాయి. ఈ మొత్తం పరిస్థితి యావత్తూ నేడు అనివార్యంగా ముంచుకొస్తోన్న ఆర్థిక మాంద్యం స్థితికి ముందస్తు సూచికలుగా ఉన్నాయి. గడ్డుకాలాన్ని తట్టుకొని నిలబడే మనో స్థైర్యాన్నీ, సాధ్యమైతే ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకోడం, కూడదీసుకోవడం నేటి తప్పని సరి అవసరం!

వ్యాసకర్త ఆర్థిక రంగ విశ్లేషకులు | 98661 79615

త్రికరణ శుద్ధి

'త్రికరణ శుద్ధిగా శివుడిని పూజిస్తే, సర్వమూ సాధించ గలవు!' అంటారు పెద్దలు. ధ్యాసంతా శివుడి మీద ఉంచాలనే భక్తుడి ఇచ్ఛ కూడా. కానీ ఆచరణలో అదంత తేలిక కాదు. తన మనసూ ఇంద్రియాలూ తన మాట వినవు. అవి, వాటి ఇచ్ఛ ప్రకారం కోతికొమ్మచ్చు లాడుతూ, ఏవేవో ఇతర విషయాలన్నిటి మీదా ప్రసరిస్తూ ఉంటాయి. అవును మరి, యజమాని తాను యజమానినన్న మాటే మరచి, తన సేవకులైన ఇంద్రియాలకు తగని స్వేచ్ఛ ఇచ్చి, వాళ్ళ ఇష్టప్రకారం తను నడుచుకొంటూ, వాళ్ళను తృప్తి పరిచేందుకే తన పుణ్య కాలమంతా గడుపుతుంటే, ఇక ఆయన మాటెందుకు నెగ్గుతుంది? గుర్రాన్ని తన ఇష్ట ప్రకారం పోనిస్తే, అది రౌతు చెప్పిన గమ్యానికి చేరదు. తనకు నచ్చిన గమ్యానికి రౌతును చేరుస్తుంది.



'మనసూ, ఇంద్రియాలూ, వాక్కు మన వశంలో ఉండాలంటే, వాటికెప్పుడూ చేతినిండా పని ఉండాలి. ఇతర విషయాల మీదికి మళ్ళ గలిగే తీరికే వాటికి ఇవ్వగూడదు!' అనేది ఒక శివ భక్తుడు చెప్పే చిట్కా.

ఆ భక్తుడి ప్రార్థన ఇలా సాగుతుంది: 'ఓ మహాదేవా! నా మనసు అనవరతం నీ పద పంకజాల మీద లగ్నమై ఉండుగాక! నా వాక్కు నిరంతరం తదేక ధ్యానంతో నీ స్తోత్రాలే జపిస్తూ ఉండుగాక! నా చేతులు ఎప్పుడూ నీ పూజలో నిమగ్నమై ఉండుగాక! నా చెవులు ఎప్పుడూ నీ అద్భుతమైన లీలల గురించిన కథలే ఆకర్షిస్తూ ఉండుగాక! నా నయన యుగళం ఎల్లవేళలా నీ మూర్తినే చూస్తూ ఉండుగాక. ఇలా నా దగ్గర ఉన్న మనో వాక్కరణాలనే ఇంద్రియాలన్నీ శివోన్ముఖమై, శివకైంకర్యంలో మునిగి ఉంటే, ఇతర విషయాల మీదకు నా ధ్యాసను లాగేందుకు నాకు మరే ఇంద్రియాలూ మిగలవు. ఇంద్రియాల ప్రమేయం లేకపోతే విషయాలతో సంబంధమే ఏర్పడదు. ఇక అప్పుడు, పరగ్రంథాన్ కైర్వా, పరమశివ!, జానే పరం అతః? – నీకంటే వేరయిన ఇతర విషయాలను, ఇక నేను ఏ ఇంద్రియాల ద్వారా పట్టించుకోగలుగుతాను?' – (ఆది శంకరుల 'శివానంద లహరి').

– ఎం. మారుతి శాస్త్రి

● సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని శిల్పారామం అభివృద్ధి కోసం రూ.20 కోట్లు కేటాయించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ హాల్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

రూ.పది కోట్లు డిపాజిట్ చేయండి

- డిండి ఎత్తిపోతలకు సంబంధించి తెలంగాణకు సుప్రీంకోర్టు ఆదేశం
- కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు డిపాజిట్ చేయాలని స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ విధించిన జరిమానాలో రూ.పది కోట్లు కట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆ మొత్తాన్ని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే డిండి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పనులు చేపడుతున్నారంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, చంద్రమౌళీశ్వరరెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను ఎన్జీటీ చెన్నై బెంచ్ గతంలో విచారించిన సంగతి తెలిసిందే. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై రూ.528 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.92.85 కోట్లు, తమ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు అదనంగా రూ.300 కోట్లు మొత్తంగా తెలంగాణ ప్రభుత్వానికి రూ.920.85 కోట్ల జరిమానా విధించిన విషయం విదితమే. ఎన్జీటీ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది.

కోర్టు వ్యాఖ్యలు చేసే వరకు వేచి చూడొద్దు

మొత్తం జరిమానా ఎంతంటూ ధర్మాసనం ప్రశ్నించగా డిండి ప్రాజెక్టు విషయంలో రూ.92 కోట్ల జరిమానా విధించారని న్యాయవాదులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి ఎవరు పరిష్కరించాలి? కేంద్ర ప్రభుత్వమా? లేక కోర్టు చొరవ తీసుకోవాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్రం నుంచి తగిన మార్గదర్శకాలు తీసుకుంటానని న్యాయవాది తెలుపగా మార్గదర్శకాలు త్వరగా తీసుకోవాలని కోర్టు వ్యాఖ్యలు చేసే వరకు వేచి చూడొద్దని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని, ప్రస్తుత డిండి కేసుతో సంబంధం లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. చివరగా... ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం డిండి ప్రాజెక్టుకు విధించిన రూ 92 కోట్ల జరిమానాలో రూ.పది కోట్లను కేఆర్‌ఎంబీ ఎదుట మూడు వారాల్లో డిపాజిట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మిగిలిన జరిమానా విషయంలో ప్రభుత్వంపై బలవంతపు చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలపై అభ్యంతరం ఉంటే నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పనులు కొనసాగించుకోవచ్చు..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తాగు నీటి అవసరాలకు సంబంధించి 75 టీఎంసీల మేర పనులు కొనసాగించుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఎన్జీటీ విధించిన రూ.528కోట్ల జరిమానాలపై స్టే ఇస్తూ ఫిబ్రవరి 17న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. రెండు పిటిషన్లలోనూ కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

7న తిరుపతిలో జాతీయ ఓబీసీ మహాసభ

సాక్షి, హైదరాబాద్: మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. దీనిపై ఈనెల 7న తిరుపతి పట్టణం ఎస్వీ యూనివర్సిటీలోని మహతి ఆడిటోరియంలో అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభను బీసీ ప్రతినిధులతో నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం బీసీ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహాసభలో ప్రవేశ పెట్టాల్సిన డిమాండ్లు, తీర్మానాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ రాష్ట్రీయ ఓబీసీ మహాసంగ్, అఖిల భారత బీసీ ఫెడరేషన్, తెలంగాణ, ఏపీ బీసీ సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఏటా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఎనిమిదవ జాతీయ ఓబీసీ మహాసభను తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యాదాద్రిలో లీకేజీలకు మరమ్మతులు



అష్టభుజి ప్రాకార మండపంపై మరమ్మతులు చేస్తున్న కూలీలు

యాదగిరిగుట్ట: ఇటీవల కురిసిన వర్షాలకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ ప్రాకార మండపాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. లీకేజీలకు శుక్రవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఉత్తర దిశలోని అష్టభుజి ప్రాకార మండపం స్లాబ్‌పై లీకేజీలు ఏర్పడిన చోట డంగు సున్నం, సిమెంట్ పనులను చేస్తున్నారు. మరోసారి లీకేజీలు ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా...

'ఇండియా'పై అభ్యంతరం.. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: 26 విపక్ష పార్టీలు తమ కొత్త కూటమికి 'ఇండియా' అని నామకరణం చేసుకోవడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గిరీశ్ భరద్వాజ్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. విపక్ష కూటమికి మన దేశం పేరును పెట్టుకోవడం ఏమిటని అభ్యంతరం తెలిపారు. ఇండియా పేరును వాడుకోవద్దని సూచించారు. ఈ మేరకు ఆదేశాలివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. గిరీశ్ భరద్వాజ్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి, 'ఇండియా' కూటమిలోని 26 పార్టీలకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దేశం పేరున వాడుకోవద్దంటూ ఇప్పటికిప్పుడు ఆర్డర్ ఇవ్వలేమని స్పష్టంచేశారు. ప్రతివాదుల వివరణ విన్నాక స్పందిస్తామని పేర్కొంది.

ఆగస్టు 31, సెప్టెంబర్ 1న 'ఇండియా' సమావేశం !

న్యూఢిల్లీ: ప్రతిపక్షాల కూటమి ఇండియా తదుపరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న తేదీల్లో రెండు రోజుల పాటు ముంబైలో జరిగే అవకాశాలున్నాయి. బెంగళూరు సమావేశం మాదిరిగానే మొదటి రోజు వివిధ పార్టీల నాయకులు సమావేశమై తమ అభిప్రాయాలను పంచుకుంటారు. రెండో రోజు అంటే సెప్టెంబర్ 1న ప్రధాన సమావేశం ఉంటుందని విపక్ష కూటమికి చెందిన వర్గాలు వెల్లడించాయి. సమావేశం తేదీలను 26 పార్టీలకు చెందిన అధినేతలు అంగీకరించారని ఆ వర్గాలు తెలిపాయి. హోటల్ పావాయ్‌లో సమావేశం ఉండే అవకాశం ఉంది. సెప్టెంబర్ 1 సాయంత్రం మీడియా సమావేశం ఉంటుంది. ముంబైలో జరిగే ఈ మూడో సమావేశం ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన, శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీ ఆధ్వర్యంలో జరగనుంది.

ఒకేసారి 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 506 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పథకం పనులకు ప్రధాని మోదీ ఈ నెల 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న ఈ రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం కేంద్రం రూ.24,470 కోట్లను వెచ్చించనుంది. స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్లకు మెరుగులు దిద్దడం, కొత్త, మెరుగైన సూచికల ఏర్పాటు, ఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి వాటికి ఈ మొత్తాన్ని వెచ్చిస్తారని పీఎంవో తెలిపింది. మొత్తం 508 స్టేషన్లలో తెలంగాణలోని 21, ఆంధ్రప్రదేశ్‌లోని18 రైల్వేస్టేషన్లు కూడా ఉన్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మొత్తం 1,309 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తాజాగా ఒకేసారి 506 స్టేషన్ల అభివృద్ధి పనులను ప్రధాని ప్రారంభించనున్నారు.

జనవరిలో అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట

అయోధ్య: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించడానికి శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సన్నాహాలు చేస్తోంది. జనవరి 21, 22, 23 తేదీల్లో ఒక రోజు రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ శుక్రవారం వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. ఇక ఈ కార్యక్రమానికి సాధువులు, హిందూ పీఠాధిపతులు కూడా హాజరుకానున్నారు. 136 పీఠాలకు చెందిన 25 వేల మందికి పైగా సభ్యుల్ని విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జనవరి నెల అంతా అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

మళ్లీ ఎంపీగా రాహుల్ గాంధీ!

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేతకు భారీ ఊరట

రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు

- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- ఇక రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ!
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలగిన అడ్డంకులు

న్యూఢిల్లీ: లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడానికి కారణమైన 2019 నాటి పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రెండేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ గుజరాత్‌లోని సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా లోక్‌సభ సభ్యత్వం మళ్లీ పొందడానికి రాహుల్‌కు అవకాశం లభించింది. ఆయన సభ్యత్వాన్ని లోక్‌సభ స్పీకర్ స్వయంగా పునరుద్ధరించవచ్చు లేదా సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం సభ్యత్వం తిరిగి పొందడానికి రాహుల్ గాంధీ న్యాయ పోరాటం చేయొచ్చు. ఈ తీర్పుతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి రాహుల్ గాంధీకి ఇక అడ్డంకులు తొలగిపోయినట్లే.

ప్రజాజీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలి

పరువు నష్టం కేసులో తనకు రెండేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాహుల్ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని తిరస్కరిస్తూ గుజరాత్ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాహుల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గావై, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన త్రిసభ్య సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. ''పరువు నష్టం కేసులో రాహుల్‌కు గరిష్ట శిక్ష విధించడానికి ట్రయల్ కోర్టు న్యాయమూర్తి ఎలాంటి కారణం చూపలేదు. అందుకే దోషిగా నిర్ధారించే తీర్పును నిలిపివేయాలి. అలాగే ఈ తరహా(పరువుకు నష్టం కలిగించే) వ్యాఖ్యలు మంచివి కావు. అందులో ఏమాత్రం సందేహం లేదు. ప్రజాజీవితంలో ఉన్నవారు బహిరంగ సభల్లో ఆచితూచి మాట్లాడాలని ప్రజలంతా ఆశిస్తారు'' అని స్పష్టం చేసింది. రాహుల్‌ను దోషిగా నిర్ధారించడం అనేది కేవలం ఆయనపైనే కాకుండా ఆయనను తమ ప్రతినిధిగా ఎన్నుకున్న ఓటర్ల హక్కుపై కూడా ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ఐపీసీ సెక్షన్ 499(పరువు నష్టం) కింద రాహుల్‌కు గరిష్ట శిక్ష విధించడంపైనా ధర్మాసనం సంశయం వ్యక్తం చేసింది. శిక్షాకాలం ఒక్కరోజు తగ్గినా ఆయనపై ఎంపీగా అనర్హత వేటు పడేది కాదని ఉద్ఘాటించింది.

సమాజ వ్యతిరేక వ్యాఖ్యలు కావవి

రాహుల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపించారు. తన క్లయింట్ కరడుగట్టిన నేరస్తుడు కాదని చెప్పారు. ఆయనపై బీజేపీ కార్యకర్తలు ఎన్నో కేసులు పెట్టారని, అయినా ఏ ఒక్క కేసులోనూ దోషిగా తేలలేదని గుర్తుచేశారు. రాహుల్‌పై ఫిర్యాదు చేసిన పూర్ణేష్ మోదీ ఇంటిపేరు అసలు మోదీయే కాదని పేర్కొన్నారు. ఈ విషయం ఆయనే చెప్పారని గుర్తుచేశారు. రాహుల్ వ్యాఖ్యలు సమాజానికి వ్యతిరేకంగా చేసినవి కావని వివరించారు. ఇది అపహరణ, హత్య, అత్యాచారం వంటి నేరం కాదని, అయినప్పటికీ రెండేళ్ల జైలు శిక్ష విధించారని ఆక్షేపించారు. రాహుల్ నిర్దోషిగా విడుదల కావడానికి, పార్లమెంట్‌కు హాజరు కావడానికి, వచ్చేసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇదే చివరి అవకాశమని అన్నారు. ఫిర్యాదుదారు పూర్ణేష్ మోదీ తరఫున సీనియర్ అడ్వొకేట్ మహేష్ జెఠ్మలానీ వాదించారు. రాహుల్ తప్పు చేశారనడానికి చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం చివరకు రాహుల్‌కు విధించిన జైలు శిక్షపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



రాహుల్ గాంధీకి స్వీటు తినిపిస్తున్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

ఏమిటీ కేసు?

2019 ఏప్రిల్ 13న కర్ణాటకలోని కోలార్ పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. ''దొంగలందరి ఇంటి పేరు మోదీ అని ఎందుకుంటుంది?'' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను తప్పుపడుతూ గుజరాత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ సూరత్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్‌పై క్రిమినల్, పరువు నష్టం దావా వేశారు. విచారణ జరిపిన సూరత్ కోర్టు 2023 మార్చి 23న రాహుల్ గాంధీని దోషిగా తేల్చింది. రెండేళ్లపాటు జైలు శిక్ష విధించింది. మరుసటి రోజే రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్ అనర్హత వేటు వేశారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యింది. మాజీ ఎంపీగా మారారు. అంతేకాకుండా ఢిల్లీలోని తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి, బయటకు వెళ్లిపోవాల్సి వచ్చింది.

ఇప్పుడేం జరుగుతుంది?

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు ఊరట కలిగించడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారన్న దానిపై చర్చ ప్రారంభమైంది. అధికారిక ప్రక్రియ ప్రకారం.. లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటే రాహుల్ తొలుత లోక్‌సభ సెక్రటేరియట్‌కు విజ్ఞాపన పత్రం సమర్పించాల్సి ఉంటుంది. రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని తెలియజేయాలి. సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని అభ్యర్థించాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వు కాపీని కూడా సమర్పించాలి. అన్నీ సక్రమంగా ఉన్నట్లు భావిస్తే సభ్యత్వాన్ని పునరుద్ధరించినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ ఒక అధికారిక ప్రకటన జారీ చేస్తుంది. ఇటీవల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎంపీ మొహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడానికి రెండు నెలలు పట్టడం గమనార్హం.

కోలార్ నుంచి కోర్టుల వరకు..

నాలుగేళ్ల క్రితం కర్ణాటక ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారమే సృష్టించి చివరికి ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవలసి వచ్చింది. మోదీ ఇంటి పేరుపై రాహుల్ చేసిన వ్యాఖ్యల దగ్గర్నుంచి అత్యున్నత న్యాయస్థానం తీర్పు వరకు పరిణామ క్రమాన్ని చూద్దాం.

ఏప్రిల్ 12, 2019: కర్ణాటకలోని కోలార్‌లో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ దొంగలందరికీ ఇంటి పేరు మోదీయే ఎందుకు ఉంటుంది ? నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ అని వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 15, 2019: గుజరాత్ సూరత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

జూలై 7, 2019: సూరత్ మెట్రోపాలిటన్ కోర్టు ఎదుట రాహుల్ గాంధీ మొదటిసారిగా హాజరయ్యారు.

మార్చి 23, 2023: పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా తేల్చిన సూరత్ కోర్టు ఆయనకి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రాహుల్ అప్పీలు చేసుకోవడానికి వీలుగా నెల రోజుల పాటు తీర్పుని సస్పెండ్ చేసింది.

మార్చి 24, 2023: ఒక క్రిమినల్ కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో పార్లమెంటు సభ్యుడిగా ఆయనపై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం ఒక నోటీసు జారీ చేసింది.

ఏప్రిల్ 3 2023: మెట్రోపాలిటన్ కోర్టు తీర్పుని సవాల్ చేస్తూ రాహుల్ సూరత్ సెషన్స్ కోర్టుని ఆశ్రయించారు. తీర్పుపై స్టే విధించాలని కోరారు

ఏప్రిల్ 20, 2023: తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన సెషన్స్ కోర్టు రాహుల్ పిటిషన్‌ను కొట్టేసింది.

ఏప్రిల్ 25, 2023: రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టుని ఆశ్రయించారు. తన శిక్షను నిలుపదల చేయాలని పిటిషన్ వేశారు.

జూలై 7, 2023: గుజరాత్ హైకోర్టులో రాహుల్‌కి ఎదురు దెబ్బ తగిలింది. శిక్షపై స్టే విధించడానికి నిరాకరించిన కోర్టు రాహుల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

జూలై 15, 2023: హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీం కోర్టుకెక్కారు.

జూలై 21, 2023: ఈ కేసులో గుజరాత్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

ఆగస్టు 4, 2023: రాహుల్‌కి విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ కేసులో కింద కోర్టు గరిష్టంగా రెండేళ్లు జైలు శిక్షని విధించడానికి కారణాలు కనిపించలేదని వ్యాఖ్యానించింది. సుప్రీం తీర్పుతో రాహుల్ పార్లమెంటు సభ్యత్వం తిరిగి పొందడానికి ఆస్కారం ఏర్పడింది.



ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల ఆనందోత్సాహాలు

సత్యమే జయిస్తుంది

- సుప్రీం కోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ
- విపక్ష కూటమి ఇండియాలో హర్షాతిరేకాలు
- సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

న్యూఢిల్లీ: మోదీ ఇంటిపేరుపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో సుప్రీం తీర్పుతో విపక్ష కూటమి ఇండియాలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ ఎంపీగా కొనసాగడానికి అవకాశం ఏర్పడడంతో కేరళలో ఆయన నియోజకవర్గం వయనాడ్‌లో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు మిఠాయిలు పంచిపెట్టారు. మా నాయకుడు తిరిగి వస్తున్నారంటూ ఆనందం వ్యక్తం చేశారు. విద్వేషంపై ప్రేమ సాధించిన విజయమని నాయకులు వ్యాఖ్యానించారు. సుప్రీం తీర్పు వెలువడిన కొద్ది సేపటికి రాహుల్ గాంధీ ఏఐసీసీ కార్యాలయానికి వచ్చారు. అప్పటికే అక్కడ పండగ వాతావరణం నెలకొంది. సత్యమేవ జయతే అంటూ పార్టీ శ్రేణులు రాహుల్‌కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ''నిజమే ఎప్పుడూ గెలుస్తుంది. ఇవాళ కాకపోతే రేపు, లేదంటే ఆ మర్నాడు. నాకు మద్దతుగా ఉన్న ప్రజలందరికీ కృతజ్ఞతలు. నేను ఎలా ముందుకెళ్లాలో నాకు తెలుసు. నా కర్తవ్యం ఏమిటో నాకు స్పష్టంగా తెలుసు. నాకు సాయం చేసిన, ప్రేమ పంచిన వారందరికీ నా ధన్యవాదాలు'' అని రాహుల్ చెప్పారు. అంతకు ముందు ఒక ట్వీట్‌లో ఏది ఏమైనా తన కర్తవ్యాన్ని తాను వీడనని దేశ సిద్ధాంతాలు, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడమే తన బాధ్యతని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఈ విజయం రాహుల్ గాంధీది మాత్రమే కాదని, ఈ దేశ ప్రజలది, ప్రజాస్వామ్యానిదని అన్నారు. సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిన 24 గంటలు తిరగక ముందే రాహుల్‌పై అనర్హత వేటు వేశారని, ఇప్పుడు దానిని ఎత్తేయడానికి ఎంత సమయం తీసుకుంటారో చూడాలని వ్యాఖ్యానించారు.

ఆ మూడు ఎక్కువ కాలం దాగవు

రాహుల్ గాంధీ తిరిగి లోక్‌సభలో అడుగుపెట్టనుండడంతో సోదరి ప్రియాంక ఆనందానికి పట్టపగ్గాల్లేవు. ఆమె తన సంతోషాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. గౌతమ బుద్ధుని కొటేషన్‌ను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సూర్యుడు, చంద్రుడు, నిజం.. ఈ మూడింటిని ఎక్కువ కాలం దాచలేరు అంటూ గౌతమ బుద్ధుడు చెప్పిన మాటల్ని ట్వీట్‌లో రాసిన ప్రియాంక సత్యమేవ జయతే అంటూ ముగించారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ పార్టీలన్నీ సుప్రీం తీర్పుని స్వాగతించాయి. పార్లమెంటులోకి తిరిగి రాహుల్ అడుగు పెట్టే రోజు కోసం చూస్తున్నామని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు.

న్యాయపోరాటం కొనసాగిస్తా : పూర్ణేశ్ మోదీ

రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సుప్రీం కోర్టు తీర్పుని స్వాగతించారు. సుప్రీం తీర్పుని తాము గౌరవిస్తామని, అయితే సెషన్స్ కోర్టులో న్యాయపోరాటం సాగిస్తామని ఆయన చెప్పారు.



సోదరుడు రాహుల్‌గాంధీ జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడం హర్షణీయం. ఈ తీర్పుతో మన న్యాయ వ్యవస్థ మీద , ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ మీద మరింతగా విశ్వాసం పెరిగింది.

- ఎం.కె.స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి



సుప్రీం కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నాను. ప్రజా స్వామ్యం, న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని ఈ తీర్పు బలపరుస్తోంది. రాహుల్‌కి, వయనాడ్ ప్రజలకి నా శుభాకాంక్షలు.

- ఎ.కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం



రాహుల్ గాంధీ మళ్లీ సభలోకి అడుగు పెట్టనుండడం ఎంతో శుభవార్త. దీంతో ఇండియా కూటమి మరింత బలోపేతమవుతుంది. మాతృభూమి కోసం విపక్షాల పోరాటం మరింత ఐక్యంగా సాగి విజయం సాధించి తీరుతాం.

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించండి

స్పీకర్ ఓం బిర్లాకు అధీర్ రంజన్ చౌదరి వినతి

న్యూఢిల్లీ: సత్యమేవ జయతే అని చెప్పడానికి రాహుల్ గాంధీ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులే నిదర్శనమని కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు చౌదరి విజ్ఞప్తి చేశారు. ఓం బిర్లాను ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానంపై జరిగే చర్చలో రాహుల్ మాట్లాడాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించకుండా బీజేపీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరామన్నారు. ఈ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు రాహుల్‌ను అనుమతించాలని శుక్రవారం లోక్‌సభలో స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్‌ను అధీర్ రంజన్ కోరారు. ఈ విషయంలో స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకుంటారని రాజేంద్ర అగర్వాల్ బదులిచ్చారు.

102 ఎఫ్ఐఆర్‌లు...200 మంది అరెస్ట్

మత ఘర్షణలపై హరియాణా హోం మంత్రి వెల్లడి

చండీగఢ్: హరియాణాలో ఇటీవలి మత ఘర్షణలకు సంబంధించి మొత్తం 202 మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్ శుక్రవారం తెలిపారు. ముందు జాగ్రత్తగా మరో 80 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ఘర్షణలపై 102 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇందులో సగం వరకు నూహ్ జిల్లాలోని వన్నారు. మిగతావి గురుగ్రామ్, ఫరీదాబాద్, పల్వాల్ జిల్లాల్లో నమోదయ్యాయన్నారు. ఘర్షణలకు కారకులైన వారిని వదిలే ప్రసక్తే లేదని మంత్రి చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లపై జరిగిన దాడులకు కారకులను గుర్తించే పని మొదలయ్యిందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ప్రార్థనలను ఇళ్ల వద్దే చేసుకోవాలని యంత్రాంగం ప్రజలకు సూచించిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీని వేశామని చెప్పారు.

250 గుడిసెలు కూల్చివేత

టౌరు పట్టణంలోని ప్రభుత్వ జాగాలో నిర్మించుకున్న 250కి పైగా గుడిసెలను నూహ్ జిల్లా యంత్రాంగం శుక్రవారం కూల్చివేసింది. హరియాణా షహరి వికాస్ ప్రాధికారణ్(హెచ్ఎస్‌వీపీ)కి చెందిన ఎకరం భూమిలో బంగ్లాదేశీ వలసదారులు అక్రమంగా వీటిని నిర్మించుకున్నారని నూహ్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పన్వర్ చెప్పారు. వీరంతా గతంలో అస్సాంలో నివసించారని చెప్పారు. ఇటీవలి మత ఘర్షణలకు తాజాగా గుడిసెల కూల్చివేతకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపులో భాగంగానే ఈ గుడిసెలను కూల్చివేసినట్లు వివరించారు.

నూహ్ ఎస్పీపై బదిలీ వేటు

నూహ్ జిల్లా పోలీస్ ఎస్పీ, డిప్యూటీ కమిషనర్‌లపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఎస్పీ వరుణ్ సింగ్లాను భివానీకి మార్చింది. భివానీ ఎస్పీ, అదనపు డీజీపీ(శాంతి భద్రతలు) ఓఎస్డీగా కూడా ఉన్న నరేంద్ర బిజార్నియాకు నూహ్ ఎస్పీగా బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా, డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పన్వర్‌ను మత్స్య శాఖ అదనపు కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో అటవీశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న ఖడ్గటాను నియమించింది. ఈ మేరకు ఈ నెల 3న అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) టీవీఎస్ఎస్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ ర్యాలీని అడ్డగించేందుకు కొందరు ప్రయత్నించడం మత కలహాలకు దారి తీయడం తెలిసిందే. వివిధ హింసాత్మక ఘటనల్లో ఇద్దరు హోంగార్డులు, ఒక మత బోధకుడు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

- మణిపూర్ అంశంపై కొనసాగిన విపక్షాల ఆందోళన
- రాజస్తాన్‌లో మహిళలపట్ల నేరాలపై రాజ్యసభలో బీజేపీ ఆగ్రహం
- లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా



న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో యథావిధిగా రగడ కొనసాగింది. మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభలో శుక్రవారం ఆందోళనకు దిగారు. నినాదాలతో హోరెత్తించారు. సభా కార్యకలాపాలకు పదే పదే అడ్డు తగిలారు. రాజస్తాన్‌లో మహిళలపై జరుగుతున్న నేరాలపై చర్చ జరపాలంటూ రాజ్యసభలో అధికార బీజేపీ సభ్యులు నినదించారు. గందరగోళం కారణంగా లోక్‌సభ, రాజ్యసభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరకు రెండు సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో పట్టువీడని విపక్షాలు

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇంతలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ జోక్యం చేసుకున్నారు. ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టాల్సి ఉందని, సభ్యులంతా సహకరించాలని కోరారు. సభా కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. నినాదాలు కొనసాగించారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్య దాదాపు 20 నిమిషాలపాటు సభ జరిగింది. అనంతరం సభను స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమయ్యాక కూడా విపక్షాలు శాంతించలేదు. దాంతో చేసేదిలేక సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. సైనిక దళాలను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 'ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేషన్స్(కమాండ్, కంట్రోల్, డిసిప్లిన్) బిల్లు'ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. స్వల్ప చర్చ అనంతరం సభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అలాగే 'ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(అమెండ్‌మెంట్) బిల్లు-2023' కూడా ఆమోదించారు.

రాజ్యసభలో అధికార బీజేపీ ఆందోళన

రాజస్తాన్‌లోని భిల్వారా జిల్లాలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య వ్యవహారాన్ని రాజ్యసభలో అధికార బీజేపీ సభ్యులు లేవనెత్తారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాజస్తాన్‌లో శాంతి భద్రతలు నానాటికీ దిగజారుతున్నాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. బీజేపీ సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు 'మణిపూర్, మణిపూర్' అంటూ నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా ప్రతిష్టంభనకు తెరపడలేదు. దీంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

మణిపూర్‌లో ఆయుధాల లూటీ

ఇంఫాల్: మణిపూర్‌లో తెగల పోరు, ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి పోలీసు ఆయుధాగారంపై దుండగులు దాడి జరిపి ఆయుధాలను లూటీ చేశారు. ఏకే 47, ఘాతక్ వంటి అత్యాధునిక రైఫిల్స్, వివిధ రకాల తుపాకుల్లోని 19 వేలకు పైగా బుల్లెట్లు అపహరించారు. బిష్ణుపూర్ జిల్లా నారన్‌సైనా ప్రాంతంలో రెండవ ఇండియా రిజర్వ్ బెటాలియన్‌లో ఈ లూటీ జరిగింది. ''బెటాలియన్ కేంద్రంపై దాడులకు దిగిన అల్లరి మూకలు అత్యాధునిక ఆయుధాలను లూటీ చేశారు. ఏకే, ఘాతక్ రైఫిళ్లు, 195 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్, అయిదు ఎంపీ-5 గన్స్, 16 9ఎంఎం పిస్టల్స్, 25 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, 21 కార్బైన్స్, 124 హ్యాండ్ గ్రెనేడ్స్‌ను దొంగిలించారు'' అని అధికారులు తెలిపారు. మరోవైపు మే 3వ తేదీన జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సామూహిక ఖననానికి ఆదివాసీలు చేస్తున్న ప్రయత్నాలు ఉద్రిక్తతలకి దారి తీస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న మరికొందరు ప్రదర్శనగా ఆ ప్రాంతానికి వెళ్లడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో 25 మందికిపైగా గాయపడ్డారు. దీంతో, అంతిమ సంస్కార కార్యక్రమాలను కేంద్రం వినతి మేరకు వారం పాటు వాయిదా వేసుకున్నారు.

'జ్ఞానవాపి' సర్వేపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ(ఏఎస్ఐ) శాస్త్రీయ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన అనుమతిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ సర్వే ప్రార్థనాస్థలాల చట్టాన్ని అతిక్రమించడం, చరిత్రలోకి వెళ్లి పాత గాయాలను మళ్లీ రేపడమేనన్న మసీదు కమిటీ వాదనతో అత్యున్నత న్యాయస్థానం విభేదించింది. సర్వే చేపట్టే సమయంలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని, సదరు కట్టడానికి ఎలాంటి నష్టం వాటిల్లరాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఏఎస్ఐ అధికారులను ఆదేశించింది. ఏఎస్ఐ నివేదిక వివాదాస్పద అంశాల నిర్ధారణకు సంబంధించింది కాదని ధర్మాసనం మసీదు కమిటీకి స్పష్టం చేసింది. ఇలా ఉండగా, అలహాబాద్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ఏఎస్ఐ అధికారులు శుక్రవారం జ్ఞానవాపి మసీదులో సర్వే చేపట్టారు. ఆ సర్వేను అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ బహిష్కరించింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తారుమారు కేసు

కోర్టుకు హాజరైన ట్రంప్..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించారని అభియోగాలను ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ విషయంలో తాను నిర్దోషినని తనకే పాపం తెలీదని చెప్పారు. ఇండియన్ అమెరికన్ మహిళా న్యాయమూర్తి మోక్సిలా ఎ ఉపాధ్యాయ ఎదుట ట్రంప్ హాజరయ్యారు. రాజకీయ ప్రత్యర్థులే ఈ కేసులో ఇరికించారని ట్రంప్ పేర్కొన్నారు. 2020లో జరిగిన ఎన్నికల్లో బైడెన్ విజయం సాధించినప్పటికీ దానిని అధికారికంగా వెల్లడించకుండా 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ భవనంపై దాడికి పాల్పడ్డారంటూ అభియోగాలు నమోదయ్యాయి. ట్రంప్ అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కోర్టు హాలు వెనుక తలుపులోంచి లోపలికి ప్రవేశించారు.

ఎవరీ ఉపాధ్యాయ ?: న్యాయమూర్తి మోక్సిలా ఎ ఉపాధ్యాయ గుజరాత్‌లో జన్మించారు. ఆమె చిన్నతనంలో తల్లిదండ్రులు అమెరికా వెళ్లిపోవడంతో కన్సస్‌లో పెరిగారు.

సాక్షి హైదరాబాద్

శనివారం | 5 | ఆగస్టు | 2023

ఓయూలో త్వరలో పీహెచ్‌డీ ప్రవేశాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న 350 పీహెచ్‌డీ సీట్లకు త్వరలో ప్రవేశాలు కల్పించనున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులు పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. పీహెచ్‌డీ ప్రవేశాలను కేటగిరీ-1, 2లుగా విభజించారు. తొలుత కేటగిరీ-1కు (యూజీసీ నెట్, జేఆర్ఎఫ్, ఇతర ఫెలోషిప్‌ల అభ్యర్థులు) ఈ నెల 7న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కేటగిరీ-2కు (ఎంట్రన్స్ పరీక్ష) ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈ నెల 21న నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర కోరారు. -8లో

న్యూస్‌రీల్

బహిరంగ మద్యపానం.. వ్యక్తికి నెల రోజుల జైలు



శ్రీనివాసరావు

బంజారాహిల్స్: బహిరంగంగా మద్యం తాగడమే కాకుండా ఇది నిబంధనలకు విరుద్ధమని చెప్పిన పోలీసులను అడ్డుకున్నందుకు ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకృష్ణానగర్‌లో నివసించే ఎం.శ్రీనివాసరావు(35) గురువారం శ్రీకృష్ణానగర్‌లో రోడ్డు పక్కన నిల్చొని మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకొని ఇలా తాగడం పద్ధతి కాదని చెప్పగా వారి విధులను అడ్డుకుంటూ దుర్భాషలాడాడు. శ్రీనివాసరావుపై పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం నాంపల్లిలోని ఏడో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. గతంలో కూడా నిందితుడు పలు కేసుల్లో జైలుకు వెళ్లివచ్చినట్లు దర్యాప్తులో తేలింది.

7న పలు ప్రాంతాల్లో నీళ్లు బంద్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు నీటి సరఫరా అంతరాయం కలగనుంది. సింగూరు నుంచి హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న 1200 ఎంఎం డయా పీఎస్సీ పైపులైన్‌కు ఖానాపూర్ వద్ద ఏర్పడిన భారీ లీకేజీ అరికట్టడానికి ఈ నెల 7న సోమవారం ఉదయం 6 నుంచి 8వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో 24 గంటల పాటు సింగాపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న రిజర్వాయర్ పరిధి ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి వర్గాలు వెల్లడించారు. నీటి సరఫరాలో అంతరాయం కలగనున్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. అంతరాయం కలిగే ప్రాంతాలు ఇలా ఉన్నాయి. ఓఅండ్ఎం డివిజన్ నంబర్ 3: షేక్‌పేట్, టోలిచౌకి, గోల్కొండ, బోజగుట్ట రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు. ఓఅండ్ఎం డివిజన్ నంబర్ 18 : గండిపేట్, కోకాపేట్, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, ఖానాపూర్, నెక్నంపూర్, మంచి రేవుల.

ఓటరు నమోదుపై ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది తదితర ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ యంత్రాంగం దృష్టి సారించింది. మరోవైపు ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా ఉండేందుకు, బోగస్ ఓటర్లకు చెక్ పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఓటు హక్కు ఉన్నప్పటికీ ఓటర్లుగా నమోదు కాని వారినందరినీ జాబితాలో చేర్చాలని భావిస్తోంది. దాంతోపాటు ఇప్పటికే ఓటరు జాబితాలో పేరున్నప్పటికీ పొరపాట్లు ఉంటే సవరించేందుకు, చిరునామా మారిన వారిని పాత అడ్రస్ నుంచి తొలగించి కొత్త అడ్రస్‌కు మార్చేందుకు సిద్ధమవుతోంది. వీటికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్ రాజ్ ఇటీవల చేసిన సూచనలకనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందుకుగాను దాదాపు 620 మంది బీఎల్‌ఓలు, నోడల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. స్థానికుల నుంచి దరఖాస్తుల స్వీకరణతో పాటు పొరపాట్ల సవరణ, చిరునామా మార్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారు.



నాంపల్లి రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

తీరొక్క సొబగులతో..!

'సిటీ సెంటర్లు'గా రైల్వేస్టేషన్లు

- నగర అందాలను ద్విగుణీకృతం చేసేలా..
- గ్రేటర్‌లో నాంపల్లి, మల్కాజిగిరి తదితర స్టేషన్ల అభివృద్ధి
- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పనులు ప్రారంభం
- 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- వివరాలు వెల్లడించిన ద.మ రైల్వే జీఎం అరుణ్‌కుమార్



మలక్‌పేట్

స్టేషన్‌ల పునరభివృద్ధి కోసం నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)

స్టేషన్	నిధులు (రూ.కోట్లలో)
నాంపల్లి	309
హైటెక్‌సిటీ	26.60
హఫీజ్‌పేట్	26.60
ఉప్పుగూడ	26.81
మలక్‌పేట్	36.44
మల్కాజిగిరి	27.61

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని రైల్వేస్టేషన్లు ఇక 'సిటీ సెంటర్లు'గా అవతరించనున్నాయి. రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల సదుపాయాలతో పాటు, హోటళ్లు, మాల్స్ వంటి సౌకర్యాలను కల్పించనున్నాయి. హైదరాబాద్ చారిత్రక అందాలను ద్విగుణీకృతం చేసేవిధంగా, అంతర్జాతీయ హంగులను సంతరించుకోనున్నాయి. ప్రయాణికులు, పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకొనేవిధంగా అందంగా, ఆహ్లాదభరితంగా రైల్వేస్టేషన్లను పునరభివృద్ధి చేసేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా అమలు కానున్న 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 6న పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం..



ఉప్పుగూడ

నగర సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబించేలా..

- నగరంలోని నాంపల్లి, మల్కాజిగిరి, హఫీజ్‌పేట్, మలక్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ స్టేషన్లను మొదటి దశలో పునరభివృద్ధి చేయనున్నాం. రెండో దశలో భాగంగా బేగంపేట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం. రాబోయే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒక మాస్టర్‌ప్లాన్ ప్రకారం రైల్వేస్టేషన్లను పునరభివృద్ధి చేస్తాం. నగర చారిత్రక, సాంస్కృతిక జీవన విధానాన్ని ప్రతిబింబించేలా రైల్వేస్టేషన్లను అధునాతనంగా తీర్చిదిద్దనున్నాం. ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన సదుపాయాలు కల్పిస్తాం. నగరవాసులకు ఇవి సిటీసెంటర్లుగా వివిధ రకాల సదుపాయాలతో అందుబాటులో ఉంటాయి. అనవసర నిర్మాణాలను తొలగించడం ద్వారా రైల్వే స్టేషన్‌లకు సాఫీగా చేరుకోవచ్చు. చక్కటి లైటింగ్, విశాలమైన ఆవరణ, అధునాతన పార్కింగ్ స్థలం, దివ్యాంగులకు అనుకూలమైన మౌలిక సదుపాయాలు, పర్యావరణహిత పద్ధతులతో స్టేషన్లను డిజైన్ చేయనున్నాం.

రూ.309 కోట్లతో..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తర్వాత అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలు సాగించే నాంపల్లి రైల్వేస్టేషన్‌ను రూ.309 కోట్లతో పునరభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 50 వేల మంది ప్రయాణికులు నాంపల్లి నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరుతున్నారు. రోజుకు 40 నుంచి 50 రైళ్లు దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. మరో లక్ష మందికి పైగా ప్రయాణికులు నాంపల్లిస్టేషన్‌ను వినియోగించుకొనేందుకు అనుగుణంగా, మరిన్ని రైళ్లను ఇక్కడి నుంచి నడిపేందుకు వీలుగా అభివృద్ధి చేస్తాం. నగరంలో రెండో అధునాతన స్టేషన్‌గా అంతర్జాతీయ ప్రమాణాలతో నాంపల్లి స్టేషన్ అందుబాటులోకి రానుంది. స్టేషన్‌కు రెండు వైపులా ఏకీకృతమైన పద్ధతిలో నిర్మాణాలను చేపడతాం. ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్రయాణికుల విశ్రాంతి హాళ్లు, హోటళ్లు, వినోద కేంద్రాలు తదితర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నాం. నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు నాంపల్లి స్టేషన్ ఒక సమాచార కేంద్రంగా అందుబాటులో ఉండనుంది.

సిటీ బస్సులకు, మెట్రోకు చేరువయ్యేలా..

నగరంలోని ఎంఎంటీఎస్ స్టేషన్లలను ఇంటర్-మోడల్ ఇంటిగ్రేషన్ పద్ధతిలో ఆధునికీకరిస్తాం. అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద పునరభివృద్ధి చేయనున్న హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్, మలక్‌పేట్, మల్కాజిగిరి, ఉప్పుగూడ స్టేషన్లను సిటీబస్సులు, అవకాశం ఉన్నచోట మెట్రో సేవలతో అనుసంధానం చేస్తాం. ప్రయాణికులు మెట్రో రైళ్లు, బస్సుల్లో ఎంఎంటీఎస్ స్టేషన్‌లకు చేరుకునేలా.. అలాగే ఎంఎంటీఎస్ రైళ్లు దిగిన తర్వాత సిటీ బస్సుల్లో ఎక్కడికైనా వెళ్లేందుకు అనుగుణంగా రాకపోకలను మెరుగుపరుస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎంఎంటీఎస్ స్టేషన్లు అందంగా, ఆకర్షణీయంగా రూపుదిద్దుకోనున్నాయి. వ్యాపార, వాణిజ్యకేంద్రాలుగా కూడా ఇవి అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులకు, నగరవాసులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి.



హైటెక్ సిటీ

పునరభివృద్ధి ఇలా..

- ప్రస్తుతం ఉన్న స్టేషన్లను ఆకర్షణీయమైన డిజైన్‌లతో పునరభివృద్ధి.
- ప్రయాణికులకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి.
- వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు అనుకూలంగా.
- ప్రయాణికులకు తెలిసేలా సూచీల ఏర్పాటు.
- ప్రతి స్టేషన్‌ను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి.
- ల్యాండ్‌స్కేపింగ్‌తో పాటు స్థానిక కళలను, సంస్కృతిని ప్రతిబింబించేలా..



హఫీజ్‌పేట్



మల్కాజిగిరి

ప్రియురాలికి వీడియో కాల్ చేసి.. ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నరేష్‌కుమార్ మృతదేహం

మలక్‌పేట: ప్రేమ విఫలమైందని మనస్తాపం చెందిన ఓ యువకుడు.. ప్రియురాలికి వీడియో కాల్ చేసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..మూసారంబాగ్ సంజీవయ్యనగర్‌కు చెందిన జానకీరామ్ కుమారుడు నరేష్‌కుమార్ సొంతంగా కారు నడుపుతున్నాడు. సోదరుడితో కలిసి ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం నరేష్‌కుమార్ బయటికి వెళ్లి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. తన ప్రియురాలికి వీడియో కాల్ చేసి మాట్లాడుతూ.. చనిపోతున్నానని చెప్పి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వెంటనే యువతి నరేష్‌కుమార్ బంధువుకు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పింది. దీంతో ఆమె కూడా నరేష్‌కుమార్‌కు ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయకపోవడంతో హుటాహుటిన సంజీవయ్యనగర్‌కు చేరుకుని చుట్టుపక్కల వాళ్లతో కలిసి ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. స్థానికులు అతన్ని కిందికి దించి చూడగా అప్పటికే చనిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్ వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని తమ్ముడు సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కోసం వచ్చి.. బైక్ వదిలి పరార్..

ఫిలింనగర్: దొంగతనం కోసం వచ్చిన దుండగులు ఇంటి యజమాని అప్రమత్తమై కేకలు వేయడంతో తాము వచ్చిన బైక్‌ను అక్కడే వదిలేసి పరారైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ...షేక్‌పేట ఓయూ కాలనీ సమీపంలోని భగత్‌సింగ్ కమ్యూనిటీ హాల్ వద్ద నివసించే మెకానిక్ ఆంజనేయులు శుక్రవారం తెల్లవారుజామున అలికిడి రావడంతో లేచి చూశాడు. ఏసీ సందులో నుంచి ఓ చెయ్యి లోపలికి రావడం, తన పర్సును తస్కరించేందుకు యత్నించడంతో వెంటనే లేచి అరిచాడు. ఈ అరుపులకు ఆ వ్యక్తి అక్కడి నుంచి పరారవుతుండగా ఆంజనేయులు బయటికి పరుగులు తీశాడు. దొంగతనానికి వచ్చిన వ్యక్తితో పాటు మరొకరు కూడా ఉన్నట్లుగా గుర్తించాడు. ఇద్దరిని పట్టుకునేందుకు యత్నించగా వారు అప్పటికే అక్కడి నుంచి పరారయ్యారు. అయితే దొంగతనానికి ఈ ఇద్దరూ వచ్చిన యాక్టివా బైక్‌ను అక్కడే వదిలేసిపోయారు. బాధితులు ఈ బైక్‌ను పోలీసులకు అప్పగించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ చేయగానే రూ.95 వేలు మాయం

బంజారాహిల్స్: సైబర్ నేరగాళ్లు వైద్యురాలికి 95 వేల రూపాయలు టోకరా వేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 3 శ్రీనికేతన కాలనీలో నివసించే లక్ష్మి వైద్యురాలు. గత నెల 15న ఆమెకు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పాడు. ఏదైనా ఫిర్యాదు ఉందా అని అడిగాడు. తాను చేసిన 41,955 రూపాయలకు సంబంధించి ఆన్‌లైన్ షాపింగ్‌పై అనుమానాలు ఉన్నాయని ఆమె తెలిపారు. దీంతో ఫోన్ చేసిన వ్యక్తి కొన్ని వివరాలు అడగగా ఫోన్‌లో ఇవ్వలేనని నిరాకరించారు. అయితే ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు పొందుపరిస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పాడు. ఈ మేరకు లక్ష్మి యాప్ డౌన్‌లోడ్ చేసి సమాచారం నమోదు చేసిన వెంటనే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.95వేలు డ్రా అయినట్టు మెస్సేజ్ వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కొనివ్వలేదని అలిగి.. బాలుడు అదృశ్యం



అదృశ్యమైన బాలుడు గోవర్ధన్

బంజారాహిల్స్: బైక్ కొనివ్వమంటే తల్లిదండ్రులు నిరాకరించారని అలిగి ఓ బాలుడు ఇంట్లో నుంచి అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీ సరస్వతి స్కూల్ సమీపంలో నివసించే సి.గోవర్ధన్ గత నెల 31వ తేదీన తండ్రి వెంకటయ్యను తనకు బైక్ కొనివ్వాలంటూ అడిగాడు. అయితే తనకు ఆ స్తోమత లేదని తండ్రి చెప్పాడు. ఇక ఎప్పటికీ బైక్ కొనివ్వలేడని మనస్తాపానికి గురైన గోవర్ధన్ అదే రోజు రాత్రి ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. గత నాలుగు రోజుల పాటు తల్లిదండ్రులు కొడుకు కోసం అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన కొడుకు కనిపించడం లేదంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని బాలుడికోసం గాలిస్తున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నందుకు..

రాజేంద్రనగర్: నిత్యం అధికంగా సెల్‌ఫోన్ మాట్లాడుతున్న కూతుర్ని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన బాలిక గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కింగ్స్ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక (15) 8వ తరగతి చదువుతుంది. శుక్రవారం ఉదయం బాలిక సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడం చేసి తల్లిదండ్రులు మందలించి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లోని మరో గదిలోకి వెళ్లింది. తమ పనిలో నిమగ్నమైన తల్లిదండ్రులు మధ్యాహ్నమైనా కూతురు గదిలోంచి బయటకు రాకపోవడంతో వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం ద్రవాన్ని చీరపై స్ప్రేగా చల్లి అక్రమ రవాణా



శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి దుబాయ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి లగేజీని పరిశీలించారు. అందులో ఉన్న ఓ కాటన్ చీరపై బంగారం ద్రవాన్ని స్ప్రేగా చల్లి తీసుకొచ్చినట్లు గుర్తించి దానిని బయటికి తీశారు. బయటపడిన 461 గ్రాముల బంగారం విలువ రూ.28 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

934 పోస్టులు..

- గ్రేటర్‌లో వీఆర్ఏల సర్దుబాటు కోసం..
- సగానికి పైగా రెవెన్యూ శాఖకు కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సర్దుబాటు కోసం 934 పోస్టులు మంజూరయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని ప్రభుత్వ విభాగాల్లోని వివిధ శాఖల్లో వీఆర్ఏల సర్దుబాటు కోసం ఈ పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. రెవెన్యూ శాఖకు 217 జూనియర్ అసిస్టెంట్, 234 రికార్డ్ అసిస్టెంట్, 44 ఆఫీస్ సబార్డినేట్/ చైన్‌మెన్ పోస్టులు మంజూరు చేసింది. పురపాలక శాఖలో 205 వార్డు ఆఫీసర్ (జూనియర్ అసిస్టెంట్) పోస్టులు, మిషన్ భగీరథ శాఖలో 156 హెల్పర్ పోస్టులు, నీటిపారుదల శాఖలో 78 లష్కర్, హెల్పర్ పోస్టులను కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఆర్ఏల విద్యార్హతలు, సామర్థ్యాల మేరకు వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ.2 కోట్లతో మహిళ పరార్

మైలార్‌దేవ్‌పల్లి: అధికవడ్డీ ఆశచూపి దాదాపు రూ.2 కోట్ల వరకు వసూలు చేసుకొని పరారైన మహిళపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా చంద్రకళ అనే మహిళ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. మాయమాటలు చెబుతూ ఆమె ఇరుగుపొరుగు మహిళల నుంచి వడ్డీకని చెప్పి దాదాపు రూ.2 కోట్ల వరకు తీసుకుంది. రూ.3 నుంచి 5 రూపాయల వరకు వడ్డీ ఇస్తానని చెప్పి..ఒకరికి తెలియకుండా మరొకరికి బురిడీ వేసింది. కొందరి దగ్గర నగదు, మరికొందరి వద్ద బంగారం తీసుకున్నది. మే నెలలో ఇస్తానని చెప్పి కనిపించకుండా పోవడంతో శుక్రవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రాత్రి 9.30 గంటల కల్లా కరెంట్ కట్ అవుతుందని..

లింకు పంపి రూ.6 లక్షలు దోచేసిన సైబర్ కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: 'డియర్ కన్జూమర్ మీ కరెంట్ బిల్లు బకాయి ఉంది. ఈరోజు రాత్రి 9.30గంటల వరకు బిల్లు కట్టకపోతే కరెంట్ సరఫరా ఆపేస్తాం. తక్షణం ఈ లింకును ఓపెన్ చేసి బిల్లు కట్టండి' అంటూ వచ్చిన సందేశానికి భయపడ్డ నగర వాసి వెనకా ముందూ ఆలోచించకుండా లింకు ఓపెన్ చేశాడు. ఇంకేముంది అవకాశం దొరికింది కదా అని భావించిన కేటుగాళ్లు అందిన కాడికి దోచేశారు. లక్షల రూపాయలు కోల్పోయిన అనంతరం తనకు న్యాయం చేయాలంటూ హుమాయన్‌నగర్‌కు చెందిన బాధితుడు సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి.మారుతికి ఫిర్యాదు చేశాడు. బాధితుడికి రెండు రోజుల క్రితం పైవిధంగా మెసేజ్ రావడంతో లింకు ఓపెన్ చేసి ఫోన్‌ను తన భార్యకు ఇచ్చాడు. దీనిని ఎలా కట్టాలో మీరే తెలపండంటూ ఆమె కేటుగాళ్లను కోరింది. అంతే..మీకు వచ్చే ప్రతి ఓటీపీ మాకు చెప్పండి రెండు, మూడు ఓటీపీలతో మీ బిల్లు కట్టేస్తాం అన్నారు. వచ్చిన ఓటీపీలను చెప్పడంతో పలు దఫాలుగా రూ.6 లక్షలు దోచేశారు. మా డబ్బు కట్ అవడం ఏంటంటూ బాధితుడి భార్య నిలదీయగా.. టెక్నికల్ ఎర్రర్ ఉంది మీ డబ్బు మీకు వచ్చేస్తుందని నమ్మించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ ఆర్.జి.మారుతి తెలిపారు.

25న పంజగుట్ట హిందూ శ్మశాన వాటిక ప్రారంభం: తలసాని



ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో చర్చిస్తున్న మంత్రి

బంజారాహిల్స్: మనిషి చివరి మజిలీ ప్రశాంతంగా ముగియాలనే ఆలోచనతో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.3లో రూ.5 కోట్ల వ్యయంతో జరుగుతున్న పంజగుట్ట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. శ్మశాన వాటికను ఈ నెల 25న ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. చక్కని రోడ్లు, ప్రహరీ నిర్మాణం, అస్థికలను భద్రపరిచేలా లాకర్ల ఏర్పాటు తదితర సౌకర్యాలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇది 12 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటోందని చెప్పారు. నగరంలో ఇప్పటికే చాలా శ్మశాన వాటికలను అభివృద్ధి చేశామన్నారు. జీహెచ్ఎంసీ నుంచి రూ.1.95 కోట్లు, రూ.3 కోట్లు ఫినిక్స్ నుంచి వెచ్చించి పంజగుట్ట శ్మశాన వాటిక సుందరంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, ఎస్ఈ రత్నాకర్, డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో వినూత్న ఆఫర్లు



బీ న్యూ మొబైల్ స్టోర్‌లో రెడ్‌మీ ఫోన్‌ను ప్రారంభించిన నటి మీనాక్షి చౌదరి, సంస్థ ప్రతినిదులు

మాదాపూర్: బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్స్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నారని నటి మీనాక్షి చౌదరి తెలిపారు. మాదాపూర్‌లోని బీ న్యూ స్టోర్‌లో శుక్రవారం ఆమె రెడ్‌మి–12 సిరీస్‌ను ప్రారంభించారు. సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయినిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినితేష్, రెడ్‌మి సేల్స్ సీనియర్ మేనేజర్ సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌మి–12 సెగ్మెంట్‌లోని అత్యుత్తమ స్మార్ట్‌ఫోన్ అని తెలిపారు. తమ స్టోర్స్‌లో విభిన్న మొబైల్స్‌పై ఆఫర్లు లభిస్తున్నాయన్నారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో రెడ్‌మి-12 లాంచింగ్



సెలెక్ట్ మొబైల్ స్టోర్‌లో రెడ్‌మి-12 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న నటి పూజిత, సంస్థ ఈడీ మురళి రేతినేని తదితరులు

మాదాపూర్: ప్రముఖ మొబైల్స్ రిటైల్ చైన్ సంస్థ 'సెలెక్ట్ మొబైల్స్' మాదాపూర్ స్టోర్‌లో శుక్రవారం షావోమి సరికొత్త మొబైల్ రెడ్‌మి–12 5జీ మోడల్‌ను నటి పూజిత, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని కలిసి ఆవిష్కరించారు. ఉత్తమ ఫీచర్లను కలిగిన రెడ్‌మి ఫోన్‌లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఉన్న అన్ని సెలెక్ట్ స్టోర్‌లలో పొందవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర కోరారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఐటీ కంపెనీలు, ఐటీ సంస్థలతో ఎస్‌సీఎస్‌సీ, సైబరాబాద్ పోలీసులతో ఆయన ఇంటరాక్టివ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ సంస్థల ఉద్యోగులు ఇళ్ల నుంచి కార్యాలయానికి, అక్కడి నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో రోడ్లపై రాకపోకల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. కార్ పూలింగ్‌పై ఐటీ ఉద్యోగులు దృష్టి పెట్టేలా సంస్థలన్నీ దృష్టి సారించాలని ఆయన సూచించారు. మంగళవారం నుంచి గురువారం దాకా రోడ్లపై ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. ఈ సమయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చేయడంపై సమర్థవంతమైన చర్యలు పోలీసులు తీసుకోవడంలో అందరూ సహకరించాలన్నారు. ఉద్యోగులు కార్యాలయంలో 60 శాతం సమయం, మిగిలిన సమయం ఇంట్లో లాగిన్ చేయడం కొనసాగించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్, టీసీఎస్, హెచ్ఎస్‌బీసీ, జేపీమోర్గాన్, డెలాయిట్, వర్చ్యూషా, హైసియా, ఇతర సంస్థల ప్రతినిధులు సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ కమిషనర్ నారాయణ్‌నాయక్, డీసీపీ ట్రాఫిక్ హర్షవర్ధన్, డీసీపీ మాదాపూర్ శ్రీనివాసరావు, డీసీపీ సందీప్, ఏసీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: జంట నగరాలలోని 179 మద్యం దుకాణాల నిర్వహణకు 2023–25 సంవత్సరాలకు గాను ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ నగర డిప్యూటీ కమిషనర్ కె.శాస్త్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లిలోని ఆబ్కారిశాఖ కార్యాలయంలో మద్యం దుకాణాలకు టెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 18వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, ఈ నెల 21వ తేదీన అంబర్‌పేటలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల డ్రాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లలో భాగంగా 24 దుకాణాలను కేటాయించినట్లు వెల్లడించారు. గతంలో 1786 దరఖాస్తులు రాగా ఈ సంవత్సరం ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జంటనగరాల ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్లు విజయ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లారెడ్డిపై విమర్శలు తగదు

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చేసిన విమర్శలు అర్థరహితమని మేడ్చల్ మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మేడ్చల్ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి మల్లారెడ్డిని కెఎల్ఆర్ తన రాజకీయం మనుగడ కోసం విమర్శించడం తగదన్నారు. కెఎల్ఆర్ ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి రియల్ వ్యాపారాలు చేసుకుని కోట్లు దండుకున్నాడని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సమావేశంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

LIC HFL LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
బ్యాక్ ఆఫీస్, 201, 2వ అంతస్తు, క్రిష్ సఫైర్, మాదాపూర్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, హైదరాబాద్- 500 081. ఫోన్ నం.040-40052223

బహిరంగ ప్రకటన

శ్రీ ఫుటుకూరి వెంకటేశ్వర రావు తండ్రి ఫుటుకూరి వరప్రసాద్ రావు దిగువ షెడ్యూల్‌లో తెలిపిన ఆస్తిని తనఖా పెట్టడం ద్వారా 30-09-2020న LICHFL నుండి రుణాన్ని వినియోగించుకున్నారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, L.B. నగర్ సర్కిల్, GHMC, ఉప్పల్ రెవెన్యూ మండలం, ఫతుల్లాగూడ గ్రామం వద్ద గల సర్వే నం.లు 59 & 60, ప్లాట్ నం.182లో 178 చ.గ.ల భూమి విస్తీర్ణం మరియు 1520 చ.అ.ల BUP ఏరియా (GF 760 చ.అ.లు & FF 760 చ.అ.లు) గల ఇల్లు యావత్తు. **సైట్ సరిహద్దులు:** ఉత్తరం: 40 అ.ల వెడల్పు రోడ్, తూర్పు: ప్లాట్ నం.181, దక్షిణం: ప్లాట్ నం.177, పశ్చిమం: ప్లాట్ నం.183.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 12తో చదువబడే SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని LICHFL వారు 23-01-2023న నిర్వహించిన వేలంలో షెడ్యూల్ ఆస్తిని విక్రయించారు. కావున, పైన తెలిపిన షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది/ సూచించడమైనది.

తేది: 05-08-2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

RARE అసెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : 104-106, గాలా అర్గోస్, హరికృప టవర్ దగ్గర, గుజరాత్ కాలేజ్ రోడ్, అహ్మదాబాద్-380006, ఫోన్-079 4009 2295

ఇ-వేలం అమ్మకం- M/S MBS జ్యువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వాయిదా ప్రకటన

SARFAESI చట్టం, 2002 క్రింద జారీ చేసిన ఖాతాకు సంబంధించిన సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కోసం 09.07.2023 తేదీ గల ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇ-వేలం తేది: 27.07.2023తో 09.07.2023న ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ మరియు సాక్షి దినపత్రికలలో ప్రచురించబడింది, అది అనివార్య పరిస్థితుల కారణంగా 10.08.2023కు వాయిదా వేయబడింది. ఇ-వేలం అమ్మకం ప్రకటన మరియు వాయిదా ప్రకటన Rare ARC వెబ్‌సైట్ (https://www.rarearc.com)లో అదే విధంగా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (https://sarfaesi.auctiontiger.net) వెబ్‌సైట్‌లో కూడా అప్‌లోడ్ చేయబడింది. సవరించిన ఇ-వేలం అమ్మకం షెడ్యూల్ దిగువ తెలిపిన విధంగా ఉంటుందని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీస్ జారీ చేయబడింది: • **బయానా దాఖలు చేసేందుకు ఆఖరి తేదీ/సమయం : 09.08.2023(బుధవారం), • ఇ-వేలం తేదీ మరియు సమయం: 10.08.2023 (గురువారం) మ. 1.00 గం. నుండి మ.3.00 గం. వరకు** (ముగింపుకు ముందు చివరి ఐదు నిమిషాలలో బిడ్ వేసిన సందర్భంలో ఆటో ఎక్స్‌టెన్షన్ క్లాజ్‌తో) • **09.07.2023 తేదీ గల** ఇ-వేలం అమ్మకం ప్రకటనలో ఉన్న అన్ని ఇతర నియమ నిబంధనలు యథాతథంగా ఉంటాయి.

ప్రదేశం : అహ్మదాబాద్ సం/- అధీకృత అధికారి
తేది : 04.08.2023 Rare అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్

Union Bank of India — यूनियन बैंक ऑफ इंडिया, भारत सरकार का उपक्रम, A Government of India Undertaking

స్ట్రెస్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, హైదరాబాద్
3వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్ - 500095
ఇ-మెయిల్ : ubin0812048@unionbankofindia.bank
టెలిఫోన్ నం.: 040-24683303, 24683305, 24683310, 24683315, 24683316

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు రూల్ 9 క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కోసం 15 రోజుల నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 మరియు రూల్ 9 క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్‌చేయబడిన, దిగువ వివరించిన స్థిరాస్తి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మకంగా/ భౌతికంగా స్వాధీనతలోకి తీసుకొనబడినవి. అవి దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు) నుండి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** కు బకాయి ఉన్న బకాయిలను రాబట్టుకునేందుకు దిగువ తెలిపిన తేదీన **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే"** మరియు **"అక్కడ ఏమున్నవో అవే"** మరియు **"ఉన్నవి ఉన్నట్లుగానే"** ప్రాతిపదికన విక్రయించబడతాయని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు)కు మరియు గ్యారంటార్(లు)కు ఇందుమూలంగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, బయానా డిపాజిట్ మరియు బిడ్ పెంపుదల కూడా దిగువ తెలియజేయబడినవి:

ఇ-వేలం తేది మరియు సమయం : 24.08.2023 మరియు ఉ. 11.00 గం.ల నుండి సా. 4.00 గం.ల వరకు (10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)

రుణగ్రహీత: మెసర్స్ ట్రాన్స్‌స్ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్, మెసర్స్ ట్రాన్స్‌స్ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్ యొక్క లిక్విడేటర్ డా॥ గోవింద రాజుల వెంకట నరసింహ రావు. గ్యారంటార్లు: 1. శ్రీ రాయపాటి జగదీష్ తండ్రి రాయపాటి గోపాలకృష్ణ, 2. శ్రీ రాయపాటి జీవన్ తండ్రి రాయపాటి గోపాలకృష్ణ, 3. శ్రీ చెరుకూరి శ్రీధర్ తండ్రి జగన్నాథరావు చెరుకూరి, 4. రాయపాటి రంగారావు తండ్రి రాయపాటి సాంబశివరావు, 5. శ్రీ రంగారావు (శ్రీమతి లీలాకుమారి న్యాయ వారసులు) తండ్రి రాయపాటి సాంబశివరావు, 6. శ్రీమతి దేవిక రాణి తండ్రి రాయపాటి సాంబశివరావు, 7. శ్రీమతి దేవిక రాణి (శ్రీమతి లీలాకుమారి న్యాయ వారసురాలు) తండ్రి రాయపాటి సాంబశివరావు, 8. శ్రీమతి లక్ష్మి, (శ్రీమతి లీలాకుమారి న్యాయ వారసురాలు) తండ్రి రాయపాటి సాంబశివరావు, 9. శ్రీమతి సిహెచ్ వాణి భర్త సిహెచ్. శ్రీధర్, 10. శ్రీ యలమంచిలి అజయ్ (యలమంచిలి జగన్ మోహన్ న్యాయ వారసులు) తండ్రి శ్రీ జగన్ మోహన్ యలమంచిలి (లేట్), 11. శ్రీ యలమంచిలి విజయ్ (యలమంచిలి జగన్ మోహన్ న్యాయ వారసులు) తండ్రి శ్రీ జగన్ మోహన్ యలమంచిలి (లేట్), 12. శ్రీ యలమంచిలి సంజయ్ (యలమంచిలి జగన్ మోహన్ న్యాయ వారసులు) తండ్రి శ్రీ జగన్ మోహన్ యలమంచిలి (లేట్), 13. శ్రీ నారాయ్య చౌదరి తండ్రి లేట్ వీరయ్య చౌదరి. బకాయి మొత్తం: e-AB (UBI లోకి కలువక ముందు)లో 31.12.2020 నాటికి రూ.968.48 కోట్లు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలతో.

డిమాండ్ నోటీసు తేది : 01.01.2016. స్వాధీనతా ప్రకటన తేది : 08.09.2017.

ఆస్తి-1 వివరణ : మెసర్స్ ట్రాన్స్‌స్ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్‌కు చెంది ఉండి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం మరియు మండలం వద్ద గల కమర్షియల్ భూమి కలిగిన ఆస్తి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం వద్ద ఎ. 2.04 పూర్తి విస్తీర్ణం కలిగి పశ్చిమం వైపులోని ఎ. 1.50లో ఈశాన్య మూల సర్వే నం. 223/1లోని ఎ. 13.82 భూమిలో ఎ. 0.70 విస్తీర్ణం. **సరిహద్దులు: ఉత్తరం :** క్లెయిమెంట్ భూమి, **దక్షిణం :** సామర్లకోట రోడ్‌లోని భూమి, **తూర్పు:** సోడసాని పుల్లయ్య భూమి, **పశ్చిమం:** క్లెయిమెంట్ భూమి.

[illegible]

బిక్కవోలు గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా వద్ద ఉత్తరం వైపున ఎ. 1.78 పూర్తి విస్తీర్ణంలో ఎ. 0.40 విస్తీర్ణం, సర్వే నం. 227/4B కలిగిన భూమి యావత్తు దీనితో జతపరచబడింది. **సరిహద్దులు: ఉత్తరం:** నెలపల సుబ్బన్న భూమి, **దక్షిణం :** వంగ వీరబాబు భూమి, **తూర్పు:** ఈలి చిన్న అప్పారావు భూమి, **పశ్చిమం :** బల్లవల్లి రోడ్.

బిక్కవోలు గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా వద్ద వెస్ట్ ఈస్టర్న్ సైడ్‌లో ఎ. 2.92 పూర్తి విస్తీర్ణంలో ఎ. 0.62 విస్తీర్ణం, సర్వే నం. 224/1 మరియు పశ్చిమం వైపున సర్వే నం.లు 12.63 ఎ. పూర్తి విస్తీర్ణంలో ఎ. 0.50 విస్తీర్ణం, సర్వే నం. 224/1B కలిగిన భూమి యావత్తు (మొత్తం విస్తీర్ణం ఎ. 1.12) (సర్వే మరియు అనుభోగం ప్రకారం సర్వే నం. 224/1B, విస్తీర్ణం ఎ. 0.95) **దీనితో జతపరచబడింది. సరిహద్దులు: ఉత్తరం:** రైల్వే భూమి, **దక్షిణం :** లొల్ల నూరి బాబు @ వాటర్ బోర్డ్ భూమి, **తూర్పు:** నక్కా వీరన్న భూమి, **పశ్చిమం:** కాద నాగమణి మరియు ఇతరుల భూమి.

బిక్కవోలు గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా వద్ద ఎ. 3.56 పూర్తి విస్తీర్ణంలో సర్వే నం. 224/2 (ఎ.0.05) మరియు 224/3 (ఎ. 0.45) మొత్తం విస్తీర్ణం ఎ. 0.50 కలిగిన భూమి యావత్తు **సరిహద్దులు: ఉత్తరం:** ఈడి గోవిందరావు భూమి, **దక్షిణం :** సేనాపతి అప్పారావు భూమి, **తూర్పు:** మండల రాణి భూమి, **పశ్చిమం :** కాద నాగమణి భూమి.

GPS కోఆర్డినేట్స్: 16.981048N 82.061247E, స్వాధీనత రకం: నిర్మాణాత్మక స్వాధీనం, MSTC ఆస్తి ఐడి : UBINHYDSAM5026A

రిజర్వు ధర: రూ. 6,94,00,000/-, బయానా: రూ. 69,40,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ. 7,00,000/-

ఆస్తి-2 వివరణ : ఆంధ్రప్రదేశ్, గుంటూరు, అరండల్‌పేట్, 4వ లైన్, అరండల్‌పేట్ మున్సిపల్ పార్క్ మరియు హోటల్ గీతా రెసిడెన్సీ దగ్గర, కొత్త డోర్ నం. 31-4-340, 4/2-3, పాత డోర్ నం. 6-4-101, 6-4-101/ఎ, వార్డు నం.6, కొత్త వార్డు నం. 05, పాత వార్డు నం. 03, రెవెన్యూ వార్డు నం.17, అసెస్‌మెంట్ నం. 1021044812, బ్లాక్ నం. 09, గుంటూరులో టీఎస్ నం. 532 వద్ద గల 22500 చ.అ.లు (1042 చ.గ.లు) విస్తీర్ణంలో 3 కమర్షియల్ / ఇన్‌స్టిట్యూషనల్ ఉపయోగ భవనాలతో సైట్ యావత్తు. **సరిహద్దులు : తూర్పు :** తుమ్మ మానమ్మ ఆస్తి, **దక్షిణం :** మున్సిపల్ రోడ్, **పశ్చిమం :** మారెళ్ళ నరసింహారావు ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ రోడ్.

GPS కోఆర్డినేట్స్: Latitude : 16.303443, Longitude : 80.441348, స్వాధీనత రకం: నిర్మాణాత్మక స్వాధీనం

రిజర్వు ధర: రూ. 13,53,00,000/-, బయానా: రూ. 1,35,30,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ. 14,00,000/-

బయానా దాఖలు కోసం ఆఖరి తేది : ఇ-వేలం ప్రారంభ తేదీన లేదా అలోగా

రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాల కోసం దిగువ తెలిపిన సైట్లను దర్శించండి : రిజిస్ట్రేషన్ సంబంధిత విచారణల కోసం ibapiop@mstcecommerce.comకు ఇ-మెయిల్ చేయండి.

బయానా చెల్లింపు / రిఫండ్ సంబంధిత విచారణల కోసం ibapifin@mstcecommerce.comకు ఇ-మెయిల్ చేయండి.

రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాల కోసం దర్శించండి https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp and "Buyer Guide for Login and Registration" ను క్లిక్ చేయండి.

ఇ-వేలం తేది, సమయం : 24.08.2023న ఉ.11.00 గం. నుండి సా. 4.00 గం.ల మధ్య (10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)

తేది : 02.08.2023, ప్రదేశం : హైదరాబాద్ సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, SAM బ్రాంచ్, హైదరాబాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శ్రీనగర్‌కాలనీ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గ్రీన్‌ల్యాండ్స్ 11కేవీ ఫీడర్‌లోని బీఎస్ మక్తా కుందన్‌భాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని బీఎస్ మక్తా, హాస్పెన్‌నగర్, నిషాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభాని మజీద్ ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్ ఏరియా, వరుణ్‌మౌంట్ ప్రాంతంలోని ప్రకాష్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేర్‌మౌంట్ అపార్ట్‌మెంట్స్, బోరబండ డివిజన్ పరిధిలోని స్వరాజ్ నగర్, ఎస్ఆర్‌టీ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కుందన్‌భాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ స్టాఫ్‌కాలేజ్ మెయిన్‌రోడ్, అమృత విల్లా, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ పరిధిలోని క్యాచే ప్రాపర్టీస్ ప్రాంతాలు, బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని నవభారత్‌నగర్, గుట్టల బేగంపేట, ఎస్‌పీఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌పీఆర్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

బోరబండ పీహెచ్‌సీకి 108 అంబులెన్స్

రహమత్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్‌ను బోరబండ పీహెచ్‌సీలో శుక్రవారం అందజేశారు. ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధ, వైద్యులు సుభాన్, మమత, దీప్తి, బీఆర్ఎస్ నాయకులు సిరాజ్, విజయసింహ, విజయ్‌కుమార్, షరీఫ్, ఫయాజ్‌ఖాన్, సర్దార్, అహ్మద్, ముఖరం, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



ధన్‌రాజ్ రాథోడ్‌ను సత్కరిస్తున్న ఎన్‌బీ నగర్ యువత

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా నియమితులైన ధన్‌రాజ్ రాథోడ్‌ను శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీ నగర్ యూత్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఎన్బీ నగర్‌లో నివసించే ధన్‌రాజ్ రాథోడ్ కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ ప్రతిష్టాత్మక పదవిని చేపట్టడంతో ఆనందం వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని 'కాందిశీకుల' వినతి

పంజగుట్ట: ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వానికి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్‌కు చెందిన బాధితులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు మునావర్ సుల్తానా మాట్లాడుతూ... స్వాతంత్ర్యం అనంతరం కాందిశీకులకు 1950లో భారత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా పూర్వీకులైన రాధాబాయి, తహలమల్‌లకు పలు సర్వే నెంబర్లలో 143 ఎకరాల భూమి కేటాయించారన్నారు. తమ పూర్వీకుల తదనంతరం తమ పేరుపై మార్పుకునేందుకు లీగలైజ్ సర్టిఫికెట్ ఇచ్చినా, ఉన్నత న్యాయస్థానం అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవచూపి తమకు న్యాయం చేయాలన్నారు.

ఐదో రోజుకు రిలే దీక్షలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో పీజీ విద్యార్థులు చేస్తున్న సమ్మె ఐదో రోజూ శాంతియుతంగా కొనసాగింది. సమ్మెలో భాగంగా శుక్రవారం మౌన దీక్షను చేపట్టారు. విద్యార్థులకు మద్దతుగా ఎన్ఐఎంఏ అడ్వైజర్ జ్యోత్స్న, తెలంగాణ ప్రెసిడెంట్ అనిల్‌పాటిల్, డాక్టర్ శ్రీధర్ విద్యార్థులకు మద్దతు తెలిపారు. సమ్మెలో పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జగన్‌లాల్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సంధ్య, డాక్టర్ సహన తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 7 ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ బోరబండ డివిజన్ రాజ్‌నగర్‌లోఆయన ప్రచారం నిర్వహించారు. పార్టీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ, నేతలు లంకాల దీపక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కిలారి మనోహర్, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంభాల గంగరాజు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు.. సరికొత్తగా..!

- సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులకు శిక్షణ
- ఈ నెల 8 వరకు కొనసాగనున్న శిక్షణ



బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు గత నెల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే షేక్‌పేట, ఖైరతాబాద్, అమీర్‌పేట మండలాల పరిధిలో 47 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఈ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 9 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

> ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ గతేడాది తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భాష, గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్) కోసం 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానం క్షేత్ర స్థాయిలో మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈ విద్యాసంవత్సరం (2023–24)లో రెండో విడత అమలుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

- పాఠశాల విద్యను పూర్తి చేసేసరికి విద్యార్థులంతా తరగతుల వారీగా ఆయా సబ్జెక్టులలో సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలు సాధిస్తేనే గుణాత్మక విద్య అందించినట్లు భావిస్తారు.
- గత కొన్నేళ్లుగా గుణాత్మక విద్య ప్రశ్నార్థకం అవడంతో దీన్ని చక్కదిద్దేందుకు ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు తొలిమెట్టు పేరుతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

శిక్షణ ఇలా...

- తొలి మెట్టు కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు గతేడాది మాదిరిగానే ఖైరతాబాద్ జోన్ వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.
- ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో శిక్షణ పూర్తయింది. గత నెల 28వ తేదీ వరకు జిల్లా రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. మూడు సబ్జెక్టులకు మండలానికి ముగ్గురు చొప్పున షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాలల్లో 132 మందికి శిక్షణ ఇచ్చారు.
- తాజాగా ఈ రెండు మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారు.
- షేక్‌పేట మండల పరిధిలో 21 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఆంగ్లం, గణితం, తెలుగు సబ్జెక్టులలో ఒక్కో సబ్జెక్టు నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 126 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు.
- తెలుగు, ఆంగ్లం, గణితం బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరవుతారు.
- ఎస్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయులు ఈ శిక్షణ ఇస్తున్నారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో, తర్వాత జిల్లా స్థాయిలో, అనంతరం మండల స్థాయిలో ఈ శిక్షణ విడతల వారిగా జరుగుతున్నది.
- విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా శిక్షణ జరుగుతున్నది. బోధన ప్రణాళిక, రూపకల్పన, అవసరమైన సామగ్రి సిద్ధం చేయడం, మూల్యాంకనం, పర్యవేక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.
- గతేడాది సత్ఫలితాలు రాగా మలివిడత అమలును మరింత విజయవంతం చేసే దిశలో ఈ శిక్షణ కొనసాగుతోంది. గత లోపాలను సరి చేసుకొని అమలు చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

యువత ఆవారాగా తిరిగితే సహించం

- బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్
- అర్ధరాత్రి దాటినా బయటే ఉన్న యువకులకు 'క్లాస్'



శ్రీరాంనగర్‌లో యువకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ పరిధిలో గురువారం రాత్రి ఆపరేషన్ చబుత్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై, అరుగులపై కూర్చుని కాలక్షేపం చేసే యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ మాట్లాడుతూ... అర్ధరాత్రి వరకు కాలక్షేపం చేయడం మంచిది కాదని హెచ్చరించారు. తల్లిదండ్రులు అర్ధరాత్రి వరకు పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు రాత్రి వేళాల్లోనే ఎక్కువగా జరుతాయి కాబట్టి ఈ అలవాటును మానుకోవాలని సూచించారు. ఇకపై అర్ధరాత్రి వరకు రోడ్లపై కూర్చునే యువకులకు చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐలు మనోజ్, సర్దార్ జలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాతవారికే అవకాశం ఇవ్వాలి: మంత్రి తలసాని

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్ట హిందూ శ్మశాన వాటికను ఫినిక్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నప్పటికీ దాన్ని నమ్ముకొని ఏళ్లుగా జీవనం సాగిస్తున్న కుటుంబాలకే అన్యాయం చేయొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శుక్రవారం శ్మశాన వాటికలో అధికారులతో ఆయన పర్యటించిన సందర్భంగా ఈ శ్మశాన వాటికపై ఆధారపడి జీవిస్తున్న మహిళలు కళ్యాణి, లక్ష్మి మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. ఇక్కడ చాలా కాలంగా పని చేస్తున్నవారికి ఫినిక్స్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో వారి ఉపాధికి నష్టం కలిగించొద్దని సూచించారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్‌దే ప్రథమ స్థానం



స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎదురుగా సింగపూర్‌కు చెందిన హోమ్స్ టూ లైఫ్ గ్లోబల్ బ్రాండ్ స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బ్రాండ్ హెడ్ సెలెస్టెపువా మాట్లాడుతూ... విలాసవంతమైన గృహాలంకరణ ఉత్పత్తులను హైదరాబాద్‌వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ షోరూంను ప్రారంభించామన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ప్రముఖ స్థానంలో ఉందని ఈ కారణంగానే ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి రావాలని స్టోర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సోఫాలు, డైనింగ్ సెట్స్, బెడ్‌రూమ్ ఫర్నీచర్, అలంకార ఉత్పత్తులను ఇక్కడ ప్రత్యేక డిజైన్లను, కనువిందు చేసే ఆకృతులను అందుబాటులో ఉన్నాయన్నారు. సంస్థ ఇండియా కంట్రీ హెడ్ వరుణ్ కాంత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చోరీకి గురైన బైక్ యజమానికి అప్పగింత



బైక్‌ను యజమానికి అప్పగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: రోడ్డు పక్కన అక్రమంగా పార్కింగ్ చేసిన ఓ ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు క్రేన్ ద్వారా అక్కడి నుంచి తరలించి వాహనానికి సంబంధించిన వివరాలు ఆరా తీయగా అది దొంగతనం చేసిన బైక్ అని తేలింది. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన బైక్ (టీఎస్ 19 బి 0787)పై నిందితుడు జూబ్లీహిల్స్ రహదారులపై చక్కర్లు కొడుతున్నాడు. శుక్రవారం ఉదయం రోడ్ నెం. 36 ప్రధాన రహదారిలో అక్రమంగా పార్కింగ్ చేసి వెళ్లాడు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది రోడ్డుకు అడ్డుగా ఉన్న ఈ బైక్‌ను అక్కడి నుంచి తొలగించి స్టేషన్‌కు తరలించారు. ఈ బైక్ యజమాని గురించి వివరాలు సేకరించే క్రమంలో ఫోన్ చేయగా ఇటీవలే తన బైక్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైందని అవతలి వ్యక్తి చెప్పాడు. క్రేన్ సిబ్బంది లిఫ్ట్ చేసిన బైక్ చోరీ చేసిందిగా గుర్తించిన పోలీసులు హయత్‌నగర్ పోలీసులకు బైక్ యజమాని సమక్షంలో అప్పగించారు.

ఆరోగ్యకర జీవనశైలికి ఆయుర్వేదం దోహదం



అమృతా కౌర్‌కు జ్ఞాపిక ఇస్తున్న రీతూ షా

పంజగుట్ట: ఆయుర్వేదం జీవిత శాస్త్రం ఇది ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడంలో ఎంతో సహాయపడుతుందని వెల్‌నెస్ కోచ్, ఆయుర్వేద ఔత్సాహికురాలు అమృతా కౌర్ రాణా అన్నారు. ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ పార్క్ హోటల్‌లో ఆయుర్లీ హెల్తీ, ఆధునిక జీవనం కోసం ప్రాచీన జ్ఞానాన్ని ఉపయోగించడం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అమృతా కౌర్ మాట్లాడుతూ... అధునిక జీవనం కోసం ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు కోసం ఆయుర్వేద సూత్రాల ఆధారంగా రోజువారీ అభ్యాసాలు చాలా ముఖ్యమైనవని, శక్తితో కూడిన మనస్సుతో తేలికగా ఉండడం ఆరోగ్యకరమని తెలిపారు. తినే సమయంలో ఆహారంపై మనస్సు కేంద్రీకరించడం మన శరీరధర్మాన్ని ప్రభావితం చేస్తుందని, మన జీర్ణక్రియను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ఆహారం తిన్న అరగంట వరకు నీళ్లు తాగరాదని, 100 అడుగులు నడవడం మంచిదని ఇలా చేస్తే రక్తంలో చెక్కర స్థాయిలు పెరగవన్నారు. ఫిక్కీ చైర్మన్ రీతూ షా మాట్లాడుతూ... శరీరాన్ని మంచి ఆరోగ్యంతో ఉంచుకోవడం మన కర్తవ్యమని లేకపోతే మన మనస్సు బలంగా స్పష్టంగా ఉంచుకోలేమన్నారు. ఫిక్కీ హైదరాబాద్ చాప్టర్ కోసం ప్రత్యేకంగా యాప్ ప్రారంభించారు.

నేడు ఐడీపీ ఎడ్యుకేషన్ ఫెయిర్

హాజరుకానున్న ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ విద్య కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల కోసం నేడు నగరం వేదికగా అతిపెద్ద ఐడీపీ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించనున్నారు. అంతర్జాతీయ విద్యా సేవలందిస్తున్న ఐడీపీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పార్క్ హయత్ వేదికగా ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా దక్షిణాసియా–మారిషస్ రీజినల్ డైరెక్టర్ పీయూష్ కుమార్ మాట్లాడుతూ... ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో ఆస్ట్రేలియా, కెనడా నుంచి దాదాపు 50 ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు పాల్గొంటాని తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు వారిని విదేశీ విద్యకు ఆసక్తిగా ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులతో పరస్పర చర్చలకు అనుమతిస్తున్నామన్నారు. నేడు నిర్వహించే కార్యక్రమంతో పాటు సెప్టెంబరు 10న నగరంలోని ఐటీసీ కోహినూర్ వేదికగా అదనపు ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందులో యూకే, యూఎస్ఏ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రాధాన్య సంస్థలను కలుసుకోవచ్చని, కోర్సు–విశ్వవిద్యాలయ ఎంపిక, పత్రాల సమర్పణ, సంస్థలకు దరఖాస్తు చేయడం, విద్యా రుణాలు తదితర అంశాలపై నిపుణుల మార్గదర్శకత్వం పొందవచ్చన్నారు.

పనులు వేగవంతం చేయండి: జెడ్‌సీ

బంజారాహిల్స్: పంజగుట్ట హిందూ శ్మశాన వాటికను ఈ నెల 25న ప్రారంభించనున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని ఈఈ విజయ్‌కుమార్‌ను జోనల్ కమిషనర్ వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పంజగుట్ట శ్మశాన వాటికలో పర్యటించారు. ఈ సందర్భంగా హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పక్కనే ఉన్న ముస్లిం శ్మశాటిన వాటిక ప్రహరీ పనులు కూడా చేయాలని సూచించారు.

ఇంప్లెక్స్ ఎగ్జిబిషన్‌లో 'వీఐపీ ఇంటర్నేషనల్' స్టాల్



హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హింప్లెక్స్ ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఎక్స్‌పో–2023 ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్లాస్టిక్ ఎగ్జిబిషన్‌లో యువ పారిశ్రామికవేత్తలు మల్లెం భవ్యశ్రీ, గోపాలుని పునీత్ సాయి కనకవర్షలకు చెందిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. రెండేళ్ల క్రితం మల్లెం భవ్యశ్రీ జీడిమెట్లలో వీఐపీ ఇంటర్నేషనల్ అనే సంస్థను స్థాపించారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ మెటీరియల్ తయారీ, మార్కెటింగ్ రంగంలో అనతికాలంలోనే మల్లెం భవ్యశ్రీ అగ్రశ్రేణి వ్యాపారవేత్తగా నిరూపించుకున్నారు. పలు రాష్ట్రాలకు ప్లాస్టిక్ మెటీరియల్‌ను అందిస్తూ వీఐపీ ఇంటర్నేషనల్ సంస్థ మార్కెట్‌ను దేశీయంగా బలోపేతం చేశారు. మల్టీఫిలమెంట్, పీపీ యార్న్, పీఈ వాక్స్, రా మెటీరియల్స్, కలర్ మాస్టర్ బ్యాచెస్ వంటి ఉత్పత్తుల తయారీలో వీఐపీ ఇంటర్నేషనల్ వినియోగదారుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని సంపాదించుకుంది. మల్లెం భవ్యశ్రీ భర్త యువ పారిశ్రామికవేత్త గోపాలుని పునీత్ సాయి కనకవర్ష స్థాపించిన వెంకటేశ్వర పాలిమర్స్ ద్వారా హెచ్ఎం, ఎల్డీ కవర్స్, ష్రింక్ ఫిల్మింస్, బయోడీగ్రేడబుల్ కవర్స్, స్ట్రెచ్ ఫిల్మ్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఈ ఉత్పత్తులను సరఫరా చేస్తూ తన వ్యాపార కార్యకలాపాలను వెంకటేశ్వర పాలిమర్స్ విస్తరించుకుంది.

మానసిక వికలాంగులకు చేయుతనివ్వాలి



విస్తరాకుల మిషన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్

శ్రీనగర్‌కాలనీ: మానసిక వికలాంగులకు చేయూత ఇవ్వాల్సిన భాధ్యత అందరిపై ఉందని, మానసిక రోగాలకు చాలా కారణాలుంటాయని, వాటిని దాటి వచ్చిన వారికి భరోసా ఇవ్వాలని ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో సయోధ్య, మెప్మా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా రోగుల పునరావాస కేంద్రం (ఆఫ్ వే హోం)లో చికిత్స పూర్తయి నిరాదరణకు గురైన మహిళలకు విస్తరాకుల మిషన్‌ను అందించి వారికి ఉపాధిని కలిగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఉమాశంకర్ మిషన్‌ను ప్రారంభించి మహిళలకు అభినందనలు తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉన్న మహిళలకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమోద్య సెక్రటరీ మృదుల, డిప్యూటీ సూపరింటెండెంట్ శిరీష, జావీద్, పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఫిలింనగర్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఫిలింనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళలతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిడ్డకు తల్లిపాలు ఎంత ఆరోగ్యమో వివరించారు. జ్ఞాని జైల్‌సింగ్ నగర్ అంగన్‌వాడీ టీచర్ శివమ్మ, స్వామి వివేకానంద నగర్ టీచర్ సరస్వతి, గౌతంనగర్ టీచర్ పుష్పలత, అంబేడ్కర్ టీచర్ శేషమ్మ, దుర్గాభవానీనగర్ టీచర్ సుజాత, వినాయకనగర్ టీచర్ హేమలత, ఎమ్మార్సీ కాలనీ టీచర్ రజిని, బండారు బాల్‌రెడ్డినగర్ టీచర్ వసంత, భగత్‌సింగ్ కాలనీ టీచర్ సుమలత, దీన్‌దయాల్‌నగర్ టీచర్ భవానీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అంగన్‌వాడీ టీచర్ల పరిధిలో తల్లులు, బాలింతలకు, తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, షేక్‌పేట మండల సూపర్‌వైజర్ ఫాతిమా బేగం పాల్గొన్నారు.

ఓటింగ్‌పై ముమ్మర అవగాహన

వెంకటేశ్వరకాలనీ: వీవీ ప్యాట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై జన సంచారం ఉండే ప్రాంతాలు, చౌరస్తాలు, బస్తీలు, కాలనీలూ ఇలా అవకాశం ఉన్న ప్రతిచోటా అవగాహన కల్పిస్తామని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసి ప్రశాంతి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం 3లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లపై ఏర్పాటు చేసిన సంచార అవగాహన వాహనాన్ని ఆమె పరిశీలించారు. రోజుకు ఎంత మందికి అవగాహన కల్పిస్తున్నారు, తదితర వివరాలను అక్కడే ఉన్న ఏఈ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంచార ఓటింగ్ అవగాహన వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎంసీ ప్రశాంతి

పోచమ్మ ఆలయంలో విజయారెడ్డి పూజలు



చింతల్‌బస్తీ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వంపై అనర్హత వేటు నిర్ణయంపై సుప్రీం కోర్టు స్టే విధించిన నేపథ్యంలో శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి చింతల్‌బస్తీలోని శ్రీ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటుకు రాకుండా ఆయన గొంతు నొక్కాలని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పన్నిన కుట్ర సుప్రీంకోర్టు తీర్పుతో భగ్నమైందన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపట్ల కాంగ్రెస్ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు సాయి, రాజు, వినోద్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా మోహన్‌గాంధీ



లిబర్టీ: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా మోహన్‌గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ శుక్రవారం ఆయనకు అందజేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

తాగుడుకు బానిసై ఒకరు.. అనారోగ్యంతో మరొకరు...

ఖైరతాబాద్: దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకోగా మరో సంఘటనలో తాగిన మత్తులో మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకునాయి. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్‌లో ఓ ఇంట్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అనంత(40), భర్త చంద్రయ్యతో కలిసి ఉంటోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అనంత శుక్రవారం తెల్లవారుజామున బాత్‌రూంలో చీర కొంగుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తమ్ముడు రాంచందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● శివరాజ్(40) అనే వ్యక్తి తన భార్య మాధవితో కలిసి చింతలబస్తీలో నివాసముంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంత కాలంగా శివరాజ్ తాగుడుకు బానిసయ్యాడు. భార్య మాధవి హౌస్‌కీపింగ్ పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించలేకపోతున్నా తాగుడు మానాలని భర్తతో గురువారం వాదించింది. శుక్రవారం ఆమె డ్యూటీకి వెళ్లింది. తిరిగి మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చి తలుపు తట్టగా తీయకపోవడంతో తలుపు పగులగొట్టి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఉండటంతో వెంటనే స్థానికుల సాయంతో మహావీర్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడగా వీరందరినీ శుక్రవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ముగ్గురు వాహనదారులకు జరిమానాలతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మిగతా 18 మందికి ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో వీరందరి నుంచి రూ. 39,300 వసూలైనట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా...

కౌంటరు వేయకపోతే జరిమానా తప్పదు

ఉమ్మడి ఆస్తుల విభజనకేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కౌంటరు దాఖలు చేయకుంటే జరిమానా తప్పదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన జాప్యంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీ.భట్టిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఉమ్మడి ఆస్తుల విభజనకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను మధ్యవర్తిగా నియమించాలని ఏపీ తరపు ఏఓఆర్ మెహఫూజ్ నజ్కీ కోరారు. దీనికి తెలంగాణ తరపు న్యాయవాది వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేంద్రం కౌంటరు దాఖలు చేయని విషయం ధర్మాసనం దృష్టికి రాగా, గతంలో 4 వారాల గడువు ఇచ్చినా ఇప్పటికీ దాఖలు చేయలేదా అని ప్రశ్నించింది. 3 వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని లేకుంటే జరిమానా విధిస్తామని కేంద్రం తరపు న్యాయవాదికి తెలిపింది. కేంద్రం కౌంటరుపై రిజాయిండరు దాఖలుకు మరో మూడు వారాలు గడువిస్తూ... తదుపరి విచారణ అక్టోబరుకు వాయిదా వేసింది.

వైద్యారోగ్యశాఖలో 'రెవెన్యూ' పెత్తనం సహించం

తెలంగాణ ప్రభుత్వవైద్యుల సంఘం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో రెవెన్యూ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం స్పష్టం చేసింది. ఆర్డీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగా వైద్యవిధాన పరిషత్‌లో పనిచేసే వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలని కోరింది. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులకు 2016 పీఆర్సీ వేతన బకాయిలు, రూరల్ మెడికల్ కళాశాలల్లోని బోధన వైద్యులకు రూరల్ అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని కోరింది. హెల్త్ డైరెక్టర్ పరిధిలో నిర్ణీతకాల వ్యవధి ప్రమోషన్లను వెంటనే కల్పించాలని, సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులను, డీసీహెచ్ఎస్‌లను 33 జిల్లాలకు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల ప్రతినిధుల బృందం త్వరలో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపింది.

వివేకా లేఖను పట్టించుకోరా?

అన్ని గొడ్డలి వేట్లు పడ్డాక ఆయన లేఖ రాశారా?

మెదడు బయటికి వచ్చాక కూడా రాయడం సాధ్యమేనా?

- ఈ విషయంపై వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి కదా!
- ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు విస్మరించారు?
- ఘటనా స్థలంలో వేలి ముద్రల సంగతి ఏమైంది?
- అక్కడున్న వారందరివీ కాకుండా కొత్త వేలి ముద్రలు ఎవరివి?
- నిందితులు ఆస్తి పత్రాల కోసం వెదికారన్నది వాస్తవం..
- అలాంటప్పుడు ఈ అంశంపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- అవగాహన లేకుండా గూగుల్ టేక్ అవుట్ అంటూ హడావుడి దేనికి?
- ఐపీడీఆర్ డేటా ద్వారా కాల్స్, మెసేజ్‌ల వివరాలన్నీ తెలియవు
- వివేకా హత్య కేసు దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న వివేకా లేఖపై సీబీఐ నిశితంగా దృష్టి సారించక పోవడం విస్మయ పరుస్తోందని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. 'డ్రైవర్ ప్రసాద్ తనపై తీవ్రంగా దాడిచేసినట్టు వివేకా పేర్కొన్నట్టు ఆ లేఖలో ఉంది. లేఖను వంట మనిషి లక్ష్మమ్మ కుమారుడు ప్రకాశ్ చూసి పీఏ కృష్ణా రెడ్డికి ఇచ్చాడు. ఆయన వెంటనే అంటే ఉదయం 6.29కి వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌చేసి ఆ లేఖలోని సమాచారాన్ని చదివి వినిపించారు. తాము వచ్చే వరకు లేఖను గోప్యంగా ఉంచమని, ఎవ్వరికీ ఇవ్వొద్దని చెప్పారు. కాసేపటి తర్వాత అక్కడకు వచ్చిన సీఐ శంకరయ్యకు కూడా కృష్ణారెడ్డి ఆ లేఖ విషయం చెప్పలేదు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరెడ్డి తదితరులు పులివెందులకు చేరుకున్నాక ఆ రోజు సాయంత్రం ఆ లేఖను వైఎస్సార్ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మకు అప్పగించారు' అనే విషయాన్ని చార్జ్‌షీట్‌లో ప్రస్తావించడం మినహా ఇంత కీలకమైన విషయంపై సీబీఐ ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ప్రశ్నించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ సరితా రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన రెండవ కథనంలో ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

తీవ్ర గాయాలతో లేఖ రాయగలిగారా?

వివేకా లేఖపై ఇప్పటికీ సందిగ్ధత తొలగిపోలేదు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం ఇప్పించే వరకు ఆ లేఖ ఎప్పుడు రాశారన్న దానిపై స్పష్టత రాలేదు. వివేకాపై దాడి తర్వాత ఆయనతో బలవంతంగా ఆ లేఖను తాము ఎలా రాయించిందీ దస్తగిరి వెల్లడించాకే సందేహాలు మరింత పెరిగాయి. దస్తగిరి తన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం.. మొదట సునీల్‌యాదవ్ వివేకానందరెడ్డి ముఖంపై గట్టిగా కొట్టాడు. దాంతో వివేకా కింద పడిపోయారు. ఉమాశంకర్ రెడ్డి గొడ్డలితో వివేకా నుదుట మీద నరికాడు. వివేకా నుదుటి మీద 3.5 ఇంచ్‌ల వెడల్పు, 6 ఇంచ్‌ల లోతుగా పక్క పక్కనే రెండు గాయాలున్నాయని పోస్టుమార్టం నివేదికలో ఉంది. సునీల్‌యాదవ్ వివేకా గుండెపై 15–16 సార్లు గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఉమాశంకర్ రెడ్డి తన చేతిలో ఉన్న గొడ్డలిని దస్తగిరికి ఇచ్చి వివేకా లేవకుండా చూడమని చెప్పారు. తాము భూమి పత్రాలు ఎక్కడున్నాయో వెతుకుతామని చెప్పాడు. వివేకా అతి కష్టం మీద లేవడానికి ప్రయత్నిస్తూ నా ఇంట్లో ఏం వెతుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో దస్తగిరి గొడ్డలితో వివేకా కుడి చేతిపై దాడి చేశాడు. దీంతో వివేకా కుడి అరచేతిలో 2 ఇంచ్‌ల వెడల్పు, ఒక ఇంచి లోతున గాయం ఉందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. కుడి చేతి మీద గొడ్డలితో గాయపరిచిన తర్వాత వివేకాతో నిందితులు లేఖ రాయించారు. కుడి చేతివాటం వ్యక్తి అయిన వివేకా ఆ లేఖ రాశారని సీబీఐ పేర్కొంది. గాయం వల్ల వివేకా మెదడు బయటకు వచ్చిందని దస్తగిరి చెప్పడం గమనార్హం. అంత తీవ్ర గాయమయ్యాక లేఖ రాసే స్థితిలో వివేకా ఉన్నారా అన్నది ప్రశ్నార్థకం. ఆ లేఖ వివేకానే రాసినట్టు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ నిర్ధారించింది. కాగా తీవ్రమైన ఒత్తిడి, అత్యంత సంక్లిష్ట ప్రక్రియ నడుమ ఆ లేఖ రాసినట్టుగా ఉందని ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ నివేదిక వెల్లడించింది. కానీ అంతటి తీవ్ర గాయాలతో, మెదడు బయటకు వచ్చిన తర్వాత కూడా ఓ వ్యక్తి అలా లేఖ రాయడం సాధ్యమా? అని సీబీఐ వైద్య నిపుణులను సంప్రదించకపోవడం విడ్డూరం.

ఆ వేలిముద్రలు ఎవరివో?

హత్య కేసు దర్యాప్తులో వేలిముద్రలే కీలకం. అయితే వివేకా హత్యకు గురైన స్థలంలో గుర్తించిన 3 గుర్తు తెలియని వేలిముద్రలు ఎవరివనే దానిపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టిసారించలేదు. వివేకా నివాసంలోని బాత్‌రూమ్ గోడల టైల్స్ మీద రెండు, తలుపు వెనుక ఒక వేలిముద్రను క్లూస్ టీమ్ గుర్తించింది. గోడల టైల్స్ మీద ఉన్న వేలిముద్రలు రక్తంతో ఉండటం గమనార్హం. కాగా ఆ మూడు వేలి ముద్రలు నిందితులు నలుగురితోపాటు వివేకా నివాసానికి వచ్చిన బంధువులు, ఇతరుల వేలి ముద్రలతో సరిపోలలేదు. అంటే గుర్తు తెలియని వ్యక్తులు ఆ రోజు రాత్రి వివేకా నివాసంలో ఉన్నట్టుగా భావించాల్సి వస్తోంది. కానీ సీబీఐ ఇప్పటి వరకు ఆ వేలిముద్రలు ఎవరివనే దిశగా దర్యాప్తు చేయలేదు.

ఐపీడీఆర్ డేటా అహేతుకం

ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు 'ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డ్స్(ఐపీడీఆర్) నివేదిక ఆధారంగా గుర్తించినట్టు సీబీఐ పేర్కొంది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 1.37 నుంచి 5.02 గంటల వరకు వారిద్దరి మొబైల్ ఫోన్ల డేటా ఆన్‌లో ఉన్నట్టుగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ ఐపీడీఆర్ డేటా అన్నది శాస్త్రీయంగా కచ్చితమైన ఆధారం కాదు. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు ఆన్‌లో ఉన్నాయని మాత్రమే ఐపీడీఆర్ చెబుతుంది. సాధారణంగా అర్ధరాత్రి దాటాక మొబైల్ నెట్‌వర్క్‌లు తమ డేటా బ్యాకప్ తీసుకుంటూ ఉంటాయి. దాంతో మొబైల్ డేటా ఆన్‌లో ఉన్నట్టు చూపిస్తుంది. అంత మాత్రాన ఆ మొబైల్ ఫోన్ల ద్వారా మాట్లాడుతున్నట్టుగానీ, మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానీ నిర్ధారించినట్టు కాదు. ఇక ఆ ఫోన్ల నుంచి ఇతర ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయా.. లేదా అన్నది కూడా ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. కాబట్టి ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య ఆ రోజు రాత్రి వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించలేం. ఈ విషయంలో సీబీఐ వాదన పూర్తిగా అహేతుకమని స్పష్టమవుతోంది. గంగిరెడ్డి మొబైల్ ఫోన్ నుంచి వెళ్లిన మెసేజ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదని సీఐబీ తెలిపింది. కాగా 2019 మార్చి 15నే ఎర్ర గంగిరెడ్డి మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేటాను పరిశీలించినా.. అందులో అనుమానాస్పదమైన సమాచారం లభించలేదని పోలీసులు ప్రకటించిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆస్తి వివాదాన్ని ఎందుకు పట్టించుకోలేదు?

రాజకీయ కారణాలతోనే వివేకాను హత్య చేశారని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలను పరిశీలిస్తే ఆస్తి కోసం ఈ హత్య చేసి ఉండొచ్చన్నది స్పష్టమవుతోంది. ఎందుకంటే వివేకాను హత్య చేసిన తర్వాత నిందితులు ఆస్తి పత్రాల కోసం ఆయన నివాసంలో వెతికారన్నది స్పష్టమవుతోంది. నివాసంలో అల్మారా (బీరువా) తలుపు బద్దలు గొట్టడానికి ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు కూడా. అంటే హత్యకు ఆస్తి వివాదం ప్రధాన కారణం కావచ్చు. నిందితులు ఏ పత్రాల కోసం వెతికారన్నది సీబీఐ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దొంగతనం, ఆస్తి వివాదం అనే కోణంలో సీబీఐ ఈ కేసును ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఒకే సమయంలో రెండుచోట్ల ఉండటం సాధ్యమా?

సునీల్ యాదవ్ ఎక్కడ ఉన్నారనే దానిపై సీబీఐ వాదనలు మరింత అసంబద్ధంగా ఉన్నాయి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం, రంగన్న వాంగ్మూలం ప్రకారం ఆ రోజు రాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి నివాసం లోపల ఉన్నాడు. కానీ ఆ రోజు రాత్రి 1.58 గంటలకు సునీల్ యాదవ్.. వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టుగా గూగుల్ టేక్ అవుట్ డేటా చూపిస్తోందని కూడా సీబీఐ పేర్కొంది. ఒకే సమయంలో ఒక వ్యక్తి వేర్వేరు చోట్ల ఎలా ఉండగలరు? సునీల్ యాదవ్ ఆ సమయంలో వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసంలో ఉంటే.. అదే సమయంలో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకా నివాసంలో కూడా ఉండి ఆయన్ను ఎలా హత్య చేయగలడు? మరి సీబీఐ ఇంత చిన్న అంశాన్ని విస్మరిస్తూ కేసు దర్యాప్తు చేస్తుండటం ఏమిటి?.

రూ.40 కోట్ల డీల్ కథ తేల్చలేదెందుకు?

అసలు వివేకానందరెడ్డిని నిందితులు ఎందుకు హత్య చేశారనే అంశంపై సీబీఐ వాదన అసంబద్ధంగా ఉంది. దస్తగిరి వాంగ్మూలం ప్రకారం.. వివేకాను హత్య చేస్తే శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు సునీల్ యాదవ్ ద్వారా దస్తగిరికి అడ్వాన్స్‌గా రూ.కోటి పంపించారు. అందులో రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులతో పులివెందులలో విల్లా కొనుగోలు చేయాలని భావించినట్టు దస్తగిరి చెప్పాడు. కాగా ఇక్కడ ప్రశ్నార్థకం ఏమిటంటే.. వివేకా హత్య కోసం కుదిరినట్టు చెబుతున్న డీల్ డబ్బును సీబీఐ ఇప్పటికీ రికవరీ చేయలేకపోయింది. కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూడా సీబీఐని ఇదే విషయంపై ప్రశ్నించారు. నిందితుల మధ్య చేతులు మారినట్టు చెబుతున్న డబ్బును ఎందుకు రికవరీ చేయలేకపోయారంటే సీబీఐ సరైన సమాధానం చెప్పలేకపోయింది. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న మున్నా బ్యాంక్ లాకర్ నుంచి రికవరీ చేసిన రూ.46.70 లక్షలకు సంబంధించి సీబీఐ చెబుతున్న వాదన నమ్మదగ్గదిగా లేదని కూడా న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. 2020 సెప్టెంబర్ 9న మున్నా బ్యాంకు లాకర్లో ఉన్న రూ.46.70 లక్షలను సీబీఐ జప్తు చేసింది. ఈ జప్తు వ్యవహారం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 27 ప్రకారం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం.

గూగుల్ టేక్ అవుట్‌పై మాట మారింది!

నిందితులు 2019 మార్చి 14, 15 తేదీల్లో ఎక్కడ ఉన్నారనే విషయాన్ని గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిర్ధారించామన్న సీబీఐ వాదన తప్పని తేలిపోయింది. ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి ఫోన్లు వారి ఇళ్లలోనే ఉన్నట్టుగా సెల్ టవర్ల లోకేషన్ స్పష్టం చేస్తోంది. కాగా సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాపై సీబీఐ ఎక్కువగా దృష్టి సారించింది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 2.42కి సునీల్ యాదవ్ వివేకా నివాసంలో ఉన్నట్టు.. 2.34కి వివేకా నివాసానికి 15 మీటర్ల దూరంలో, 2.35కి వివేకా నివాసానికి 10 మీటర్ల దూరంలో ఉన్నట్టు.. 2.42కి వివేకా నివాసంలో ఉన్నట్టు పేర్కొంది. కాగా సునీల్ యాదవ్ నివాసం వివేకా నివాసానికి 160 మీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో గూగుల్ టేక్ అవుట్ డేటాకు, వాస్తవ లోకేషన్‌కు 500 మీటర్ల నుంచి 1,500 మీటర్ల వరకు వ్యత్యాసం ఉంటుందని నిపుణులే చెబుతున్నారు. అందుకే ఈ కేసు విచారణ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఆ విషయాన్ని ప్రశ్నించారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను బట్టి ఎలా నిర్ధారించగలుగుతారని అడిగారు. దాంతో సీబీఐ తన మూడో అనుబంధ చార్జ్‌షీట్‌లో మాట మార్చింది. యూనివర్సల్ కాలమానానికి (యూటీసీ), భారత కాలమానానికి (ఐటీసీ) మధ్య వ్యత్యాసాన్ని తాము గమనించక పొరపాటు చేశామని వెల్లడించడం గమనార్హం. గూగుల్ టేక్ అవుట్ డేటాను విశ్లేషిస్తూ ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ పేర్కొన్న సమయం యూటీసీ కాలమానం ప్రకారం అని వెల్లడించింది. వాస్తవానికి యూటీసీ కాలమానం కంటే భారత కాలమానం 5.30 గంటలు ముందుంటుంది. అంటే సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత 2.42 గంటలకు ఉన్నట్టు తాము మొదటి చార్జ్‌షీట్‌లో పేర్కొంది వాస్తవం కాదని సీబీఐ అంగీకరించింది. సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 15న ఉదయం 8.12కి ఉన్నారని తెలిపింది. అంటే వివేకా హత్యకు గురయ్యారని అందరికీ తెలిసిన తర్వాత కొన్ని వందల మంది అక్కడ గుమిగూడిన తర్వాత సునీల్ యాదవ్ చేరుకున్నారని చెప్పింది.

స్వయం కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న వీసీ కట్టా నరసింహారెడ్డి


బాలానగర్: స్వయంకృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చునని జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి కట్టా నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'మీట్ ద ఎచీవర్స్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి వంశీ ఐఏఎస్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి దశనుంచి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్న వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వంశీ, డాక్టర్ డి. శ్రీభూషణ్‌రాజు మాట్లాడుతూ ప్రతి మనిషికి చదువే సంపద అన్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జ్యోతుల సురేష్‌కుమార్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

ఒక్క ఫ్లాట్ రూ.22.50 కోట్లు!

- 4 టవర్లు; ఒక్కోటి 50 అంతస్తులు
- కోకాపేటలో ఏపీఆర్ అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్
- డైరెక్టర్ ఆవుల సంజీవ్ రెడ్డి వెల్లడి





అతి తక్కువ ధర ఈ ప్లాటే..

నియోపొలిస్ కోకాపేట ఫేజ్–2లో అతి తక్కువ ధర పలికింది కూడా ఈ 11 నంబరు ప్లాటే కావటం గమనార్హం. ఎకరం రూ.67.25 కోట్లతో ఏపీఆర్ గ్రూప్ ఈ ప్లాట్‌ను సొంతం చేసుకుంది. అయితే గతంలో కోకాపేట ఫేజ్–1 వేలంలో గరిష్ట ధర రూ.60 కోట్లు. గోల్డ్‌మైన్ లేఅవుట్‌లో రాజపుష్ప ప్రాపర్టీస్ ఎకరం రూ.60.2 కోట్ల చొప్పున మొత్తం రూ.99.33 కోట్లతో 1.65 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది.

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా కోకాపేట సరికొత్త రికార్డులను సృష్టించింది. గురువారం హెచ్ఎండీఏ నిర్వహించిన నియోపొలిస్ కోకాపేట ఫేజ్–2 వేలంలో అత్యధిక బిడ్ వేసి ప్లాట్ నంబరు–11ను ఏపీఆర్ గ్రూప్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఎకరం రూ.67.25 కోట్ల చొప్పున రూ.506.39 కోట్లతో మొత్తం 7.53 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ ప్రాంతంలో హైదరాబాద్‌కు, ఏపీఆర్ గ్రూప్ తలమానికంగా నిలిచే అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్‌కు ప్రణాళికలు చేస్తున్నామని డైరెక్టర్ ఆవుల సంజీవ్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇంకా ఏమన్నారంటే.. నాలుగు టవర్లు, ఒక్కోటి 50 అంతస్తులలో ఉంటుంది. ఫ్లోర్‌కు ఒక ఫ్లాట్ చొప్పున ఒక్క ఫ్లాట్ 15 వేల చ.అ. విస్తీర్ణంలో ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 200 అల్ట్రా లగ్జరీ ఫ్లాట్లు ఉంటాయి. ధర చ.అ.కు రూ.15 వేలు చొప్పున ఒక్క ఫ్లాట్ ప్రారంభ ధర రూ.22.50 కోట్లుగా ఉంటుంది. ప్రాజెక్ట్ డిజైన్, ఎలివేషన్స్ నుంచి మొదలుపెడితే క్లబ్ హౌస్, వసతులు, మెటీరియల్స్ ప్రతీది హైఎండ్‌గా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం ఉంటుంది. ఇప్పటికే సింగపూర్ ఆర్కిటెక్చర్‌తో సంప్రదింపులు జరుపుతున్నాం. ప్లాట్ నంబరు–11 ఉన్న ప్రాంతం ఇతర మిగిలిన ప్లాట్ల కంటే ఎత్తులో ఉండటం, గండిపేట వ్యూ స్పష్టంగా కనిపిస్తుండటం దీని ప్రత్యేకతలు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక



సాక్షి, హైదరాబాద్: నిర్మాణ రంగంలో నైపుణ్య కార్మికుల కొరత ఉందని దీంతో ఉత్పాదకత చాలా తక్కువగా ఉందని భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు 3–4 జిల్లాలలో స్కిల్లింగ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం క్రెడాయ్ తెలంగాణ నూతన కార్యవర్గం, యూత్ వింగ్ కమిటీలను ఎన్నుకున్నారు. ఆయా ప్రతినిధులు 2025 వరకూ ఈ పదవిలో కొనసాగుతారు. **నూతన కార్యవర్గం ఇదే: చైర్మన్:** డీ మురళీకృష్ణారెడ్డి, **ప్రెసిడెంట్:** ఈ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, **ఎలెక్ట్ ప్రెసిడెంట్:** కే ఇంద్రసేనారెడ్డి, **సెక్రటరీ:** జీ అజయ్ కుమార్, **వైస్ ప్రెసిడెంట్లు:** బీ పాండు రంగారెడ్డి, పురుషోత్తంరెడ్డి , గుర్రం నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, **ట్రెజరర్:** జగన్ మోహన్ చిన్నాల, **జాయింట్ సెక్రటరీలు:** వై వెంకటేశ్వర్‌రావు, బండారి ప్రసాద్, చేతి రామారావు, ఎం ఆనంద్ రెడ్డి. **యూత్ వింగ్ కో-ఆర్డినేటర్:** సీ సంకీర్త్ ఆదిత్యా రెడ్డి, **సెక్రటరీ:** రోహిత్ అశ్రిత్.

నగర వార్తలు

టీఎస్ఐపాస్ ద్వారా 24000 కంపెనీల ప్రతిపాదనలకు ఆమోదం



ప్లాస్టిక్ ఎక్స్‌పో ప్రారంభించిన వెంకట్ నర్సింహారెడ్డి తదితరులు



పెట్‌బాటిల్ వేస్ట్‌తో తయారు చేసిన టీషర్ట్స్

మాదాపూర్: టీఎస్ ఐపాస్ ద్వారా గత 8.5 ఏళ్లలో 24000 పరిశ్రమ ప్రతిపాదనలను ఆమోదించినట్లు టీఎస్ఐఐసీ ఎండీ వెంకట్ నర్సింహారెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ప్లాస్టిక్ ఎక్స్‌పో, హిప్‌లెక్స్ 2023 ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి ప్లాస్టిక్ పార్క్ పూర్తిగా అమ్ముడు పోయిందని, రెండోదాని ఏర్పాటుకు టీఎస్ఐఐసీ స్థలాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎంఎస్ఎంఈ లకు వసతి కల్పించేందుకు వీలుగా టీఏపీఎంసీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్లాస్టిక్ పరిశ్రమకు హబ్‌గా ఉందన్నారు. ఎక్స్‌పోలో పాల్గొనేందుకు ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ 60 ఎంఎస్ఎంఈలకు ఆర్థికసాయాన్ని అందించిందన్నారు. హెచ్‌కెగెయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్ పెట్రోకెమికల్స్) శ్రీ వాస్తవ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ప్లాస్టిక్ పరిశ్రమకు తాప్మా మార్గనిర్దేశం చేస్తుందన్నారు. నేడు యూఎస్ఏ, చైనా తర్వాత భారతదేశం మూడో అతిపెద్ద ప్లాస్టిక్ వినియోగదారుగా ఉందన్నారు. 6 శాతం నుండి 7శాతం సీఏజీఆర్ వద్ద నిరంతరం వృద్ధి చెందుతుందన్నారు. గెయిల్ అమ్మకాల్లో దక్షిణ ప్రాంతం 18శాతం వాటాను అందిస్తుందన్నారు. చైనా జనాభా పెరిగినప్పటికీ మన తలసరి ప్లాస్టిక్ వినియోగం చైనాకంటే చాలా తక్కువ అన్నారు. 11 కేజీల వద్ద చైనా తలసరి వినియోగం, 46కేజీ, యూఎస్ఏ 170 కేజీ, ప్రపంచ సగటు 28 కేజీలు వాటి కంటే మనం వెనుకబడి ఉన్నామన్నారు. ప్లాస్టిక్‌పై విధించిన 18శాతం జీఎస్టీని తగ్గించాలని ఆప్మా, తాప్స్ తరపున ఆయన కోరారు. ఆహార ప్యాకేజింగ్ పరిశ్రమతో పాటు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో ఉపయోగించే ప్లాస్టిక్‌లపై విధించిన జీఎస్టీని తగ్గించాలన్నారు. తెలంగాణ, ఆంధ్రా ప్లాస్టిక్స్ తయారీదారుల సంఘం(టాప్మా)నాలుగురోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో రూ.500 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తాప్మా అధ్యక్షుడు విమలేష్‌గుప్త తెలిపారు. దశాబ్దం క్రితం 9 మిలియన్ టన్నుల నుంచి ఇప్పుడు 18 మిలియన్ టన్నుల వినియోగం స్థాయికి చేరుకున్నామని ఇండియన్ ప్లాస్టిక్స్ ఇనిస్టిట్యూట్ జాతీయ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి వెన్నం తెలిపారు. పర్యావరణ సంక్షోభానికి కేవలం ప్లాస్టిక్ పరిశ్రమనే నిందించలేమని సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ అవసరమన్నారు. భారతదేశంలో 3.5 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తిలో కేవలం 30శాతం మాత్రమే రీసైకిల్ చేయబడుతుందన్నారు. కీలకమైన వృద్ధి రంగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వానికి ప్రాతినిధ్యాలను అందించాలని కోరారు. ఈ ప్రదర్శనలో ప్రపంచ వ్యాప్తంగా 400 ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. స్పెషాలిటీ కెమికల్స్, మాస్టర్ బ్యాచ్‌లు, ప్రాసెస్ మిషనరీ, ప్రింటింగ్, ప్యాకేజింగ్, రామెటీరియల్స్, మోల్డ్స్, డై, పోస్ట్ ప్రాసెసింగ్ ఎక్విప్‌మెంట్, క్వాలిటి టెస్టింగ్ ఎక్విప్‌మెంట్, ఫినిష్ట్ ప్రొడక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో హెచ్ఎంఈఎల్ ఎండి ప్రభుదాస్,ఆలిండియా ఇండియా ప్లాస్టిక్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ పాల్గొన్నారు.

'గోవులను తీసుకెళ్లిన వారిని అరెస్ట్ చేయాలి'

పంజగుట్ట: ధ్యాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో రక్షించి తీసుకువచ్చిన గోవులను హైకోర్టు ఆర్డర్ ఉందంటూ కొందరు వ్యక్తులు బలవంతంగా తీసుకెళ్లారని పోలీసులు వారిని వెంటనే అరెస్టు చేయాలని గోరక్షా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధ్యాన్ ఫౌండేషన్ సీనియర్ వలంటీర్ పూనమ్ కపూర్, యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ... 72 రోజులక్రితం శంషాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న 23 గోవులను శంషాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకుని ధ్యాన్ ఫౌండేషన్‌కు తరలించారన్నారు. అయితే ఈ నెల 1న కొందరు వ్యక్తులు నాలుగు వాహనాలతో వచ్చి ఓ కాగితాన్ని హైకోర్టు ఆర్డర్‌గా చూపిస్తూ 30 గోవులను తీసుకెళ్లారని ఆరోపించారు. దీనిని అడ్డుకునేందుకు యత్నించిన ఫౌండేషన్ ప్రతినిధులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్నాడు కూడా ఫౌండేషన్ గోశాల వద్దకు వచ్చి రాళ్లు రువ్వడమేగాక తమపై ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని. అట్రాసిటీ కేసులు పెడతామని హెచ్చరించారన్నారు. ఈ ఘటనలో ఓ మహిళా వలంటీర్ తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని రాష్ట్ర హోంమంత్రి, పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తామని నిందితులపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అధ్యాపకుల నియామకానికి చర్యలు



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఓయూ టీచర్స్ అసోషియేషన్ (ఔటా) ఉపాధ్యక్షులు ప్రొ.మల్లేశం అధ్యక్షత వహించగా వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సమకాలిన ఉన్నత విద్య సవాళ్లు-పరిష్కారాలు అనే అంశం పై మాట్లాడారు. నియామకాల అంశం రాష్ట్రపతి పరిశీలనలో ఉందని, తిరిగి అసెంబ్లీలో ప్రవేశపెట్టి పక్రియను ప్రారంభిస్తామన్నారు. రిటైర్మెంట్ వయోపరిమితి పెంపుపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. సీపీఎస్, పీఆర్సీ బకాయిలు, హెల్త్ కార్డులపై ప్రభుత్వ అధికారులతో చర్చించి అమలు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యా సంస్థల్లో ఎన్నికలు ఉండాలని తన అభిప్రాయంగా వినోద్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో సాధించిన అభివృద్ధిని అధ్యాపకులకు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అప్పారావు, విద్యాసాగర్, చెన్నప్ప, మహేందర్‌రెడ్డి, మంగు, చలమల్ల వెంకటేశ్వర్లు, మద్దిలేటి, కాశీం, సూర్య ధనుంజయ్, లావణ్య, జమీల్, అలియాబేగం తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకుల సంఘం ఏర్పాటు

వర్సిటీల అధ్యాపకుల సమస్యలపై ఉమ్మడిగా పోరాడేందుకు 15 వర్సిటీల అధ్యాపకులతో నూతన సంఘాన్ని స్థాపించారు. తెలంగాణ రాష్ట్ర ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్-ఏయూటీఏ) పేరుతో ఏర్పాటు చేసినట్లు ప్రొ.మల్లేషం పేర్కొన్నారు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు.

కంటోన్మెంట్ వేరీడ్ బోర్డు పదవీకాలం పొడిగింపు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ వేరీడ్ బోర్డు పదవీకాలాన్ని కేంద్రం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ నెల 10వన ప్రస్తుత వేరీడ్ బోర్డు పదవీకాలం ముగియనుండగా, 11వ తేదీ నుంచి మరో ఆరునెలల పాటు మనుగడలో ఉండేలా కేంద్ర రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్ సహా దేశ వ్యాప్తంగా 56 కంటోన్మెంట్‌లలో కొనసాగుతున్న వేరీడ్ బోర్డుల పదవీకాలాన్ని పొడిగించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సాధారణ పాలకమండలి గడువు 2021 ఫిబ్రవరి 10న ముగియగా, కేంద్రం ఎన్నికలు నిర్వహించకుండా బోర్డును వేరీడ్ చేసింది. బోర్డు అధ్యక్షుడిగా స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్, సభ్య కార్యదర్శిగా సీఈఓతో పాటు మరో నామినేటెడ్ సభ్యుడితో కూడిన ముగ్గురు సభ్యుల బోర్డును ఏర్పాటు చేసింది. అయితే ఆ ఏడాది నవంబర్ నెలాఖరు వరకు నామినేటెడ్ సభ్యుడిని నియమించలేదు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడిగా బీజేపీకి చెందిన జే. రామకృష్ణ కొనసాగుతున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి కేంద్రం వేరీడ్ బోర్డు పదవీకాలాన్ని పొడగిస్తుండటంతో రామకృష్ణ కూడా 20 నెలలుగా నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తాజా ఉత్తర్వులతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు.

మతోన్మాదానికి అడ్డుకట్ట వేయాలి

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో పెచ్చరిల్లుతున్న మతోన్మాదానికి అడ్డుకట్ట వేయాలని యునైటెడ్ ముస్లిమ్ ఫోరమ్ అధ్యక్షులు ముఫ్తీ సాదిక్ మొహియుద్దీన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న ఘటనలకు భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకుల వ్యాఖ్యలే కారణమన్నారు. ముంబై ట్రైన్ లో బీఎస్ఎఫ్ జవాన్ ముస్లిం యువకులను కాల్చివేయడం, హర్యానా మతఘర్షణలపై ఫోరమ్ తీవ్ర ఆందోళ వ్యక్తం చేసింది. దళిత, మైనారిటీ, బహుజనులు మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మణిపూర్, హర్యానా, ముంబై రైలు ఘటనలో మృతులకు ఆయన సంతాపం తెలిపారు.

రాళ్లు, రాడ్లు, కర్రలతో పక్కా ప్రణాళిక

టీడీపీ రాక్షస క్రీడ

రక్తపాతం లక్ష్యంగా చంద్రబాబు స్కెచ్.. రెచ్చగొట్టి, గొడవలతో లబ్ధి పొందాలనే వ్యూహం

- ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో భారీ కుట్ర
- అప్పటికప్పుడు రూట్ మ్యాప్ మార్చి పుంగనూరులోకి వచ్చేందుకు విఫలయత్నం
- టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టిన టీడీపీ అధినేత
- బీరు సీసాలు, కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడి..
- తరమండిరా అంటూ బాబు తీవ్ర వ్యాఖ్యలు
- రెండు పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించిన టీడీపీ మూకలు
- 27 మంది పోలీసు అధికారులు, పోలీసులకు గాయాలు
- అంగళ్ల వద్ద దాడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తీవ్ర రక్త గాయాలు



పుంగనూరు బైపాస్ వద్ద పోలీసుల వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు.. (ఇన్‌సెట్‌లో)నిప్పంటిస్తున్న కార్యకర్త.. దాడిలో గాయపడిన పోలీస్

సాక్షి, తిరుపతి/చిత్తూరు/ పుంగనూరు/బి కొత్తకోట: రాయలసీమలో రక్తపాతమే లక్ష్యంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పక్కా స్కెచ్‌తో అగ్గి రాజేశారు. టీడీపీ గూండాలను రెచ్చగొట్టి.. పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడులు చేయించారు. అంతటితో ఆగక పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించి విధ్వంసం సృష్టించారు. శాంతి భద్రతలకు తీవ్రంగా విఘాతం కలిగించారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర రక్త గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రాజెక్టుల సందర్శన పేరుతో శుక్రవారం ఆయన అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పర్యటించారు. ములకలచెరువు మండలం నాయనపల్లి చెరువు వద్ద ఉన్న హంద్రీ–నీవా, గాలేరు నగరి అనుసంధానం కాలువ పనులను పరిశీలించారు. ఆ తర్వాత బి కొత్తకోట మండలం చీతివారిపల్లి సమీపంలో ఉన్న హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ పనులను పరిశీలించాల్సి ఉండింది. అయితే పుంగనూరులో విధ్వంసం సృష్టించాలనే లక్ష్యంతో రూట్ మ్యాప్ మార్చుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండల పరిధిలోని ముదివేడు రిజర్వాయర్ పరిశీలనకు వెళ్తున్నారని తెలుసుకున్న స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాబు తీరుపై మార్గం మధ్యలోని అంగళ్లు సర్కిల్‌కు వద్ద నిరసన తెలిపి వెనుదిరిగారు. అంతలో అక్కడికి చేరుకున్న చంద్రబాబు బృందం వందలాది మందితో వచ్చి రాగానే కేకలు వేస్తూ... తొడలు చరుస్తూ కర్రలు, బీరు బాటిళ్లు, రాళ్లు విసురుతూ దాడులకు తెగబడ్డారు. దూరంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు ఎంతగా వారించినా వినలేదు. స్థానికులు భయాందోళనతో ఇళ్లలోకి పరుగులు తీశారు. టీడీపీ గూండాల రాళ్ల దాడిలో ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కేశవ, అంగళ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అర్జున్‌రెడ్డి (35) తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందికి గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా చంద్రబాబు వారించడం అటుంచి, చోద్యం చూశారు. పైగా జీపుపైకి ఎక్కి రెచ్చగొట్టేలా మాట్లాడారు.

పుంగనూరు పుడింగితో తేల్చుకుందాం రండి..

అంగళ్ల వద్ద నుంచి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బైపాస్, పలమనేరు మీదుగా చంద్రబాబు చిత్తూరుకు చేరుకోవాల్సి ఉంది. అయితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకున్న చంద్రబాబు.. పుంగనూరుకు వెళ్దాం.. రండి అంటూ టీడీపీ గూండాలకు పిలుపునిచ్చారు. 'పుంగనూరులో పుడింగి ఉన్నాడు.. రండి తేల్చుకుందాం' అని గట్టిగా అరుస్తూ ముందుకు కదిలారు.

బాబు పిలుపుతో పుంగనూరు వద్ద విధ్వంసం

అంగళ్ల వద్ద చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు పుంగనూరు వద్ద టీడీపీ గూండాలు పెద్ద సంఖ్యలో అధినేత రాకముందే గుమిగూడారు. ఒక్కసారిగా బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నారు. పుంగనూరు పర్యటనకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నా వినిపించుకోకుండా గొడవకు దిగారు. ఒక ఏఎస్పీ, డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతోపాటు సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతలో చంద్రబాబు అక్కడికి చేరుకున్నారు. వందల సంఖ్యలో వచ్చిన టీడీపీ గూండాలను వెనకేసుకుని బైపాస్ రోడ్డులోని భీమగానిపల్లె సర్కిల్ నుండి పుంగనూరులోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 'పుంగనూరులో కాలుమోపుతా.. ఎవరు అడ్డుకుంటారో? చూస్తా?' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పోలీసులు ఎంతగా వారించినా వినలేదు. పైగా పోలీసులను టార్గెట్‌గా చేసుకుని టీడీపీ శ్రేణులు తొలుత రాళ్ల వర్షం కురిపించాయి. ఆ తర్వాత కర్రలతో పోలీసులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. ముందస్తుగా సిద్ధం చేసుకున్న బీరు బాటిళ్లు, మద్యం సీసాలు పోలీసులపైకి విసిరి తీవ్రంగా గాయపరిచారు. పోలీసు గస్తీ కోసం ఏర్పాటు చేసిన వజ్ర వాహనాన్ని, మరో పోలీసు వాహనాన్ని కిందకు పడదోసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఎంతగా సంయమనం పాటించి, సర్దిచెప్పినప్పటికీ వారు వినకపోవడంతో పోలీసులు వారిపైకి బాష్ప వాయువు ప్రయోగించి చెదరగొట్టాల్సి వచ్చింది. ఈ విధ్వంసం గంటన్నరకుపైగా సాగింది. టీడీపీ శ్రేణుల దాడిలో ఏఎస్పీ, డీఎస్పీతోపాటు ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతోపాటు మొత్తం 27 మందికి రక్త గాయాలయ్యాయి. కాగా, గొడవ విషయం తెలిసి పుంగనూరు బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో 50 మందికి టీడీపీ నేతల రాళ్ల దాడిలో తీవ్ర గాయాలయ్యాయి.

రెచ్చగొట్టే ప్రసంగాలతోనే విధ్వంసం

రెచ్చగొట్టే ప్రసంగాలతో పథకం ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు జరగడం బాధాకరం. అనుమతి పొందిన రూట్‌మ్యాప్‌ను కాదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పుంగనూరులోకి వచ్చే ప్రయ త్నం చేయడంతోనే విధ్వంసం జరిగింది. పోలీస్ అధికారుల వద్ద పిస్టల్ ఉన్నప్పటికీ, ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని గ్రహించినా సంయమనంతో వ్యవహరించారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకూడదని కాల్పులు జరపలేదు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దాడులు చేసిన వారిని గుర్తిస్తాం. బాధ్యులందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తాం. విధ్వంసం సృష్టించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

– అమ్మిరెడ్డి, అనంతపురం రేంజి డీఐజీ

అంతా వ్యూహాత్మకం

చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌జీసీ కమాండోల రక్షణలో జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న టీడీపీ నేత చంద్రబాబు నాయుడు ఎక్కడైనా పర్యటించాలంటే 24 గంటల ముందుగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) నుంచి ఇంటలిజెన్స్ విభాగానికి రోడ్ మ్యాప్ ఇవ్వాలి. అప్పుడు జిల్లా పోలీసుశాఖ ముందుగా రూట్ మ్యాప్‌లో ఉన్న కల్వర్టులు, శివారు ప్రాంతాలు, అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతుంది. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), ఆర్మ్‌డ్ రిజర్వు దళాలు చంద్రబాబు కార్యక్రమం జరిగే రూట్ మ్యాప్‌లో భద్రతా చర్యలు, ముందస్తు తనిఖీలు చేపడతారు. కానీ చిత్తూరు జిల్లా పర్యటనకు సంబంధించి చంద్రబాబు నుంచి పోలీసులకు అందిన రూట్ మ్యాప్ ఒకలా ఉంటే.. దాన్ని కాదని పుంగనూరులోకి పర్యటనను మారుస్తూ మరో దారిని ఎంచుకోవడం రాజకీయంగా లబ్ధి పొందే వ్యూహమేనని స్పష్టమవుతోంది. మదనపల్లె నుంచి పుంగనూరు బైపాస్ మీదుగా చంద్రబాబు నాయుడు చిత్తూరు శివారుల్లోని బాన్స్ హోటల్‌కు వెళతారని బుధవారం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి నుంచి పోలీసులకు సమాచారం అందింది. గురువారం రాత్రి కూడా పర్యటనలో మార్పులు చేస్తూ.. పుంగనూరు బైపాస్ మీదుగానే వెళ్లిపోతారని చెప్పారు. తీరా శుక్రవారం సాయంత్రం పుంగనూరులోకి ప్రవేశించడానికి విఫలయత్నం చేస్తూ విధ్వంసం సృష్టించారు.



పుంగనూరులో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న టీడీపీ కార్యకర్తలు.. తగలబడుతున్న వాహనాలు

చూసుకుందాం రండి.. నా కొడకల్లారా..: చంద్రబాబు

సాక్షి, తిరుపతి: 'ఒళ్లు దగ్గర పెట్టుకోండి. నాతో పెట్టుకుంటే ఇలాగే జరుగుతుంది. తమాషాలు చేస్తున్నారా, చూసుకుందాం రండి రా.. నా కొడకల్లారా.. వాళ్లను తరమండిరా..'అంటూ ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలీసులపైకి టీడీపీ కార్యకర్తలను రెచ్చ గొట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులను ఇష్టానుసారం మాట్లాడారు. 'టైం చెప్పండి, ప్లేస్ చెప్పండి, ఎవరు గెలుస్తారో చూద్దాం. నేను చిత్తూరు జిల్లాలోనే పుట్టా. బాంబులకే భయపడలేదు. నన్ను బెదిరించడం మిమ్మల్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు. కర్రలతో వస్తే కర్రలతో వస్తా. రౌడీలకు రౌడీగా ఉంటా. ఏయ్ పోలీస్.. వాళ్లను పంపించండి'అంటూ అంగళ్ల వద్ద అనుచిత వ్యాఖ్యలు చేశారు. డీఎస్పీ కేశప్పను ఉద్దేశిస్తూ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఆ బట్టలు తీసేయండయ్యా. అందరూ పెయిడ్ ఆర్టిస్టులే. గాడిదలు కాస్తున్నారా'అంటూ నోరుపారేసుకున్నారు. తనను అడ్డుకుంటే ఇలాగే జరుగుతుందని హెచ్చరించారు. ఇంకా.. 'దెబ్బలు తగిలినా.. తలలు పగిలినా భయపడేది లేదు. నేను ఎస్ఎస్‌జి ప్రొటెక్టీవ్‌ని. ఏయ్ పోలీస్ బట్టలిప్పు. రోషం లేని జీవితం. మీ పతనం చూసేవరకు వెంటపడుతా'అంటూ పుంగనూరులో చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ముందస్తు పథకం ప్రకారమే దాడులు

ముందస్తు పథకం ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై దాడి చేశారు. రాళ్లు, మద్యం బాటిళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. పోలీస్ వాహనాలను సైతం తగులబెట్టడం దారుణం. దీని వెనుక ఎవరున్నా వదిలేది లేదు. చట్ట ప్రకారం వారందరిపై కేసులు నమోదు చేస్తాం. రూట్ మ్యాప్‌లో లేకపోయినా.. టీడీపీ నాయకులు కొంత మంది కావాలనే నిబంధనలకు విరుద్ధంగా పుంగనూరులోనికి రావడానికి ప్రయత్నించారు. పోలీసులు ఎంతో సమయమనంతో వ్యవహరించి, దెబ్బలు తిన్నప్పటికీ కాల్పులు జరపలేదు. గొడవనంతటినీ వీడియో చిత్రీకరించాము. చట్టప్రకారం బాధ్యులందరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం. – రిషాంత్‌రెడ్డి, చిత్తూరు ఎస్పీ

ఇక బుద్వేల్ భూములు

- 100 ఎకరాలు అమ్మకానికి పెట్టిన ప్రభుత్వం
- 14 ప్లాట్లలో ఉన్న భూములకు 10న ఆన్‌లైన్ బిడ్డింగ్
- ఎకరానికి రూ.20 కోట్ల చొప్పున కనీస ధర

సాక్షి, హైదరాబాద్: ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన బుద్వేల్ లే అవుట్‌లోని 100 ఎకరాల భూములను విక్రయించేందుకు హెచ్ఎండీఏ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కోకాపేట్‌లోని భూములకు భారీ స్పందన లభించడంతో, ఔటర్‌రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న ఈ భూములను సైతం ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. మొత్తం 14 ప్లాట్లలో ఉన్న వంద ఎకరాలకు ఈ నెల 10వ తేదీన ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డిపాజిట్ చెల్లించవలసి ఉంటుంది. ఎకరానికి రూ.20 కోట్ల కనీస ధరను హెచ్ఎండీఏ నిర్ణయించింది. ఒక్కో ప్లాట్‌లో కనిష్ఠంగా 3.47 ఎకరాల నుంచి గరిష్ఠంగా 14.33 ఎకరాల వరకు భూమి అందుబాటులో ఉంది. బుద్వేల్ లే అవుట్‌పైన ఈ నెల 6వ తేదీన ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 10వ తేదీన ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా బిడ్డింగ్ నిర్వహిస్తారు. ఉదయం ఒకటో ప్లాట్ నుంచి 10వ ప్లాట్ వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 11వ ప్లాట్ మొదలు 17వ ప్లాట్ వరకు బిడ్డింగ్ ఉంటుంది. ఈ భూముల్లో బహుళ వినియోగ భవనాలకు అనుమతులను ఇవ్వనున్నారు. అలాగే కోకాపేట్ తరహాలోనే అపరిమిత సంఖ్యలో అంతస్తులను నిర్మించవచ్చు. కొనుగోలుదారులకు మూడు వారాల్లో నిర్మాణాలకు కావాల్సిన అనుమతులన్నీ మంజూరు చేస్తారు.

బ్రిటిష్ హైకమిషనర్‌గా ఉంటారా?

- మన దేశ యువతులకు మాత్రమే లక్కీ ఆఫర్
- 'హైకమిషనర్ ఫర్ ద డే'కు దరఖాస్తుల ఆహ్వానం!

సాక్షి, హైదరాబాద్: ఒకే ఒక్క రోజు బ్రిటిష్ దేశపు హైకమిషనర్‌గా వ్యవహరించాలని అనుకుంటున్నారా? ఈ అవకాశం కేవలం భారతీయ మహిళలకే.. 18 – 23 ఏళ్ల మధ్య వయస్కులకు మాత్రమే అంటోంది బ్రిటిష్ హైకమిషన్. అంతర్జాతీయ బాలికా దినోత్సవం(అక్టోబరు 11) సందర్భంగా ఎంపికైన యువతి ఒక రోజంతా తమ దేశ హైకమిషనర్‌గా వ్యవహరించడంతోపాటు యూకేకు చెందిన ఉన్నతస్థాయి దౌత్యవేత్తలతో సమావేశం కావొచ్చని కమిషన్ తెలిపింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ''సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు యువత ఎలా నేతృత్వం వహించవచ్చు''అన్న ప్రశ్నకు ఒక నిమిషం వీడియో ద్వారా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ వీడియోను ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, లింక్డిన్ వంటి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాల్సి ఉంటుంది. @UKinIndia హ్యాండిల్‌ను ట్యాగ్ చేయడంతోపాటు #DayOfTheGirl హ్యాష్‌ట్యాగ్‌ను వాడాల్సి ఉంటుంది. ఈ నెల 18వ తేదీ లోపు ఇవన్నీ చేయాలి. ఆన్‌లైన్ అప్లికేషన్‌ను నింపడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతుంది. మరిన్ని వివరాలకు..www.gov.uk/world/india|Hindi: https://www.gov.uk/world/ india/news.hi, Follow us on: http://twitter.com/ukinindia లను చూడవచ్చు.

పసుపు నాణ్యత లెక్క..
2 నిమిషాల్లో పక్కా..

కృత్రిమ మేధతో కర్క్యుమిన్ శాతాన్ని గుర్తించే యంత్రం

నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్ర సుగంధ ద్రవ్యాల బోర్డు

ఐదు నిమిషాల్లో తేమ శాతాన్ని తేల్చే పరికరం కూడా..

క్లౌడ్ టెక్నాలజీ ద్వారా పసుపు పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో..

'ఈ-నామ్' సైట్‌కు అనుసంధానం.. రైతులకు అధిక ధర లభించే చాన్స్

ఇక్కడ విజయవంతం కావడంతో మేఘాలయలోని షిల్లాంగ్‌లోనూ ఏఐ యంత్రం ఏర్పాటు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నడిచే కర్క్యుమిన్ టెస్టింగ్ మెషీన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఆరుగాలం కష్టపడి పండించిన పంట. అందులోనూ పొలాన్ని శ్రద్ధగా, శుచీశుభ్రంగా చూసుకుంటూ పండించే పసుపు పంట. దిగుబడి వచ్చాక మార్కెట్‌కు తీసుకొస్తే.. నాణ్యతపై కొర్రీలు.. 'కర్క్యుమిన్' శాతంపై సందేహాలు.. ల్యాబ్‌ల నుంచి రిపోర్టులు రావడానికి నాలుగైదు రోజులు.. వేచి ఉండలేక తక్కువ ధరకు అమ్ముకునే రైతులు.. ఇన్నేళ్లుగా కనిపించిన దృశ్యమిది.

మరి ఇప్పుడు.. మార్కెట్లో వెంటనే నాణ్యత పరీక్షలు.. నిమిషాల్లోనే 'కర్క్యుమిన్', తేమ శాతం లెక్కలు.. ఆన్‌లైన్‌లో పసుపు పంట విక్రయాలు.. రైతులకు మంచి ధరలు.. దీనంతటికీ కారణం 'కృత్రిమ మేధ (ఏఐ)'తో కూడిన అత్యాధునిక యంత్రాలు.

.. దేశంలోనే ముఖ్యమైన పసుపు మార్కెట్లలో ఒకటైన నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఈ సరికొత్త సాంకేతికత రైతులకు వరంగా మారింది. దేశంలోనే మొదటిసారిగా కేంద్ర సుగంధ ద్రవ్యాల బోర్డు ఇక్కడ 'కర్క్యుమిన్ రీడింగ్ మెషీన్'ను ఏర్పాటు చేసింది.

రెండేళ్ల కింద మొదలై..

పసుపులో కర్క్యుమిన్ ఆధారిత మార్కెటింగ్ దిశగా దేశంలోనే తొలిసారిగా నిజామాబాద్ మార్కెట్‌లో పునాది పడింది. రైతుల పసుపు పంటలోని కర్క్యుమిన్ శాతాన్ని స్థానికంగానే, త్వరగా తెలుసుకునేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వ సుగంధ ద్రవ్యాల బోర్డు ఇక్కడి మార్కెట్ యార్డులో 'కర్క్యుమిన్ రీడింగ్ మెషీన్'ను ఏర్పాటు చేసింది. 'ఏజీ-నెక్స్ట్' సంస్థ తయారు చేసిన ఈ యంత్రం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పనిచేస్తుంది. ఇంటర్నెట్ ఆధారంగా 'క్లౌడ్ టెక్నాలజీ'తోనూ అనుసంధానం అవుతుంది. రైతులు తెచ్చిన పసుపులోని ఒక కొమ్మును పొడిచేసి, ఈ యంత్రంలో పెడితే.. కేవలం రెండు నిమిషాల్లోనే అందులోని కర్క్యుమిన్ శాతాన్ని వెల్లడిస్తుంది. ఇంతకుముందయితే.. పసుపు శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపేవారు, ఫలితాలు రావడానికి రెండు, మూడు రోజులు సమయం పట్టేది. ఇక పసుపులో తేమశాతాన్ని గుర్తించే యంత్రాన్ని సైతం గత ఏడాది ఇక్కడి మార్కెట్లో ఏర్పాటు చేశారు. పసుపు కొమ్ములను దంచి ముక్కలను ఇందులో వేస్తే.. కేవలం 5 నిమిషాల్లో తేమ శాతం తెలిసిపోతుంది.

రైతులకు ఉచితంగా..

నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు పంట వచ్చే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కర్క్యుమిన్ పరీక్షలు చేస్తున్నారు. ప్రతి శాంపిల్‌కు రూ.140 రుసుము వసూలు చేస్తున్నారు. అయితే మార్కెట్‌లో పసుపు అమ్మేందుకు వచ్చిన రైతుల నుంచి మాత్రం రుసుము తీసుకోవడం లేదు. వారి పసుపు కర్క్యుమిన్ శాతం ఫలితాలను 'ఈ-నామ్' సైట్‌లో నమోదు చేసి, సంబంధిత పసుపు విక్రయ లాట్‌కు అను సంధానం చేస్తున్నారు. 'ఈ-నామ్' సైట్ ద్వారా దేశవ్యాప్తంగా ఏ ప్రాంతంలోని రైతులు అయినా.. ఇక్కడి పంటను కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల కర్క్యుమిన్ శాతం ఎక్కువగా ఉన్న పసుపు రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు తెలిపారు. కర్క్యుమిన్ పరీక్ష యంత్రం, దాని సాఫ్ట్‌వేర్, నిర్వహణ కలిపి మొత్తం రూ.50 లక్షలు అని వెల్లడించారు. నిజామాబాద్‌లో ఇది విజయవంతం కావడంతో ఇటీవలే మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోనూ ఏర్పాటు చేశారని చెప్పారు.


పసుపులో తేమ శాతాన్ని తెలిపే యంత్రం

ఏమిటీ 'కర్క్యుమిన్'?

పసుపులో ఉండే కీలక రసాయన పదార్థమే 'కర్క్యుమిన్'. దీనితోనే పసుపు పంటకు ఆ రంగు వస్తుంది. ఆహారం నుంచి ఔషధాల దాకా.. రంగుల తయారీ సౌందర్య ఉత్పత్తుల దాకా.. దీని ప్రయోజనాలెన్నో. కర్క్యుమిన్‌కు యాంటీ బయాటిక్, యాంటీ ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలు ఉంటాయని.. కేన్సర్ సహా ఎన్నో రకాల వ్యాధుల నుంచి రక్షణకు, శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ఇది తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటు చేయండి

- ప్రధాని మోదీతో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ టు విజయవాడ జాతీయరహదారి(65)లో మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఉన్న స్ట్రెచ్‌ను గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేగా చేయాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీని కోరారు. అత్యంత రద్దీ ఉన్న ఈ రూట్‌లో రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా ప్రాజెక్టు చేపట్టాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ప్రైవేట్ యూనివర్సిటీల దోపిడీ ఎక్కువైందని, ఈ విద్యాసంస్థలపై సీబీఐ, ఈడీ, ఇతర సంస్థలతో విచారణ చేయించాలని ప్రధానిని కోమటిరెడ్డి కోరారు. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రధానిని కలిసిన సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులకు లైన్‌క్లియర్

- జీఓ నంబరు5కు చట్టబద్ధత
- పీఆర్‌టీయూ టీఎస్ నేతలకు మంత్రి స్పష్టత


మంత్రి సబితను కలిసిన పీఆర్‌టీయూ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం తీపిక బురు చెప్పబోతోందని ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ నేతలు తెలిపారు. విద్యాశాఖమంత్రి సబిత ఇంద్రారెడ్డిని సంఘం నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీఎమ్మెల్సీ పూల రవీందర్ కలిశారు. ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు గతంలో జారీ చేయగా, ఇందుకు సంబంధించిన జీఓ నంబరు 5కు అసెంబ్లీ చట్టబద్ధత లేదనే కారణంగా కొంతమంది కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలైనా ఆగిపోయాయి. అయితే, జీఓ 5 అమలుకు శాసనసభ ఆమోదం పొందే ప్రతిపాదనలు విద్యాశాఖ సమర్పించినట్టు మంత్రి సబిత శుక్రవారం పీఆర్‌టీయూ టీఎస్ నేతలకు తెలిపారు. ఇందుకు మంత్రి సబితకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి: టీఈఏ


టీఈఏ సమావేశంలో మాట్లాడుతున్న చిలగాని

సాక్షి, హైదరాబాద్: కొత్త పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ నిర్మల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. పాత పెన్షన్ విధానం తేవాలని, వెంటనే 20 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు గడ్డం బాలస్వామి, యాకుబ్ పాషా, ఎం.కె.రాజు, భరత్ సత్యనారాయణ సమావేశంలో పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూసేకరణ రద్దు

- 180 మంది మేడిపల్లి, కురిమిద్ద గ్రామస్తుల పిటిషనర్ల అభ్యంతరాలు తీసుకోండి
- చట్టప్రకారం ప్రక్రియ జరగలేదని తెలుస్తోంది
- మూడేళ్ల విలువైన కోర్టు సమయాన్ని వృథా చేశారు
- ఫార్మాసిటీ భూ సేకరణపై హైకోర్టు తీర్పు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫార్మా సిటీకి సంబంధించిన భూసేకరణ కేసులో ప్రకటన, అవార్డులు, పరిహారం డిపాజిట్ సహా తదుపరి అన్ని చర్యలను నిలిపివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. మేడిపల్లి, కురిమిద్ద గ్రామవాసులైన 180 మంది పిటిషనర్ల నుంచి మళ్లీ అభ్యంతరాలను తీసుకొని, భూసేకరణ ప్రారంభించాలని ఆదేశించింది. భూసేకరణలో చేపట్టాల్సిన కనీస విధానాన్ని కూడా పాటించకుండా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా భూమిని సేకరించేటప్పుడు అనుసరించాల్సిన విధానంపై 2017లో ప్రధాన కార్యదర్శి మెమోను జారీ చేసినా, దాన్ని అర్థం చేసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యా రని పేర్కొంది. పిటిషన్ వేసిన తర్వాత కూడా అధికారులు తమ తప్పును గుర్తించలేదని, తమ చర్యలను సమర్థించుకునే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియలో మూడేళ్లు గడిచినా ప్రతిష్టాత్మకమైన ఫార్మా సిటీ నిర్మాణం కూడా ముందుకు సాగలేదని పేర్కొంది. ఈ క్రమంలో ప్రభుత్వం 2020, జూలై 23న జారీ చేసిన భూసేకరణ ప్రకటనను కొట్టివేస్తున్నామని వెల్లడించింది. భూసేకరణ, పునరావాసం చట్టంలోని సెక్షన్ 15 కింద అభ్యంతరాలను 3 నెలల వ్యవధిలోగా తీసుకుని, మళ్లీ భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది.

తీర్పు తేదీ ప్రామాణికంగా మార్కెట్ విలువ నిర్ణయించాలి: భూసేకరణ, పునరావాస చట్టప్రకారం తమకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వడం లేదని, ఇతర చర్యలు చేపట్టడం లేదని మేడిపల్లి, కురిమిద్ద గ్రామవాసులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫున రవికుమార్, ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరీందర్ పరిషద్ వాదనలు అంతకుముందు వినిపించారు. 'రెండు వారాల్లో పిటిషనర్లు అభ్యంతరాలను తెలియజేయాలి. అధికారులకు సహకరించాలి. ఈ తీర్పు తేదీని ప్రామాణికంగా తీసుకుని అధికారులు మార్కెట్ విలువ నిర్ణయించాలి. ఇరుపక్షాలు చర్చలతో ప్రయోజనాలను పొందాలి. చట్టాలు ఏం చెబుతున్నాయో కూడా ఐఏఎస్ అధికారులు అర్థం చేసుకోకపోవడం, భూసేకరణ చట్టాన్ని ఎలా అమలు చేయాలన్నది కూడా తెలియకపోవడం ఆక్షేపణీయం. దీని కారణంగానే రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 2017, అక్టోబర్ 23న మెమో జారీ చేయాల్సి వచ్చింది. అందులో 2013 భూ సేకరణ చట్ట ప్రకారం.. సేకరణ సమయంలో అనుసరించాల్సిన విధానం ఏంటీ అన్నది చెబుతూ పలు మార్గదర్శకాలు వెల్లడించారు. పిటిషన్ వేసిన తర్వాత కూడా అధికారులు తమ తప్పును గ్రహించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గుడ్డిగా తమ నిర్ణయాన్ని సమర్థిస్తూ వచ్చారు. దీని కారణంగా ఎంతో విలువైన కోర్టు సమయం మూడేళ్లుగా వృథా అవుతూ వచ్చింది'అని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేసింది.


సంజీవకుమార్

ఓ సాధారణ పట్టణంలో పుట్టి పెరిగాడతడు.
కంప్యూటర్ కోర్సు కోసం హైదరాబాద్ వచ్చాడతడు.
నేర్చుకున్నాడు... తను నేర్చిన విద్యను
ఇతరులకు నేర్పించేపనిలో మునిగిపోయాడు.
ఎదుగుతున్నాననుకున్నాడు... అగాథంలోకి జారిపోయాడు.
ఫుట్ పాత్ మీదే నిద్ర... అతడిని మార్చిన రోజది.

దారి చూపిన ఫుట్ పాత్

సంజీవకుమార్ పుట్టింది, పెరిగింది మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో. పాలిటెక్నిక్, ఐటీఐ, గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకునే నాటికి సమాజంలో సాంకేతికంగా మరో విప్లవం మొదలైంది. అదే కంప్యూటర్ ఎడ్యుకేషన్. రాబోయే కాలంలో కంప్యూటర్ లేనిదే ఏ పనీ చేయలేమని తెలుసుకున్నాడు సంజీవ్‌కుమార్. హైదరాబాద్‌కు వచ్చి డీటీపీతో మొదలు పెట్టి డీసీఏ, పీజీడీసీఏ, పీజీ డీఎస్‌ఈ వరకు అప్పటికి అందుబాటులో ఉన్న కోర్సులన్నీ చేశాడు. తన మీద నమ్మకం పెరిగింది. సైబర్‌టెక్ పేరుతో నల్ల కుంటలో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించాడు. కంప్యూటర్స్‌లో ప్రపంచాన్ని ఆందోళనలో ముంచెత్తిన వైటూకే సమస్య సద్దుమణిగింది. కానీ అంతకంటే పెద్ద ఉత్పాతం సంజీవకుమార్ జీవితాన్ని ఆవరించింది. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నాడతడు.

ఫుట్‌పాత్ మీద కొత్త ఉపాధి!

కంప్యూటర్ సెంటర్‌లను అమ్మేసిన తర్వాత కన్సల్టెంట్‌గా మారాను. తార్నాకలోని నన్మాన్ హోటల్ ముందున్న ఫుట్ పాతే నా వర్క్ ప్లేస్. నా భుజాన ఒక్క బ్యాగ్‌తో పాన్ కార్డ్ సర్వీస్ రూపంలో జీవితం కొత్తగా మొదలైంది. రోజుకు వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు వచ్చేవి. నెలకు రెండు వేల అద్దెతో ఒక గదిలో 'స్కై క్రియేషన్స్' పేరుతో సర్వీస్‌ను రిజిస్టర్ చేశాను. పాన్ కార్డు నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్ సర్వీస్‌లు, ప్లేస్‌మెంట్‌ల వరకు సర్వీస్‌లను విస్తరించాను. పద్మారావు నగర్‌లో ఓ చిన్న ఫ్లాట్ కొనుక్కున్న తర్వాత స్కై ఫౌండేషన్ పేరుతో సామాజిక సేవ మొదలు పెట్టాను. అద్దె ఇంట్లో ఫౌండేషన్ రిజిస్టర్ చేయాలంటే ఇంటి యజమాని అనుమతించరు. కాబట్టి సొంత గూడు ఒకటి ఏర్పరుచుకునే వరకు ఆగి అప్పటి నుంచి వీధి పాలైన జీవితాల కోసం పని చేయడం మొదలు పెట్టాను.

– సంజీవకుమార్, ఫౌండర్, స్కై ఫౌండేషన్, హైదరాబాద్

అప్పు మిగిలింది!

"నా మీద నాకున్న నమ్మకం, దానికితోడు అందరినీ నమ్మడం నా జీవిత గమనాన్ని మార్చేశాయి. నా మీద నమ్మకంతో కంప్యూటర్ సెంటర్‌లు ప్రారంభించాను. స్నేహితుల మీద నమ్మకంతో పదకొండు బ్రాంచ్‌లకు విస్తరించాను. కొన్ని బ్రాంచ్‌ల నిర్వహణ స్నేహితులకప్పగించాను. కొందరు స్నేహితులు పెట్టుబడి కోసం డబ్బు అప్పు ఇచ్చి సహకరించారు. నా పెళ్లి కోసం ఒకటిన్నర నెలలు మా ఊరెళ్లాను. పెళ్లి చేసుకుని హైదరాబాద్‌కి వచ్చేటప్పటికి పరిస్థితి తారుమారుగా ఉంది. ఫ్రాంచైజీలు తీసుకున్న స్నేహితులు మోసం చేశారు. నా కళ్ల ముందు తొంబై ఐదు లక్షల అప్పు. నా భార్య బంగారం, నేను నిర్వహిస్తున్న కంప్యూటర్ సెంటర్‌లను అమ్మేసి కూడా ఆ అప్పు తీరలేదు. అప్పు ఇచ్చిన స్నేహితుల నుంచి ఒత్తిడి పెరిగింది. నా భార్యను పుట్టింట్లో ఉంచి హైదరాబాద్‌కొచ్చాను. నా దగ్గర డబ్బున్నప్పుడు నా చుట్టూ ఉన్న వాళ్లెవరూ నాకు ఒక్కరోజు అన్నం కూడా పెట్టలేదు. ఆకలితో ఫుట్‌పాత్ మీద పడుకున్న రోజును నా జీవితంలో మర్చిపోలేను. డబ్బులేని మనిషికి విలువ లేదని తెలిసి వచ్చిన క్షణాలవి. మరి ఫుట్‌పాత్ మీదనే బతికేవాళ్ల పరిస్థితి ఏమిటి... అనే ఆలోచన మొదలైన క్షణం కూడా అదే.



ఫుట్‌పాత్ మీద ఉండేవారికి కరోనా వ్యాక్సిన్ వేయించడం : వీధి బాలలకు పుట్టినరోజు వేడుక

వైద్యం... ఆహారం!

నేను స్కై ఫౌండేషన్ స్థాపించింది 2012లో. అప్పటి నుంచి వీధుల్లో బతికే వాళ్లకు ప్రతి ఆదివారం అన్నం పెట్టడం, మందులివ్వడం, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నాను. ఆఫీస్‌లోనే వండి రెండు వందలకు పైగా పార్శిళ్లతో మా వ్యాన్ బయలుదేరుతుంది. వాటిని ఫుట్‌పాత్ మీద, చెట్టుకింద పడుకున్న వాళ్లకు ఇస్తాం. అలాగే ప్రతి బిడ్డా పుట్టిన రోజు పండుగనూ, కేక్ కట్ చేసిన ఆనందాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశంతో పిల్లలకు సామూహికంగా పుట్టిన రోజులు చేస్తున్నాను. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజు పిల్లల చేత జెండావందనం చేయిస్తాను. కోఠీలో పాత పుస్తకాలు తెచ్చి పంచుతాను. వీటన్నింటికంటే నేను గర్వంగా చెప్పుకోగలిగిన పని వీళ్లందరికీ కరోనా వ్యాక్సిన్ వేయించడం. ఫుట్‌పాత్‌ల మీద బతుకీడ్చే వాళ్లకు ఆధార్ కార్డు ఉండదు, మొబైల్ ఫోన్ ఉండదు. కరోనా వ్యాక్సిన్ వేయాలంటే ఈ రెండూ ఉండాలి. కేంద్ర ప్రభుత్వానికి తెలియచేసి ప్రత్యేక అనుమతి తీసుకుని వాళ్లందరికీ వ్యాక్సిన్ వేయించాను. కరోనా సమయంలో సేవలందించిన వైద్యులకు, వైద్య సిబ్బందికి సన్మానం చేశాను.

ఒక్క అవకాశమివ్వండి!

వీధుల్లో బతుకు వెళ్లదీసే వాళ్లకు తాత్కాలికంగా అన్నం పెట్టడం, దుస్తులివ్వడం శాశ్వత పరిష్కారం కాదు. ఈ బతుకులు రోడ్డు పక్కనే ఉండిపోకూడదంటే వాళ్లకు బతుకుదెరువు చూపించాలి. ప్రభుత్వాలు వాళ్లను షెల్టర్ హోమ్‌లో ఉంచి ఆహారం పెట్టడంతో సరిపెట్టకూడదు. చిన్న చిన్న పనుల్లో శిక్షణ ఇచ్చి సమాజంలోకి పంపించాలి. వడ్రంగం, బుక్ బైండింగ్, అగరుబత్తీల తయారీ, విస్తరాకుల కటింగ్ వంటి చిన్న పనులు నేర్పించినా చాలు. వాళ్లకు ఒక దారి చూపించినవాళ్లమవుతామని ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రాలిచ్చాను. పైలట్ ప్రాజెక్టుగా ఒక ఏరియాకి బాధ్యత ఇవ్వండి. విజయవంతం చేసి చూపిస్తానని కూడా తెలియచేశాను. అలా చేయగలిగినప్పుడు వీధి జీవితాలు ఇంటివెలుగులవుతాయి'' అన్నారు సంజీవకుమార్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

'ఎఫ్‌బీఐలో పనిచేయడం అదృష్టం' అంటాడు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్. 'ఎఫ్‌బీఐ'లో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న ఇండో-అమెరికన్ సోహిని సిన్హా ఎప్పుడూ అదృష్టాన్ని నమ్ముకోలేదు. కష్టాన్నే ఇష్టంగా నమ్ముకుంది. ఎఫ్‌బీఐలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎన్నో స్థాయిలలో పనిచేసింది. తాజాగా సోహిని సిన్హాను ఎఫ్‌బీఐ సాల్ట్‌లేక్ సిటీ ఫీల్డ్ ఆఫీస్ స్పెషల్ ఏజెంట్ ఇన్‌చార్జిగా నియమించింది...


సోహిని సిన్హా

న్యూస్‌మేకర్

తిరుగులేని ఏజెంట్

ఎఫ్‌బీఐలో సోహిని సిన్హాకు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. కౌంటర్-టెర్రరిజం ఇన్వెస్టిగేషన్‌లో మంచి పేరు తెచ్చుకుంది. భద్రతకు సంబంధించిన సంక్లిష్టమైన అంశాలను హ్యాండిల్ చేయడంలో, క్రిమినల్ సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో దిట్టగా పేరున్న సోహిని సిన్హా తన వృత్తిపరమైన అంకితభావంతో ఎన్నో ప్రమోషన్‌లు పొందింది.

2001లో ఎఫ్‌బీఐలో స్పెషల్ ఏజెంట్‌గా చేరిన సిన్హా 2009లో సూపర్‌వైజరీ స్పెషల్ ఏజెంట్‌గా నియామకం అయింది. ఆ తరువాత వాషింగ్టన్ డీసీలోని కౌంటర్-టెర్రరిజం విభాగానికి బదిలీ అయింది. 2012లో అసిస్టెంట్ లీగల్ అటాషెగా ప్రమోట్ అయింది. కౌంటర్ టెర్రరిజమ్‌కు సంబంధించిన వ్యవహారాల్లో రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలిస్, కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్‌లతో కలిసి పనిచేసింది.

ఆ తరువాత ఫీల్డ్ సూపర్‌వైజర్ (డెట్రాయిట్ ఫీల్డ్ ఆఫీస్)గా ప్రమోట్ అయింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ఉగ్రవాదానికి సంబంధించిన సంక్లిష్టమైన కేసులను ఇన్వెస్టిగేట్ చేసింది.

2020లో సైబర్ ఇన్‌ట్రూజన్ స్క్వాడ్‌లో చేరింది. తన నాయకత్వ సమర్థతతో 2021లో నేషనల్ సెక్యూరిటీ మ్యాటర్స్, క్రిమినల్ మ్యాటర్స్‌కు సంబంధించి అసిస్టెంట్ స్పెషల్ ఏజెంట్ ఇన్‌చార్జి (పోర్ట్‌లాండ్ ఫీల్డ్ ఆఫీస్) గా ప్రమోట్ అయింది. ఏజెన్సీ ఆపరేషన్స్‌లో తనదైన ముద్ర వేసింది.

ఆ తరువాత ఎఫ్‌బీఐ డైరెక్టర్‌కు ఎగ్జిక్యూటివ్ స్పెషల్ అసిస్టెంట్‌గా నియామకం అయింది.

ఇంటర్నేషనల్ ఎసైన్‌మెంట్స్‌లో కూడా తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇంగ్లాండ్ నుంచి ఇరాక్ వరకు ఎన్నో దేశాల్లో, ఎన్నో సంస్కృతుల మధ్య పని చేసింది.

ఎఫ్‌బీఐలో చేరడానికి ముందు సోహిని సిన్హా థెరపిస్ట్‌గా, ఒక స్వచ్ఛంద సంస్థకు సంబంధించిన క్లినిక్‌లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసింది.

ఇక చదువు విషయానికి వస్తే సైకాలజీలో డిగ్రీ, మెంటల్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ చదువు తన వృత్తి జీవితంలో ఎంతో ఉపయోగపడింది.

ఇతరులకు సహాయపడాలనే సోహిని సిన్హా తపనకు ఎఫ్‌బీఐ బలమైన వేదికలా ఉపయోగపడుతోంది.

బ్యూటిప్స్ వానకాలం మేలైనవి...



ఈ కాలం జిడ్డు చర్మం గలవారి సమస్య మరింత పెరుగుతుంటుంది. అలాగే, ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా పెరిగే అవకాశం ఉంది. డీ హైడ్రేట్ అయ్యి చర్మం నిస్తేజంగా మారే అవకాశం ఉంది. ఈ సమస్యలకు విరుగుడుగా..

- జిడ్డు, మలినాలను తొలగించడానికి క్లెన్సర్‌ను ఉపయోగించాలి. దీనివల్ల మృతకణాలు సులువుగా తొలగిపోతాయి. సహజసిద్ధమైన క్లెన్సర్ కావాలనుకుంటే ఇందుకు ఓట్ మీల్, చక్కెర లేదా పండ్ల గుజ్జును వాడుకోవచ్చు.
- చర్మం పొడిగా మారితే బాదం నూనె లేదా మాయిశ్చరైజర్‌ని ఉపయోగించాలి. రోజూ పది గ్లాసుల నీళ్లు తాగాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడానికి వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి. తేమ ఉండే చోట ఫంగల్ పౌడర్లు, క్రీములను ఉపయోగించాలి.
- చర్మం తాజాగా ఉండాలంటే మీ ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రొటీన్లను చేర్చాలి. ఒత్తిడిని ఎదుర్కోవడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇవి దోహదపడతాయి.
- వేప, తులసి, పసుపు, కలబంద వంటి వాటిలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. వీటిని చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి పై పూతలుగా వాడితే ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడతాయి.

సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే సామాన్యులు సైతం కోటీశ్వరులు కావచ్చని నిరూపించి చూపిస్తున్నాడు పదహారేళ్ల యువకుడు దిగ్విజయ్ సింగ్.

సమయాన్ని చాక్లెట్‌గా మార్చుకున్నాడు!


దిగ్విజయ్ సింగ్



కరోనా కారణంగా ఇళ్లలోనే జైల్లోలా కష్టంగా గడిపిన రోజులవి. పిల్లలు పెద్దలు అని తేడా లేకుండా హఠాత్తుగా దొరికిన బోలెడంత సమయాన్ని ఏం చేయాలో అర్థంకాని అయోమయ పరిస్థితులు. ఉదయపూర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన దిగ్విజయ్ సింగ్ కూడా ఏమి తోచుబాటు గాని ఆ సమయంలో.. కొత్తగా ఏదైనా నేర్చుకోవాలనుకున్నాడు. అనుకున్న వెంటనే యూట్యూబ్‌లో చాక్లెట్స్ తయారీ గురించి చూశాడు. చాక్లెట్స్ తయారీ సులభంగా ఉండడంతో ఇంట్లో తయారు చేశాడు. దిగ్విజయ్ చేసిన చాక్లెట్‌లు రుచిగా ఉన్నాయని కుటుంబ సభ్యులు, స్నేహితులు చెప్పడంతో మరిన్ని చాక్లెట్స్ తయారు చేసి అమ్మాలనుకున్నాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడు మహవీర్ సింగ్‌కు చెప్పడం, అతనికి ఆసక్తి ఉండడంతో ఇద్దరూ కలిసి చాక్లెట్‌లు తయారు చేద్దామని నిర్ణయించుకున్నారు.

గిఫ్ట్‌బాక్స్‌ను చూసి...

పదహారేళ్ల తన స్నేహితుడితో కలిసి యూట్యూబ్ సాయంతో చాక్లెట్స్, వివిధ రకాల డిజర్ట్‌లు తయారు చేసి స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంచేవాళ్లు. దీపావళికి దిగ్విజయ్ తండ్రి కారు కొన్నాడు. కారు షోరూం వాళ్లు కారుతోపాటు చాక్లెట్ బాక్స్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. షోరూంలో కారు కొనే కస్టమర్లందరికీ చాక్లెట్ బాక్స్‌లు గిఫ్ట్‌గా ఇస్తున్నారని దిగ్విజయ్‌కి తెలిసింది. వెంటనే హోటల్, కార్‌షోరూం యజమానులను కలిసి కాంప్లిమెంటరీగా ఇచ్చేందుకు తాను ఇంట్లో తయారు చేసిన చాక్లెట్స్ ఇస్తానని చెప్పాడు. అందుకు వారు ఒప్పుకోవడంతో చాక్లెట్స్ తయారీ మొదలుపెట్టాడు.

రెండేళ్లలో రెండుకోట్లు

ఒక కార్ షోరూం వాళ్లు వెయ్యి చాక్లెట్స్ కావాలని 2021లో తొలి ఆర్డర్ ఇచ్చారు. అప్పుడే 'సరామ్'అనే పేరుతో చాక్లెట్ విక్రయాలు ప్రారంభించాడు. చాక్లెట్స్ రుచిగా ఉండడంతో .. విక్రయాలు క్రమంగా పెరిగి ఏడాదిలోనే మంచి ఆదాయం వచ్చింది. దేశవ్యాప్తంగా రెండు టన్నులకు పైగా చాక్లెట్ విక్రయాలు జరిగాయి. దీంతో రెండేళ్లలోనే 'సరామ్' రెండు కోట్లను ఆర్జించింది.

సరికొత్తగా...

సాదా సీదాగా కాకుండా దేశంలో దొరికే రకరకాల పండ్లు, మసాలాలను ఉపయోగించి చాక్లెట్స్‌ను సరికొత్తగా తయారు చేసి విక్రయిస్తున్నాడు దిగ్విజయ్. కేరళ, తమిళనాడునుంచి కోకోపొడి, చాక్లెట్స్‌లో వాడే పండ్లను బాగా పండే రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని నాణ్యమైన రుచికరమైన చాక్లెట్స్‌ను తయారు చేస్తున్నాడు. ఢిల్లీ, బెంగళూరు, ఉదయ్‌పూర్, జైపూర్‌లలో సరామ్ కస్టమర్లు చాలామంది ఉన్నారు. ఉదయ్‌పూర్, జైపూర్‌లలో స్టోర్‌లు, ఆఫ్‌లైనేగాక, ఆన్‌లైన్‌లో చాక్లెట్ విక్రయాలు జరుగుతున్నాయి. సమయాన్ని సక్రమంగా వినియోగిస్తే కోట్లు సంపాదించవచ్చుననడానికి దిగ్విజయ్ ఉదాహరణగా నిలుస్తున్నాడు.

హిజార్బీ వచ్చేసిందోచ్!


హిజార్బీ


హనీఫా ఆడమ్

బార్బీ బొమ్మలను ఇష్టపడని వారు ఉండరేమో. బార్బీ అంత అందంగా ఉండాలని అమ్మాయిలంతా అనుకుంటారు. కానీ నాలాగా బార్బీలేదే? నాలాంటి డ్రెస్ వేసుకోలేదే అని అనుకున్న ఓ ఆర్టిస్ట్ ఏకంగా సరికొత్త బార్బీని రూపొందించింది. సంప్రదాయం ఉట్టిపడేలా తయారైన ఈ సరికొత్త బార్బీ అందర్నీ తెగ ఆకర్షిచేస్తోంది.

రంగు రంగుల డ్రెస్‌లు, ప్రముఖుల రూపాలతో అందర్నీ ఆకర్షించే బార్బీ హిజాబ్ వేస్తే ఎలా ఉంటుంది అనుకుంది నైజీరియాకు చెందిన 32 ఏళ్ల హనీఫా ఆడమ్. మార్కెట్లో హిజాబ్ ధరించిన బొమ్మల కోసం వెతికింది. ఎంత గాలించినా హిజాబ్ ధరించిన ఒక్క బొమ్మ కూడా కనిపించలేదు. తనలా హిజాబ్ ధరించిన బార్బీ కనిపించలేదని బాధపడింది. దీంతో తనే... హిజాబ్ ధరించిన బార్బీని తయారు చేయాలని నిర్ణయించుకుంది. 2015 డిసెంబర్‌లో ..నేవీ మ్యాక్సీ స్కర్ట్ కుట్టి, నీలం రంగు జాకెట్, నలుపు రంగు హిజాబ్‌ను బార్బీకి తొడిగి ఫోటో తీసింది. 'హిజార్బీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచి...చక్కగా చూడముచ్చటగా ఉన్న తొలి హిజార్బీ ఫోటోను పోస్టు చేసింది. ఈ ఫోటో చూసిన వారంతా..'' చాలా బావుంది. మా పిల్లలకు కూడా ఇటువంటి డ్రెస్సే కావాలని'' అడిగారు. దీంతో హనీఫా మరింత ఉత్సాహంతో వివిధ రకాల హిజార్బీలను రూపొందించింది. డ్రెస్‌లన్నింటిలోకి లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ హబీబీ డిసిల్వా ధరించిన బ్రిటిష్ స్టైల్ డ్రెస్ బాగా పాపులర్ అయ్యింది. మీడియా భారీ కవరేజ్‌తోపాటు, టీన్‌వోగ్ కూడా గుర్తించడంతో హిజార్బీకి మంచి ఆదరణ లభించింది. ఇప్పటిదాక హిజార్బీ అకౌంట్‌లో రెండు వందలకు పైగా ఫోటోలు పోస్టు చేసింది. ముస్లిం సాంప్రదాయం, ఫ్యాషన్‌ను ప్రతిబింబించేలా హనీఫా హిజార్బీలు తయారు చేయడం విశేషం.

ఇటీవల విడుదలైన బార్బీ సినిమాతో బార్బీ మేనియా చూసి హనీఫా మరోసారి హిజార్బీని యాక్టివ్ చేసింది. ఈ క్రమంలోనే ..ఆరేళ్ల తరువాత పింక్ రంగు వేసిన గోడ ముందు పింక్ కలర్ డ్రెస్ వేసుకుని, హిజాబ్ ధరించి నిలుచున్న హిజార్బీ ఫోటోను ఇన్‌స్టా అకౌంట్‌లో ''హిజార్బీ ఈజ్ బ్యాక్'' అంటూ పోస్టు చేసింది. ఈ పోస్టుకు నెటిజన్లు ఫిదా అయిపోయి తెగ లైక్‌లు కొడుతున్నారు.



మ్యాటెల్ హిజార్బీ..

హనీఫా తయారు చేసిన హిజార్బీ పాపులర్ కావడంతో 2017లో బార్బీ తయారీ సంస్థ కూడా హిజాబ్ ధరించిన బార్బీని విడుదల చేసింది. అమెరికా ఒలింపిక్ ఫెన్సర్ ఇతిహాజ్ మహమ్మద్ రూపంతో హిజార్బీని విడుదల చేసింది.

వ్యాపారిని కాదు.. ఆర్టిస్ట్ అవాలనుకోలేదు

''ఫైన్ ఆర్ట్స్‌ను చదివాను. కానీ ఆర్టిస్ట్ అవ్వాలనుకోలేదు. డాక్టర్ అవాలనుకున్నాను. అదీ కుదరక ఫిజియాలజీ చదివాను. ఫార్మకాలజీలో మాస్టర్స్ చేసాను. చదువు పూర్తిచేసి యూకే నుంచి నైజీరియా వచ్చాక... నాకు తెలిసిన ఫ్యాషన్ ఐడియాలను ఆన్‌లైన్‌లో పోస్టు చేసేదాన్ని. వాటిని చూసిన వారంతా అభినందించేవారు. 2016లో ఫుడ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో పాల్గొని విజేతగా నిలిచాను. అప్పుడు ఆర్టిస్ట్‌గా మారాలనుకున్నాను. అప్పటినుంచి నేను రూపొందించిన కళారూపాలను నైజీరియా, న్యూయార్క్ ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించడం మొదలు పెట్టాను. ఇలా చేస్తూ హిజార్బీని మీ ముందుకు తీసుకొచ్చాను. నేను వ్యాపారిని కాదు. నా స్నేహితురాళ్లు ప్రోత్సహించడంతో వివిధరకాల హిజార్బీని రూపొందించాను. ఈ నెలలో హిజార్బీ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించబోతున్నాను. బట్టల తయారీతోపాటు, నైజీరియా డిష్‌లకు ఫుడ్ ఆర్ట్‌ను జోడిస్తూ మా సంప్రదాయాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. నేను రూపొందించే హిజార్బీల్లో.. ఏసియన్, తెలుపు, నలుపు బొమ్మలు ఉన్నాయి. సెలబ్రిటీలను రోల్ మోడల్స్‌గా తీసుకునేందుకు వివిధ రంగుల్లో రూపొందిస్తున్నాను'' అని చెబుతోంది హనీఫా.



అప్పుడే జుట్టు తెల్లబడుతోందా?

ఒకప్పుడు యాభైఏళ్లు దాటిన వారికే తెల్లజుట్టు వచ్చేది కానీ ఇప్పుడు చాలామందికి పాతికేళ్లకంటే ముందే తెల్లజుట్టు వచ్చేస్తోంది. దాంతో ఉన్న వయసు కంటే పెద్దగా కనిపించడం, దానిని కప్పి పుచ్చుకోవడానికి తలకు రకరకాల హెయిర్ డైలు, షాంపూలు వాడటం... వాటిలోని రసాయనాల ప్రభావంతో సైడ్ ఎఫెక్టులు రావడం... వీటన్నింటి బదులు అసలు చిన్న వయసులోనే తెల్లజుట్టు ఎందుకు వస్తుందో చెబుతూ...దానిని నివారించడానికి తగిన సూచనలు, సలహాలతో కూడిన కథనం ఇది.

ఈ చిట్కాలు పాటించి చూడండి

టెన్షన్ వద్దు... ఇలా చేసి చూడండి

చిన్న వయసులోనే తెల్లజుట్టు రావడానికి గల అనేక కారణాలలో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాలు ప్రధానం. డైట్‌లో పోషకాల కొరత ఉండకూడదు.

తెల్లజుట్టు రాకుండా ఉండాలంటే విటమిన్ బి ఉండే ఆహారాలని పుష్కలంగా తినాలి. డైట్‌లో ఇవి కచ్చితంగా ఉండేవిధంగా చూసుకోవాలి. జుట్టు తెల్లగా మారుతుందంటే విటమిన్ బి లోపం ఉందని అర్థం చేసుకోండి. అంతే కాదు దీనివల్ల జుట్టు రాలడం, పొడి జుట్టు సమస్యలు కూడా ఎదురవుతాయి. రోజువారీ ఆహారంలో విటమిన్ బి ఉందా లేదా అన్నదానిపై శ్రద్ధ వహించాలి. ఎందుకంటే హెల్తీ ఫుడ్స్ ద్వారా జుట్టుకు పోషణ లభిస్తుంది. తెల్ల జుట్టును సహజంగా నల్లగా సరైన సమయంలో ఆహారంలో మార్పులు చేయకపోతే అది జుట్టుకు హాని కలిగిస్తుంది. విటమిన్ బి సమృద్ధిగా లభించే పాల ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవాలి. దీనితో పాటు విటమిన్ బి6, విటమిన్ బి12 కూడా ఉండే ఆహారాలని తినాలి. శరీరంలో విటమిన్ బి లోపం ఉంటే జుట్టుకు ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. బయోటిన్, ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల కూడా చిన్న వయస్సులోనే జుట్టు నెరుస్తుంది.

కాయధాన్యాలు, తృణధాన్యాలు, గింజలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, ఆకుకూరలు, గోధుమలు, పుట్టగొడుగులు, బఠానీ, పొద్దుతిరుగుడు గింజలు, అవకాడో, చేపలు, మాంసం, చిలగడదుంప, సోయాబీన్, బంగాళదుంప, బచ్చలికూర, అరటి, బ్రకోలీ, బీన్స్ ప్రతిరోజు డైట్‌లో ఉండేలా చూసుకోవడం వల్ల తెల్లజుట్టు సమస్యను వాయిదా వేయచ్చు.



గుడ్డులోని తెల్లసొన లేదా మజ్జిగతో కలిపి రుబ్బిన కరివేపాకు లేదా మెంతి ఆకు పేస్ట్‌ని తలకు ప్యాక్‌గా వేసుకోవాలి. రెండు గంటల తర్వాత గోరువెచ్చని నీటితో వాష్ చేసుకోవాలి. తలస్నానానికి తక్కువ గాఢత ఉన్న షాంపూలనే ఉపయోగించాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల తెల్లజుట్టు రాదు. వచ్చిన తెల్ల జుట్టు కాలక్రమేణా నల్లగా మారుతుంది.



మీ తలకు సరిపడేటన్ని మందార ఆకు తీసుకుని పేస్ట్ లా చేసుకుని అందులో కొబ్బరి నూనె కలిపి జుట్టుకి అప్లయ్ చేసి 2 గంటల తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయడం వల్ల తెల్లజుట్టు సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది.

తెల్ల జుట్టు సమస్యను అద్భుతంగా పారదోలే వాటిలో కాఫీ పొడి ఒకటి. ఓ గ్లాసుడు నీళ్లలో ఒకటిన్నర చెంచాల కాఫీ పొడిని మరిగించి చల్లారిన తర్వాత జుట్టు కుదుళ్లకు పట్టించాలి. వేళ్లను జుట్టు కుదుళ్లకు తగిలేలా మసాజ్ చేస్తుండాలి. ఇలా చేసిన 30 నిమిషాల తర్వాత తల స్నానం చేయాలి.





తెల్ల జుట్టు ఉన్న వారు పెనంపై రెండు చెంచాల పసుపును వేసి వేడి చేసి నల్లగా మారేంత వరకు మాడ్చాలి. చల్లారిన తర్వాత దీనికి సరిపోయేంత కొబ్బరినూనె లేదా నువ్వులనూనెలో కలిపి తలకు పట్టించాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు ఎక్కువ కాలం నల్లగా ఉంటుంది.



తల స్నానానికి గోరు వెచ్చని నీళ్లు మాత్రమే వాడాలి. హెర్బల్ హెన్నా లో బీట్ రూట్ రసం కలిపి ప్యాక్ వేసుకున్నా జుట్టుకు మంచి రంగు వస్తుంది.



హెన్నా పౌడర్ ను ఆముదంలో మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ పై నుంచి దించి చల్లారిన తర్వాత దానిని జుట్టు కుదుళ్లకు అంటుకునేలా రాయాలి. ఆ తర్వాత కుంకుడు కాయ లేదా శీకాయతో తలస్నానం చేయాలి.





మీ ఎముకలు ఎంత బలమైనవండి?



వయసు పెరుగుతున్నకొద్దీ ఎముకలకు సంబంధించి అనేక సమస్యలు వస్తాయి. పాత ఎముకల్లోని మృత కణాలు నశిస్తాయి, కొత్తవి పుట్టుకొస్తాయి. ఇదో సహజమైన ప్రక్రియ. చిన్నపిల్లలు, యువకులలో ఇది వేగంగా జరుగుతుంది. మూడుపదుల వయసులో మనిషి ఎముకల సాంద్రత పరిపూర్ణ స్థితికి చేరుకుంటుంది. ఆ తర్వాత క్షీణిస్తూ పోతుంది. ఈ నేపథ్యంలో ఎముకల ఆరోగ్యానికి సూచనలు..

శరీరంలోని అవయవాలను కాపాడటం, కండరాలు సాఫీగా పనిచేసేలా చూడటం, క్యాల్షియంను భద్రపరచడం.. ఎముకల ముఖ్య విధి. అయితే కొందరిలో చిన్న వయసులోనే ఎముకలు పెళుసు బారతాయి. కొందరిలో తొందరగా అరిగిపోతాయి. వ్యాధి వచ్చాక ఉపశమన చర్యలు తీసుకోవడానికి బదులు రాకుండా నివారించడం మంచిది.

ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో విటమిన్-డి ది కీలక పాత్ర. ఎందుకంటే శరీరం క్యాల్షియాన్ని శోషించుకోవడానికి సహకరించేది ఇదే. అందుకే విటమిన్-డి కొరత ఉన్న వారిలో ఎముకల సాంద్రత తక్కువగా ఉంటుంది. విటమిన్-డి తగినంత తీసుకునే వారితో పోలిస్తే, తీసుకోని వారిలో ఎముకల క్షీణత ఎక్కువ. ఉదయం, సాయంత్రం కొద్దిసేపు ఎండలో గడపటం, చీజ్, కొవ్వులు ఎక్కువగా ఉన్న చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరంలో విటమిన్-డి నిల్వలను పెంచుకోవచ్చు.

వ్యాయామం

ఎముకలు బలంగా ఉండాలంటే.. శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడం లాంటివి ఇందుకు దోహదపడతాయి. ఈ వ్యాయామాలు ఎముకల కణాల పెరుగుదలకు సాయపడతాయి.

సమతుల ఆహారం

విటమిన్-సి, ప్రొటీన్లు, క్యాల్షియం సమృద్ధిగా ఉన్న ఆహారంతో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రొటీన్లు, కూరగాయలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే.. ఎముకలు క్యాల్షియంను శోషించుకునే సామర్థ్యం తగ్గుతుంది. దాంతో ఎముక మీద దుష్ప్రభావం పడుతుంది. ఎక్కువ ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకుంటే రక్తంలో ఆమ్లత్వం పెరుగుతుంది. అందుకని తగు మొత్తంలోనే తీసుకోవాలి.

సరైన జీవనశైలి

పోషకాలతో కూడిన సమతులాహారం, ఆరోగ్యకరమైన బరువు ఎముకల బలోపేతానికి ఉపకరిస్తాయి. బరువు ఎక్కువైనా, మరీ తగ్గినా ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యలు చుట్టుముట్టవచ్చు. బరువు తక్కువ ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ ముప్పు ఉంటుంది. బరువు ఎక్కువగా ఉంటే ఎముకలు పెళుసు బారిపోవచ్చు. అందువల్ల బరువును బట్టి ఎలాంటి ఆహారం... ఎంత తీసుకోవాలో అంతే తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



కొంతమందికి బస్సులో లేదా రైలులో ప్రయాణిస్తున్నప్పుడు వికారంగా అనిపించడంతోపాటు తలనొప్పి, వాంతులు వస్తాయి. ఇలాంటి పరిస్థితిని మోషన్ సిక్‌నెస్ అంటారు. ఇది రాకుండా ఉండాలంటే లాంగ్ జర్నీ చేయాల్సి వచ్చినప్పుడు టీ, కాఫీల వంటివి తాగకూడదు.అలాగే ఖాళీ కడుపుతో కూడా ఉండకూడదు. సులభంగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారాలని తీసుకోవాలి. నోటిలో ఒకటి రెండు యాలకులు పెట్టుకోవాలి. ఇది వికారం సమస్యని తొలగిస్తుంది. ప్రయాణం చేసేరోజు ఖాళీ కడుపుతో అర టీస్పూన్ నల్ల ఉప్పు, నిమ్మకాయ రసం, తేనె కలిపి తాగితే గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు దరిచేరవు. ప్రయాణంలో నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లను తింటూ ఉండాలి. అరగ్లాసు నీటిలో చెంచాడు యాపిల్ సిడార్ వెనిగర్ కలిపి పరగడుపున తాగితే వాంతులు రావు.



కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తీసుకుని తినాలి. దీంతో మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. రాత్రిపూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం తిన్నా సమస్య నుంచి బయటపడచ్చు..



ఒకటి రెండు జామాకులను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని నీటిలో వేసి పది నిమిషాల పాటు మరిగించాలి. ఆ నీటిని వడకట్టి అందులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి హెర్బల్ టీ మాదిరిగా తాగాలి. రోజుకు ఇలా రెండు సార్లు తాగితే చాలు, స్త్రీలకు నెలసరి సమయంలో వచ్చే నొప్పులు రాకుండా ఉంటాయి. షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. చర్మం కాంతిమంతంగా... మృదువుగా తయారవుతుంది.

సినిమా

చేపల వేటలో..



● నాగచైతన్య

మత్స్యకారుల జీవితం గురించి తెలుసుకునే పని మీద నాగచైతన్య శ్రీకాకుళం, వైజాగ్ వెళ్లిన విషయం తెలిసిందే. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై 'బన్నీ' వాసు ఓ సినిమా నిర్మించనున్నారు. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుంది. ఈ సినిమా కోసమే టీమ్ కసరత్తులు చేస్తోంది. గురువారం శ్రీకాకుళంలోని మత్స్యకారులను స్వయంగా కలిసి, వారి సంస్కృతి, జీవనశైలిని అడిగి తెలుసుకున్నారు చైతన్య, చందు, 'బన్నీ' వాసు. శుక్రవారం వైజాగ్ పోర్టును సందర్శించారు. మత్స్యకారులతో కలసి చేపల వేటకు వెళ్లారు. సముద్ర ప్రయాణం, వేట, అక్కడ ఎదురయ్యే పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

బెస్ట్ గిఫ్ట్

'తంగలాన్' సినిమా కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు హీరోయిన్ మాళవికా మోహనన్. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ 'తంగలాన్'. ఈ చిత్రంలో పార్వతి, మాళవికా మోహనన్ హీరోయిన్లు. కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఆగస్టు 4) మాళవికా మోహనన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్'లోని ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. 'బెస్ట్ బర్త్ డే గిఫ్ట్' అని ఈ పోస్టర్‌ని ఉద్దేశించి మాళవిక ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో గిరిజన యువతిగా ఆమె నటిస్తున్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలన కొనసాగుతున్నప్పుడు కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ వద్ద ఆక్రమణలకు ఎదురు నిలిచిన ఓ గిరిజన తెగ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని సమాచారం.



● మాళవికా మోహనన్

టైటిల్ బాగుంది

- ఎమ్మెల్సీ కవిత

''సౌండ్ పార్టీ' టైటిల్, పోస్టర్ ఆసక్తిగా ఉన్నాయి. కాన్సెప్ట్ వినోదాత్మకంగా ఉంటుందనిపిస్తోంది. ఈ చిత్రం హిట్ అవ్వాలి'' అన్నారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. వీజే సన్నీ, ప్రీతికా



● వీజే సన్నీ, కవిత

శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను కవిత ఆవిష్కరించారు. ''త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాతలు.

టీఎఫ్‌సీసీకి ప్రభుత్వ గుర్తింపు లేదు

● తెలుగు, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి

''తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' (టీఎఫ్‌సీసీ) తెలంగాణ ప్రభుత్వంచే గుర్తింపు పొందలేదు. ఆ ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న దుబాయ్‌లో నిర్వహించే నంది అవార్డు వేడుక ఆయన వ్యక్తిగతంతో పాటు ఓ ప్రైవేట్ వేడుక. ఈ నంది అవార్డు వేడుకకు, ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి)కు ఎలాంటి సంబంధం లేదు. ఈ వేడుకకి మేం భాగస్వామ్యం వహించం'' అని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కేఎల్. దామోదర్ ప్రసాద్, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ''తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి, ఏపీ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల వద్ద టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుకకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నది తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీకి మాతృసంస్థ. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాత్రమే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన సంస్థలు. 24-09-2023న దుబాయ్‌లో నిర్వహించనున్న టీఎఫ్‌సీసీ నంది అవార్డుల గురించి మా రెండు ఛాంబర్‌లకు సంబంధం లేదు. 'నంది' అవార్డు అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేటెంట్. నంది పేరును ఉపయోగించడం, అవార్డు వేడుక నిర్వహించడాన్ని ఖండిస్తున్నాం. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల వద్ద కూడా టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుకకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు'' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'నువ్వు కావాలయ్యా...' అంటూ 'జైలర్'లో హుషారుగా స్టెప్పులేశారు తమన్నా. ఈ బ్యూటీ కూడా సినిమా ఇండస్ట్రీకి మోస్ట్ వాంటెడ్. అందుకే దాదాపు 20 ఏళ్లయినా ఇంకా ఫుల్ బిజీగా ఉన్నారు. తమిళంలో 'అరణ్‌మణై', మలయాళంలో తొలి చిత్రం 'బాంద్రా', ఓ టీవీ షోతో బిజీగా ఉన్నారామె. చిరంజీవి సరసన తమన్నా నటించిన 'భోళా శంకర్' ఈ 11న విడుదల కానుంది. అంతకు ఒక్కరోజు ముందు రజనీకాంత్ 'జైలర్'తో థియేటర్లకు వస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర 'భోళా శంకర్'ని నిర్మించారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' రూపొందింది. రెండు చిత్రాలతో థియేటర్లకు రానుండటం, ఇతర విశేషాలు తమన్నాతో జరిపిన ఇంటర్వ్యూలో ఈ విధంగా...

మారకపోతే ఆగిపోతాం

- తమన్నా



ఈ నెల 10న 'జైలర్', 11న 'భోళా శంకర్' సినిమాలతో వస్తున్నారు. సో.. వచ్చే వారం మీకు స్పెషల్ అనొచ్చు...

విషయం ఏంటంటే.. ఒకటి తమిళ సినిమా, మరొకటి తెలుగు సినిమా అయినా రెండు సినిమాలూ అన్ని భాషల్లో థియేటర్లకు వస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవిగారు, సూపర్ స్టార్ రజనీకాంత్‌గారు.. ఇద్దరూ దేశంలో పెద్ద స్టార్స్. ఇలా ఒక్క రోజు గ్యాప్‌లో ఇద్దరు స్టార్స్‌తో సినిమా అంటే కల నెరవేరినట్లు ఉంది. ఈ రెండు మాత్రమే కాదు.. నేను చేసిన ఇంకో సినిమా కూడా రిలీజ్‌కు రెడీ అవుతోంది. అదొక మంచి ఫీలింగ్.

చిరంజీవి డ్యాన్స్ మామూలుగా ఉండదు... మీరు డ్యాన్స్‌లో బెస్ట్. అయితే మీ ఇద్దరికీ 'సైరా'లో డ్యాన్స్ చేసే చాన్స్ రాలేదు.. 'భోళా శంకర్'లో మీ కాంబో డ్యాన్స్ గురించి...

'మిల్కీ బ్యూటీ...' మంచి రొమాంటిక్ మెలోడి సాంగ్. ఈ పాటలో ఒక హుక్ స్టెప్ ఉంటుంది. మిగతా స్టెప్స్ కూడా గ్రేస్‌ఫుల్‌గా ఉంటాయి. చిరంజీవిగారి డ్యాన్స్ చాలా గ్రేస్‌ఫుల్‌గా ఉంటుంది. అందుకే మిగతా వారికి ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. పైగా శేఖర్ మాస్టర్ మంచి స్టెప్స్ డిజైన్ చేశారు. స్విట్జర్లాండ్‌లో ఈ పాట షూట్ జరిగింది. పెద్దగా రిహార్సల్స్ చేయలేదు. అక్కడికి అక్కడే నేర్చుకుని చేసేశాం. అలాగే ఇదే సినిమాలో 'జామ్ జామ్...' పాట కూడా నాకు చాలా ఇష్టం.

సీనియర్ హీరోలతో సినిమాలు చేసినప్పుడు... అంత సీనియర్స్‌తో ఎందుకు? అనే ప్రశ్న ఎదురవుతుంటుంది కదా...

ఇప్పుడు నా కెరీర్‌లో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. అన్ని రకాల యాక్టర్స్‌తో నటిస్తున్నాను. నాకన్నా చిన్నవాళ్లకు జోడీగా, నాకు సమానమైన ఏజ్ ఉన్నవాళ్లతో, సీనియర్లతో సినిమాలు చేస్తున్నాను. ఓటీటీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నాను. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఏజ్ గురించి పట్టించుకోలేదు. నేను యాక్టర్లను యాక్టర్లగా చూస్తాను. నా పాత్ర గురించి మాత్రమే ఆలోచిస్తాను. నా క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా అన్నదే నాకు ముఖ్యం. ఏజ్ వల్ల ఈక్వేషన్ ఏం మారదు.

దాదాపు 20 ఏళ్లుగా సినిమాలు చేస్తున్నారు. ఇంకా బిజీ బిజీగా సినిమాలు చేస్తూ రేస్‌లో దూసుకెళ్ల దానికి కారణం?

అస్సలు నేను ఇది రేస్ అనుకోను. చాలా చిన్న వయసులో కెరీర్ స్టార్ట్ చేశాను. జయాపజయాలనేవి మన చేతుల్లో ఉండవు. టీమ్ వర్క్ ముఖ్యం. ఒక్కోసారి కొన్ని విజయాలకు నేనూ కారణం అవుతాను. ఆ సంగతి పక్కనపెడితే.. కెరీర్‌లో ముందుకు వెళ్లాలంటే నిరంతరం హార్డ్‌వర్క్ చేయాలి. ఆ ఫోకస్‌తోనే వెళుతున్నాను.

ఈ మధ్య కొన్ని హద్దులను దాటి, బోల్డ్ క్యారెక్టర్స్ చేస్తున్నారు.. ఈ మార్పు గురించి?

మారకపోతే నేనెక్కడ మొదలయ్యానో అక్కడే ఆగిపోయినట్లే.. అలా ఆగిపోవాలని ఎవరూ అనుకోరు. ఎవరైనా కెరీర్‌లో ఎదగాలనే అనుకుంటారు. ప్రతీ జాబ్‌లో ప్రమోషన్ ఉన్నట్లే మా జాబ్ కూడా. ప్రమోషన్ కోసం కొంచెం బ్రాడ్‌గా ఆలోచించాలి.. కొత్త ప్రయత్నాలు చేయాలి. అప్పుడు జర్నీ ఇంకా లాంగ్‌గా, బెటర్‌గా ఉంటుంది.

'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో నటించిన అనుభవం గురించి?

మన చుట్టూ ఇప్పుడు రకరకాల మాటలు దొర్లుతుంటాయి. వాటిలో ఏది మంచో.. చెడో తెలుసుకోలేం. అందుకే 'లస్ట్ స్టోరీస్ 2' గురించి నాతో అభిమానులు, ఇంకా వేరేవాళ్లు బాగుందని అన్నప్పుడు కొత్త ప్రయత్నం రీచ్ అయిందనే ఆనందం కలిగింది. ముఖ్యంగా ఉమన్ వచ్చి బాగుందని అభినందించడంతో చాలా హ్యాపీ ఫీలయ్యాను.

ఇన్నేళ్లల్లో మీ గురించి రానటువంటి వార్తలు ఇప్పుడు వస్తున్నాయి.. ఫర్ ఎగ్జాంపుల్ నటుడు విజయ్ వర్మ, మీ గురించి ఎక్కువ ప్రచారమవుతోంది...

ఎవరో ఏదో మాట్లాడతారు. కానీ నేను ఎప్పుడు మీడియాతో మాట్లాడినా హానెస్ట్‌గానే మాట్లాడాను. ఇక ఎవరెవరో రూమర్స్ క్రియేట్ చేస్తే నేనేం చేయలేను.

పెళ్లి ప్లాన్ ఏమైనా?

ఇప్పటికైతే లేదు. ప్లాన్ చేసుకున్నప్పుడు కచ్చితంగా చెబుతాను.

రీల్స్

రజనీ సినిమాలో?



● నాని

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో నాని సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ ఓ కీలక పాత్రలో నటించనున్నారని ప్రచారం జరిగింది. తాజాగా హీరో నాని పేరు తెరపైకి వచ్చింది. కథ రీత్యా ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు నానీని చిత్ర యూనిట్ సంప్రదించిందని కోలీవుడ్ టాక్. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. సో.. ఈ సినిమాకి నానీని అడిగారా? లేదా అనేది త్వరలో తెలిసిపోతుంది.

ఈ నెలలో నేనేనా



● రెజీనా

రెజీనా ప్రధాన పాత్రలో నటించిన ఫ్యాంటసీ థ్రిల్లర్ తమిళ చిత్రం 'సూర్పనగై' (తెలుగులో 'నేనేనా'). కార్తీక్ రాజు దర్శకత్వంలో ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ నిర్మించిన చిత్రం ఇది. అక్షరా గౌడ, అలీ ఖాన్ , జై ప్రకాష్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాను ఈ నెల 18న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. 19వ శతాబ్దంతో పాటు ప్రస్తుత కాలంతో ఈ సినిమా కథ ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో రెజీనా రెండు పాత్రలు చేశారు. ఓ పాత్రలో ఆమె పురావస్తు శాస్త్రవేత్తగా కనిపిస్తారట.

రహస్యాలు ఏంటి?



● అనన్య

'మల్లేశం' చిత్రం ఫేమ్ అనన్య నాగళ్ల ప్రధాన పాత్ర చేస్తున్న చిత్రం 'తంత్ర'. ఈ సినిమా ద్వారా శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. దివంగత నటుడు శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ ఈ చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. పి. నరేష్ బాబు, రవి చైతన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'తంత్ర'. భారత తంత్ర శాస్త్రానికి చెందిన విస్తు గొలిపే రహస్యాలను ఈ సినిమా ద్వారా చెప్పబోతున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

మస్త్ మజారే...

'బేగంపేట కుర్రదాన్ని మామా... నేను మలక్‌పేట చిన్నదాన్ని..' అని మొదలై 'మస్త్ మజా.. మస్త్ మజా రే..' అంటూ సాగే పాట 'బాలుగాడి లవ్‌స్టోరీ' చిత్రంలోనిది. ఆకుల అఖిల్, దర్శక మీనన్ జంటగా నటించిన చిత్రం ఇది. శ్రీనివాస్ తేజ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, ఆకుల భాస్కర్ సమర్పణలో ఆకుల మంజుల నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంలో 'బేగంపేట కుర్రదాన్ని..' అంటూ సాగే స్పెషల్ సాంగ్‌ని విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఘనశ్యామ్ స్వరపరచగా, ఎల్. శ్రీనివాస్ తేజ్ రాసిన ఈ పాటను ఎమ్ఎమ్ మానసి ఆలపించారు.

సాక్షి బిజినెస్

శనివారం
5-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	481	65,721
నిఫ్టీ ▲	136	19,517

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,084	▲	125
డోజోన్స్	35,421	▲	234
ఎఫ్‌టీఎస్ఈ 100	7,564	▲	35
డాక్స్	15,952	▲	58
షాంఘై	3,288	▲	8
నికాయ్	32,193	▲	33

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,294	▽	16
బంగారం (99.5 స్వచ్ఛత)	59,057	▽	16
వెండి (కిలో)	72,000	▽	197

ఎన్‌ఎండీసీకి కొత్త లోగో



న్యూఢిల్లీ: ముడి ఇనుము ఉత్పత్తి దిగ్గజం ఎన్‌ఎండీసీ కొత్త లోగోను కేంద్ర పౌర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం ఆవిష్కరించారు. కంపెనీ భవిష్యత్ విస్తరణ, సామర్థ్యాలను ప్రతిబింబించేలా దీన్ని తీర్చిదిద్దారు. ముడి ఇనుము కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, స్వావలంబన సాధించే ప్రయత్నాల్లో కంపెనీ కీలకపాత్ర పోషించిందని సింధియా చెప్పారు. ఏటా 40 మిలియన్ టన్నుల ఉత్పత్తితో భారత్ అవసరాల్లో 16 శాతాన్ని తీరుస్తోందని పేర్కొన్నారు. ఎన్‌ఎండీసీ 2.0ని ప్రతిబింబించేలా కొత్త లోగోని తీర్చిదిద్దినట్లు సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ చెప్పారు. జాతీయ ఉక్కు విధానం 2030 లక్ష్యాల సాధనలో సంస్థ ప్రధాన పాత్ర పోషించగలదని పేర్కొన్నారు.

విశాఖలో ట్రయంఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం



ట్రయంఫ్ బైక్‌ను లాంచ్ చేస్తున్న వరుణ్ ప్రభుకిషోర్, ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్

విశాఖపట్టణం: ట్రయంఫ్ మోటార్ సైకిల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ విశాఖపట్టణంలో ప్రారంభమైంది. ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్‌లు ఈ షోరూంను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ మాట్లాడుతూ విశాఖ మార్కెట్‌లోకి 400 సీసీ ట్రయంఫ్ బైక్‌లను ప్రవేశపెట్టామన్నారు. కొత్త కస్టమర్లకు 16వేల కిలోమీటర్ల సర్వీసు విరామంతోపాటు, రెండేళ్ల అపరిమిత మైలేజ్ వారంటీతో, మూడేళ్ల వారంటీని అందిస్తున్నామన్నారు. 400 సీసీ బైక్, షోరూం ధర రూ.2.33 లక్షలు నుంచి అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోబైకింగ్ సర్వీసు వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పింగ్లే, ప్రోబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్, రీజినల్ మేనేజర్ రాహుల్‌లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ లాభం రికార్డ్

- క్యూ1లో రూ. 16,884 కోట్లు
- ఆదాయం రూ. 1,32,333 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం 178 శాతం దూసుకెళ్లి రూ. 16,884 కోట్లను తాకింది. ఒక త్రైమాసికంలో ఇది అత్యధికంకాగా.. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 6,068 కోట్లు ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం దోహదపడ్డాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సైతం నికర లాభం రూ. 7,325 కోట్ల నుంచి రూ. 18,537 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 94,524 కోట్ల నుంచి రూ. 1,32,333 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.91 శాతం నుంచి 2.76 శాతానికి, ఎన్‌పీఏలు 1 శాతం నుంచి 0.71 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.24 శాతం మెరుగై 3.47 శాతంగా నమోదయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 1.13 శాతం పుంజుకుని 14.56 శాతాన్ని తాకింది.

వడ్డీ ఆదాయం ప్లస్

క్యూ1లో ఎస్‌బీఐ మొత్తం ఆదాయం(స్టాండెలోన్) సైతం రూ. 74,989 కోట్ల నుంచి రూ. 1,08,039 కోట్లకు జంప్ చేసింది. వడ్డీ ఆదాయం రూ. 72,676 కోట్ల నుంచి రూ. 95,975 కోట్లకు బలపడింది. అయితే నికర వడ్డీ ఆదాయం 25 శాతం ఎగసి రూ. 38,905 కోట్లను తాకింది. పొదుపు ఖాతాల్లో 63 శాతం, రిటైల్ ఆస్తులలో 35 శాతం యోనో(డిజిటల్) ద్వారా పొందినట్లు బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖారా పేర్కొన్నారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో దాదాపు రూ. 490 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అయితే సంస్థ ఐపీవో ప్రణాళికలను పునరుద్ధరించే యోచనలో లేనట్లు స్పష్టం చేశారు. రుణ నష్టాలకు ప్రొవిజన్లు 38 శాతం తగ్గి రూ. 2,652 కోట్లకు చేరాయి. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నమోదైన రూ. 1,278 కోట్లతో పోలిస్తే 107 శాతం అధికమయ్యాయి.



ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 3 శాతం క్షీణించి రూ. 573 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 5.27 కోట్ల షేర్లు, బీఎస్‌ఈలో 27.42 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

క్యూ1లో ఎంఅండ్‌ఎం జోరు

రూ. 3,684 కోట్లకు నికర లాభం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అం డ్‌ఎం) ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 56 శాతం జంప్‌చేసి రూ. 3,684 కోట్లకు చేరింది. ఆటోమోటివ్ విభాగం ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,361 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 28,412 కోట్ల నుంచి రూ. 33,406 కోట్లకు ఎగసింది. ఇది 18 శాతం వృద్ధి. అయితే మొత్తం వ్యయాలు రూ. 26,195 కోట్ల నుంచి రూ. 30,492 కోట్లకు పెరిగాయి. ట్రాక్టర్ల బిజినెస్‌లో మార్కెట్ వాటా 42.9 శాతాన్ని తాకగా.. ఈ 3వీలర్ బిజినెస్‌లో 65.5 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నట్లు కంపెనీ ఆటో, ఫామ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో రాజేష్ జెజూరికర్ పేర్కొన్నారు.



బ్యాంకింగ్‌లోకి నో..

ఆర్‌బీఎల్ బ్యాంకులో మరిన్ని పెట్టుబడుల యోచన ప్రస్తుతానికి లేదని, భవిష్యత్‌లో వ్యూహాత్మక అవసరాలు ఏర్పడితే పరిశీలిస్తామని కంపెనీ ఎండీ, సీఈవో అనిష్ షా వెల్లడించారు. ప్రస్తుతం బ్యాంకింగ్‌లోకి ప్రవేశించే ప్రణాళికలేవీలేవని స్పష్టం చేశారు. జూలై 26న ఆర్‌బీఎల్ బ్యాంకులో 3.53 శాతం వాటాను ఎంఅండ్‌ఎం కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు 0.27 శాతం తగ్గి రూ. 1,465 వద్ద ముగిసింది.

పీసీల దిగుమతి లైసెన్సుకు ప్రత్యేక పోర్టల్

వివరాలన్నీ సక్రమంగా ఉంటే 4 రోజుల్లోనే జారీ

న్యూఢిల్లీ: పర్సనల్ కంప్యూటర్లు (పీసీ), ల్యాప్‌టాప్‌ల దిగుమతి లైసెన్సు కోసం కంపెనీలు/ట్రేడర్లు దరఖాస్తు చేసుకునేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ప్రత్యేక పోర్టల్ రూపొందించింది. వివరాలన్నీ సక్రమంగా ఉంటే దరఖాస్తు చేసుకున్న 3–4 రోజుల్లోనే లైసెన్సును జారీ చేయవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే రవాణాలో ఉన్న కన్‌సైన్‌మెంట్స్‌ను లైసెన్సు లేకుండా అనుమతిస్తారని వివరించాయి. పీసీలు, ల్యాప్‌టాప్‌ల దిగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దేశీయంగా ఐటీ హార్డ్‌వేర్ డివైజ్‌లను తయారు చేసుకునేందుకు భారత్‌కు తగినంత సామర్థ్యం ఉండటం వల్ల నియంత్రణల విధింపుతో కంప్యూటర్ల లభ్యతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

భద్రత కోసమే నియంత్రణలు..

దిగుమతైన కంప్యూటర్లలోని హార్డ్‌వేర్‌లో ఏవైనా లొసుగులు ఉంటే, వాటి నుంచి కీలకమైన వ్యక్తిగత, సంస్థాగత డేటాకు ముప్పు కలగకుండా భద్రత కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఇంటర్నెట్ విస్తృతి పెరుగుతుండటంతో ప్రజలు ఆన్‌లైన్ మోసాల బారిన పడే అవకాశాలూ మరింతగా పెరిగాయని చెప్పాయి. ఈ నేపథ్యంలోనే దేశం, దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతోనే ప్రభుత్వం



తాజా నియంత్రణలు విధించిందని అధికారులు తెలిపారు. అలాగే, చైనాతో వాణిజ్య సమతౌల్యం సాధించేందుకు కూడా ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు. టారిఫ్‌యేతర నియంత్రణలనేవి దిగుమతులపై నిషేధం కిందికి రావని, లైసెన్సు తీసుకున్న వారు దిగుమతి చేసుకోవచ్చని వివరించారు. అటు, హార్డ్‌వేర్.. సిస్టమ్స్ విశ్వసనీయమైనవిగా ఉండేలా చూసేందుకు, దిగుమతులను తగ్గించుకునేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఒక ట్వీట్ ద్వారా తెలిపారు. 2022–23లో ల్యాప్‌టాప్‌లు, పీసీల దిగుమతులు 5.33 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య వ్యవధిలో పీసీలు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఎలక్ట్రానిక్స్ దిగుమతుల విలువ 19.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

తాన్లా పన్ను పారదర్శకత నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పన్నుల వివరాల వెల్లడిలో మరింత పారదర్శకతను పాటిస్తూ సీపాస్ (కమ్యూనికేషన్ ప్లాట్‌ఫాం యాజ్ ఏ సర్వీస్) దిగ్గజం తాన్లా ప్లాట్‌ఫామ్స్ తొలిసారి 2023 ఆర్థిక సంవత్సరానికి గాను ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ నివేదికను ఆవిష్కరించింది. అనేక సంవత్సరాలుగా అసాధారణమైన పనితీరుతో తాన్లా తమ వాటాదారులకు మరింత విలువ చేకూరుస్తూ వస్తోందని గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ ఉదయ్ రెడ్డి తెలిపారు. పన్నులు చెల్లింపులతో పాటు, ప్రభుత్వాల తరఫున వసూళ్లకు తోడ్పాటు అందించడం ద్వారా అంతర్జాతీయంగా ఖజానాలకు రూ. 900 కోట్ల మేర సమకూర్చామని ఆయన పేర్కొన్నారు. పన్నులను తాము ఒక వ్యయంగా కాకుండా బాధ్యతగా చూస్తామని ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే గవర్నెన్స్‌కు పెద్ద పీట వేస్తూ, ఇన్వెస్టర్లకు వెల్లడించే వివరాల విషయంలో పారదర్శకతను పాటిస్తున్నామన్నారు. ఈ దిశగా తొలి ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ నివేదికను ఆవిష్కరించినట్లు వివరించారు. దేశీయంగా సీపాస్ పరిశ్రమలో 35% వాటాతో తాన్లా మార్కెట్ లీడరుగా కొనసాగుతోందని ఉదయ్ రెడ్డి తెలిపారు.

3 రోజుల నష్టాలకు చెక్

- సెన్సెక్స్‌కు 481 పాయింట్ల లాభం
- 19,500 ఎగువకు నిఫ్టీ

ముంబై: ఐటీ, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకు రంగాల షేర్లు రాణించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ షేర్లు ఒకటిన్నర శాతం లాభపడి తమ వంతు తోడ్పాటు అందించాయి. పిచ్ అమెరికా రుణ రేటింగ్ తగ్గింపు ప్రతికూలతల నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. ఉదయం సెన్సెక్స్ 213 పాయింట్లు పెరిగి 65,454 వద్ద, నిఫ్టీ 81 పాయింట్లు బలపడి 19,463 వద్ద మొదలయ్యాయి. ఆయా రంగాల షేర్లకు రోజంతా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 558 పాయింట్లు దూసుకెళ్లి 65,799 వద్ద, నిఫ్టీ 157 పాయింట్లు బలపడి 19,539 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. చివరి అరగంటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీలు కొంత మేర లాభాలు కోల్పోయాయి. చివరికి సెన్సెక్స్ 481 పాయింట్లు పెరిగి 65,721 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 136 పాయింట్లు బలపడి 19,517 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.8 లక్షల కోట్లు పెరిగి రూ. 304.09 లక్షల కోట్లకు చేరింది.



ఆయిల్ ఇండియాకు మహారత్న హోదా

ఓఎన్‌జీసీ విదేశ్‌కు నవరత్న

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ ఇండియా (ఓఐఎల్)తాజాగా 'మహారత్న' హోదాకు అప్‌గ్రేడ్ అయ్యింది. దీనితో సంస్థ బోర్డుకు ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో మరింత స్వేచ్ఛ లభించనుంది. అప్‌గ్రేడ్ అనంతరం మహారత్న హోదా గల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్‌ఈ) ఓఐఎల్ పదమూడో సంస్థగా నిలవనుంది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ ఈ విషయాలు వెల్లడించింది. అలాగే, ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్)ను నవరత్న సీపీఎస్‌ఈగా అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించింది.



సాక్షి స్పోర్ట్స్



సానియా–షోయబ్ మధ్య విభేదాలు!

ముంబై: భారత స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా తన భర్త, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో విడిపోయిందా! గతంలో కూడా పలుమార్లు వీరి విడాకులపై పుకార్లు రావడం, వాటిని సన్నిహితులు ఖండించడం జరిగాయి. అయితే ఈసారి జరిగిన పరిణామం మరోసారి అదే అనుమానాన్ని రేకెత్తిస్తోంది. షోయబ్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి రిలేషన్‌షిప్ స్టేటస్‌లో చేసిన మార్పుతో ఈ చర్చ మొదలైంది. ఇప్పటివరకు షోయబ్ ప్రొఫైల్‌లో 'సూపర్ ఉమన్ సానియా హజ్బెండ్' అంటూ ఉండగా, ఇప్పుడు మారి 'ఫాదర్ టు వన్' అని వచ్చింది. దీంతో వీరిద్దరు విడిపోయారని వార్తలు వస్తున్నాయి. అయితే ఇది వారి వ్యక్తిగత వ్యవహారమని, దీనిపై ఏ రకంగా వారు స్పందించదల్చుకోలేదని సానియా కుటుంబ వర్గాలు వెల్లడించాయి. సానియా, షోయబ్ మధ్య 2010లో పెళ్లి జరగ్గా... 2018లో కొడుకు ఇజ్‌హాన్ పుట్టాడు.

కాంస్యంతో జ్యోతి జాతీయ రికార్డు



చెంగ్డూ (చైనా): భారత స్టార్ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మరో ఘనత సాధించింది. ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయ అథ్లెట్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి 12.78 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో 12.82 సెకన్లతో గత ఏడాది తానే నెలకొల్పిన జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టింది. గత నెలలో ఆసియా చాంపియన్‌గా నిలిచిన జ్యోతి తదుపరి ఈనెల మూడో వారంలో హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతుంది. అథ్లెటిక్స్‌లో శుక్రవారమే భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల 200 మీటర్ల విభాగంలో అమ్లాన్ బొర్గోహైన్ కాంస్య పతకం సాధించాడు. అమ్లాన్ 20.55 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం భారత జట్టు 11 స్వర్ణాలు, 5 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి మొత్తం 25 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

భారత్, జపాన్ మ్యాచ్ 'డ్రా'



హర్మన్‌ప్రీత్

చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత్ తమ రెండో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. శుక్రవారం జపాన్‌తో జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. ఇరు జట్ల ఆటగాళ్లు ఆరంభం నుంచే పట్టుదల కనబరచడంతో మ్యాచ్ ఆఖరిదాకా పోటాపోటీగా సాగింది. రెండో క్వార్టర్ ముగిసే దశలో జపాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెన్ నగయొషి (28వ ని.లో) గోల్‌గా మలచడంతో జపాన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం మూడో క్వార్టర్‌లో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా గోల్‌పోస్ట్‌లోకి నెట్టాడు. స్కోరు సమం కాగా... ఆఖరి క్వార్టర్‌లో మరో గోల్ నమోదు కాలేదు. ఇతర మ్యాచ్‌ల్లో మలేసియా 5–1తో చైనాపై ఘనవిజయం సాధించగా... డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన పోరు కూడా 1–1తో 'డ్రా' అయ్యింది. ఆదివారం జరిగే తదుపరి లీగ్ మ్యాచ్‌లో భారత్... మలేసియాతో తలపడుతుంది.

ఆర్‌సీబీ హెడ్ కోచ్‌గా ఫ్లవర్



బెంగళూరు: ఐపీఎల్‌లో ఒక్కసారి కూడా విజేతగా నిలువలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి కోచింగ్ బృందంలో కీలక మార్పు చేసింది. జట్టు హెడ్ కోచ్‌గా జింబాబ్వే మాజీ కెప్టెన్, కోచింగ్‌లో అపార అనుభవం ఉన్న ఆండీ ఫ్లవర్‌ను ఎంపిక చేసింది. దాంతో ఇప్పటి వరకు హెడ్ కోచ్‌గా ఉన్న సంజయ్ బంగర్‌తో పాటు క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ హోదాలో టీమ్‌ను పూర్తి స్థాయిలో నడిపించిన మైక్ హెసన్‌పై వేటు పడినట్లయింది. నాలుగు సీజన్ల పాటు హెసన్ డైరెక్టర్‌గా పని చేయగా... మూడుసార్లు ప్లే ఆఫ్స్‌కు చేరిన బెంగళూరు 2023 సీజన్‌లో ఆరో స్థానంతో ముగించింది. అయితే ఈ ప్రదర్శన ఆర్‌సీబీ యాజమాన్యానికి సంతృప్తినివ్వలేదు.

మూడో రౌండ్‌లో అర్జున్



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ కప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 'టైబ్రేక్' ద్వారా ఫలితం తేలిన రెండో రౌండ్‌లో అర్జున్ 3.5–2.5తో అజరోవ్ (రష్యా) పై గెలిచాడు. భారత్‌కే చెందిన విదిత్ 4.5–3.5తో దిమిత్రోస్ (గ్రీస్)పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరగా... ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 1.5–2.5తో నకమురా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. మహిళల విభాగంలో మేరీఆన్‌గోమ్స్ (భారత్) 2.5–1.5తో కాటరీనా లాగ్నో (రష్యా)ను ఓడించింది.

భారత్ బాణం బంగారం

బెర్లిన్‌లో భారత మహిళల బృందం అద్భుతం చేసింది. గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి దేశానికి స్వర్ణ పతకాన్ని అందించి కొత్త చరిత్రను లిఖించింది. ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు 1931లో మొదలు కాగా భారత ఆటగాళ్లు మాత్రం 1981 నుంచి ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు. తాజా పసిడి పతక ప్రదర్శనకంటే ముందు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 11 పతకాలురాగా అందులో తొమ్మిది రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. ఈ పతకాల సరసన తొలిసారి పసిడి పతకం వచ్చి చేరింది.

ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణం

- చరిత్ర సృష్టించిన జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్ కౌర్ బృందం
- మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో విశ్వవిజేతగా భారత్



జ్యోతి సురేఖ

బెర్లిన్ (జర్మనీ): ఎట్టకేలకు భారత ఆర్చరీ పసిడి కల నెరవేరింది. ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో ఎంతోకాలంగా ఊరిస్తున్న స్వర్ణ పతకం మన దరి చేరింది. తెలుగుతేజం వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర అమ్మాయి అదితి స్వామి, పంజాబ్ క్రీడాకారిణి పర్ణీత్ కౌర్ బాణాల గురికి భారత్ ఖాతాలో బంగారు పతకం వచ్చింది. శుక్రవారం జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్‌లతో కూడిన భారత జట్టు 235–229 పాయింట్ల తేడాతో డాఫ్నీ క్వింటెరో, అనా సోఫియా హెర్నాండెజ్ జియోన్, ఆండ్రియా బెసెరాలతో కూడిన మెక్సికో జట్టుపై గెలిచి విశ్వవిజేతగా అవతరించింది. 2017, 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఫైనల్ చేరిన భారత జట్టు రజత పతకాలతో సరిపెట్టుకోగా... మూడో ప్రయత్నంలో మాత్రం పసిడి స్వప్నాన్ని సాకారం చేసుకుంది. భారత బృందం స్వర్ణం నెగ్గడంలో సీనియర్ జ్యోతి సురేఖ కీలకపాత్ర పోషించింది. తొమ్మిదోసారి ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న 27 ఏళ్ల జ్యోతి సురేఖ ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తోంది. మెక్సికోతో జరిగిన ఫైనల్లో భారత జట్టు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా నాలుగు సిరీస్‌లలోనూ పైచేయి సాధించింది. ఒక్కో సిరీస్‌లో జట్టులోని ముగ్గురు సభ్యులు రెండు బాణాల చొప్పున మొత్తం ఆరు బాణాలు సంధిస్తారు. తొలి సిరీస్‌లో భారత్ 59–57తో, రెండో సిరీస్‌లో 59–58తో... మూడో సిరీస్‌లో 59–57తో.. నాలుగో సిరీస్‌లో 58–57తో ఆధిక్యం సంపాదించి చివరకు 235–229తో విజయం సాధించింది. నేడు జరిగే వ్యక్తిగత విభాగం నాకౌట్ దశ మ్యాచ్‌ల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్, అదితి పోటీపడనున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో పర్ణీత్‌తో జ్యోతి సురేఖ, సాన్ డి లాట్ (నెదర్లాండ్స్)తో అదితి ఆడతారు. గెలిస్తే జ్యోతి, అదితి సెమీఫైనల్లో తలపడతారు.



స్వర్ణాలతో అదితి, పర్ణీత్, జ్యోతి సురేఖ

12 ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్ నెగ్గిన మొత్తం పతకాలు. ఇందులో ఒక స్వర్ణం, తొమ్మిది రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి.

7 ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో జ్యోతి సురేఖ గెలిచిన మొత్తం పతకాలు. 2021లో మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో 3 రజత పతకాలు. 2017లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో ఒక రజతం. 2019లో మహిళల టీమ్ విభాగంలో, వ్యక్తిగత విభాగంలో 2 కాంస్య పతకాలు... 2023లో మహిళల టీమ్ విభాగంలో ఒక స్వర్ణం.

ఈ పతకం ఎంతో ప్రత్యేకం

ఈసారి ఎలాగైనా స్వర్ణ పతకం సాధించాలనే లక్ష్యంతో వచ్చాం. గతంలో రజత, కాంస్య పతకాలు గెలిచా. ఇది కేవలం ఆరంభం మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని పసిడి పతకాలు సాధిస్తాం. తొలి స్వర్ణం కావడంతో ఈ పతకం నాతోపాటు నా సహచరులకు ఎంతో ప్రత్యేకం. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పలు పతకాలు నెగ్గినా స్వర్ణం మాత్రం దక్కలేదు. ఈసారి బంగారు పతకం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉన్నాను. నేడు వ్యక్తిగత విభాగంలో పోటీపడుతున్నాను. ఇందులోనూ స్వర్ణం గెలవడమే నా లక్ష్యం. నేనీస్థాయికి చేరుకోవడానికి ఎల్లవేళలా మద్దతు ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. –జ్యోతి సురేఖ



క్వార్టర్స్‌లో సింధు, శ్రీకాంత్ అవుట్

సెమీస్‌లో ప్రణయ్‌తో ప్రియాన్షు 'ఢీ' • ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సిడ్నీ: ఈ సీజన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఏ టోర్నీలో ఆడినా నిరాశ తప్పడంలేదు. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆమె క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 12–21, 17–21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల ఈవెంట్‌లో మాత్రం మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్, యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్ చేరగా, మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు క్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. ఆరో సీడ్ ప్రణయ్ 16–21, 21–17, 21–14తో టాప్‌సీడ్ ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా)పై పోరాడి గెలుపొందగా, ప్రియాన్షు 21–13, 21–8తో శ్రీకాంత్‌కు షాక్ ఇచ్చాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


Reliance
Growth is Life
ప్రతి రోజు, ప్రతి వస్తువు
తక్కువ ధరకు పొందాలనుకుంటున్నారా?
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
SMART BAZAAR
కనీసం 5% తక్కువ ఎమ్ఆర్‌పి పై ప్రతిరోజు
చక్కెర 1kg ₹9 ప్రతిరోజు
*₹1999 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై
SMARTBazaar | @smart_bazaar | @SMARTBazaarIn | @smartbazaarIndia
ఫార్చ్యూన్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 5 ℓ + దావత్ రోజానా గోల్డ్ బాస్మతి రైస్ 5 kg
మా ధర ₹979 కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1205 ఆదా చేసుకోండి ₹226
లూజ్ (విడి) షుగర్ ఎస్ 1 kg
మా ధర ₹40 మార్కెట్ ధర ₹45
లూజ్ (విడి) హైదరాబాదీ బిరియానీ రైస్ 1 kg
మా ధర ₹104 మార్కెట్ ధర ₹125
కందిపప్పు 1 kg
మా ధర ₹145 మార్కెట్ ధర ₹150
ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
మా ధర ₹253 పొందండి ₹30 తగ్గింపు ఏదైనా వంట నూనెపై ఎమ్ఆర్‌పి ₹318 ఆదా చేసుకోండి ₹65
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
మా ధర ₹359/ ₹389 ఎమ్ఆర్‌పి ₹549/₹499 ఆదా చేసుకోండి ₹190/₹110
హెల్తీ హార్ట్ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్ 1 ℓ
మా ధర ₹102 ఎమ్ఆర్‌పి ₹149 ఆదా చేసుకోండి ₹47
హెరిటేజ్ అగ్‌మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 ℓ
మా ధర ₹559 ఎమ్ఆర్‌పి ₹730 ఆదా చేసుకోండి ₹171
వల్లభ పనీర్ 400 g
మా ధర ₹125 ఎమ్ఆర్‌పి ₹200 ఆదా చేసుకోండి ₹75
బిస్కెట్స్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 2 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹120 మొదలుకుని / యూనిట్
తాజ్‌మహల్ లీఫ్ టీ 500 g
ఆదా చేసుకోండి ₹57 ఎమ్ఆర్‌పి ₹425 మొదలుకుని మా ధర ₹368 మొదలుకుని
సన్‌ఫీస్ట్ యిప్పీ! మేజిక్ మసాలా నూడుల్స్ 420 g
30% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹85 మొదలుకుని మా ధర ₹60 మొదలుకుని
బూస్ట్ 500 g x 2 యూనిట్స్
ఆదా చేసుకోండి ₹150 ఎమ్ఆర్‌పి ₹615 మొదలుకుని మా ధర ₹465 మొదలుకుని
మాజా 1.2 ℓ
ఆదా చేసుకోండి ₹18 ఎమ్ఆర్‌పి ₹75 మొదలుకుని మా ధర ₹57 మొదలుకుని
కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూత్‌పేస్ట్ 500 g
ఆదా చేసుకోండి ₹80 ఎమ్ఆర్‌పి ₹294 మొదలుకుని మా ధర ₹214 మొదలుకుని
పియర్స్‌ప్యూర్ అండ్ జెంటిల్ / డవ్ క్రీమ్ బ్యూటీ సోప్ 125 g x 3 యూనిట్స్
ఆదా చేసుకోండి ₹80 ఎమ్ఆర్‌పి ₹252 మొదలుకుని మా ధర ₹172 మొదలుకుని
డవ్ షాంపూ 340 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹85 ఎమ్ఆర్‌పి ₹345 మొదలుకుని మా ధర ₹260 మొదలుకుని
మామీ పోకో / ప్యాంపర్స్ బేబీ ప్యాంట్స్ (S / M / L / XL) (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹265 మొదలుకుని ఎమ్ఆర్‌పి ₹799 మొదలుకుని మా ధర ₹534 మొదలుకుని
టైడ్ ప్లస్ డిటర్జెంట్ పౌడర్ 2 kg (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹55 ఎమ్ఆర్‌పి ₹260 మొదలుకుని మా ధర ₹205 మొదలుకుని
ఇండక్షన్ బేస్ నాన్-స్టిక్ కుక్‌వేర్ శ్రేణి తవా / ఫ్రైపాన్ / కడాయి (28 cm / 24 cm / 24 cm)
మా ధర ₹399 మొదలుకుని ఎమ్ఆర్‌పి ₹699 మొదలుకుని
cello LaOpala
ఓవల్‌వేర్ / మెలమైన్ / స్టీల్ డిన్నర్‌వేర్ (ఎంపిక శ్రేణి)
BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹62 మొదలుకుని
HAPPY LiViNG
ప్రింటెడ్ గ్లాస్ / స్టీల్ బాటిల్ శ్రేణి (500 ml / 1000 ml)
కనీసం 50% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని
SMART స్టైల్ సేల్
8th JUL - 31st AUG
60% వరకు తగ్గింపు
మెన్స్ వేర్ । వుమెన్స్ వేర్ । కిడ్స్ వేర్ ప్రారంభ ధర ₹149
6 యూనిట్ సెరామిక్ మగ్ సెట్
మా ధర ₹99 ఎమ్ఆర్‌పి ₹199 మొదలుకుని
బకెట్ 16 ℓ
మా ధర ₹99 ఎమ్ఆర్‌పి ₹237
HAPPY LiViNG Ulhaas
దిండు కవర్‌తో సహా డబుల్ బెడ్‌షీట్
మా ధర ₹399 ఎమ్ఆర్‌పి ₹1199
ఇండోర్/అవుట్‌డోర్ మ్యాట్ శ్రేణి (ఎంపిక శ్రేణి)
BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని
SMART BAZAAR
SMART SUPERSTORE
మీ నగరంలో 27 స్మార్ట్ స్టోర్స్ – మీకు సమీపంలో ఉన్న స్టోర్ ఏది?
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి